
# మొలకెత్తిన ముత్యం
## (వింధియా కథలు)

అనువాదం: కే.వి. శేషారావు/ ఏండీ సుందరేశన్



**MOLAKETTINA MUTYAM (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya's Tamil Short Stories)
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 3

First Edition, 2019
© KNS Family/Surviving Members

***Cover Design:*** Erin Heck

The cover illustration is from the ***Swadesamitran*** issue dated December 1, 1957. Used with permission.

The translator acknowledges with thanks the permission granted by various publications to use the illustrations from their publications.

***Photo Credits:***

Back Cover:

G.K. Vale & Co., Chennai, India

**Printed at:**

The Copy World
2001 3rd Street,
San Francisco, CA 94107
Phone: 415-647-3507

# మొలకెత్తిన ముత్యం

## (వింధియా కధలు)

**మూలం: తమిళం**

**అనువాదం:**

**కే.వి.శేషారావు/ఏండి సుందరేశన్**

**Published By**
**Kurinji Publications**
**10944 San Pablo Avenue # 610**
**El Cerrito, CA 94530, USA**
**Email:**
**rangan.sundaresan@gmail.com**

# ఇందులో. . .

## ముందు మాట

1. మొలకెత్తిన ముత్యం
2. పసి హృదయం
3 పాప ఏడ్చింది
4. అవును, రాతి మనసే!
5. కొంటె సాక్షి!
6. మనసంటే ఎంత చోద్యం!
7. ప్రేమ ఉన్న చోట . . .
8. ఆ రోజుల్లో . . .
9. ప్రయాణంలో . . .
10. చెదరని మనసులో సువాసన

# ముందు మాట

మా అక్కయ్య ఇందియా దేవి (1927-99) కథలన్నీ తెలుగులో అనువదించి ఎనిమిది సంపుటాలుగా ప్రచురించాలనే పథకంలో ఇది మూడవది; మొదటి సంపుటం మే 2018 లో, రెండవది మార్చ్, 2019 లో ప్రచురమైయ్యాయి.


ఇందులోని రెండు - ***పసి హృదయం***, ***పాప ఏడ్చింది*** - **కలైమగళ్ పత్రిక** కథానిక పోటీలలో పరంపరంగా 1949, 1950, లో బహుమతులు అందుకున్నాయి. ఇరవైయ్యవ శతాంబ్దంలో వెలుబడిన ***భారతి*** లాగే **కళైమగళ్** తమిళ సాహిత్యంలో మంచి పేరు, ప్రతిష్ట అందుకున్న మాస పత్రిక. ప్రసిద్ధమైన తమిళ రచయతలు తమ కథా శిల్పాన్ని మొట్టమొదట **కలైమగళ్** పత్రికలో ప్రదర్శించారు. వింధియా రాసిన మొట్టమొదటి కథ **పార్వతి** (ఇది వింధియా కథలు - సంపుటి 2 లో ఉంది) **కలైమగళ్** ఆగస్టు, 1947 సంచికలో వెలుబడింది. వింధియా సమకాలిక గ్రంధకర్తలు - అనుత్తమా, రాజం కృష్ణన్, గుగప్రియై, కుంజిదపాదం వంటివారు - ఆఖరివరకూ **కలైమగళ్** పత్రికలో రాస్తూనేవున్నారు.

ఎప్పటిలాగే ఈ సంపుటం గురించి మా కుటుంబ సభ్యులమధ్య సంప్రదింపులు చోటుచేసుకున్నాయి; వీటిలోని కథల గురించి మేం మాటాడుకున్నాం. కొన్ని కథల్లో హాస్యం ప్రధానంగా ఉందని గ్రహించి నాకు ఆశ్చర్యం కలిగింది. కథావస్తువులు అన్నమాటకి వస్తే, ఇవన్నీ ఉన్నాయి: వయసు పైబడుతున్న తల్లిదండ్రులు; ప్రేమ; సంసారంలోని సరిగమలు; పిల్లలు, వారి పెంకకం . . . అన్ని పాత్రలలోనూ సభ్యత, అనుకూల లక్షణాలు కనిపిస్తాయి.

ఈ సంపుటంకి సలహాలతో, సూచనలతో అడుగడుగునా తోడ్పడుతున్న అక్కయ్య సెల్వీ విశ్వనాధన్కి నా కృతజ్ఞతలు. ఇందులోని **పసి హృదయం** అనువదించిన మిత్రులు కే.వి. శేషారావుగారికి నా ధన్యవాదాలు.

జూలై, 2019 ఏండీ సుందరేశన్

# మొలకెత్తిన ముత్యం



భువనా దీపాన్ని రెప్ప వేయకుండా చూసింది; దాన్ని తులాంబరంగా శుభ్రంచేసి రెండు వారాలయ్యాయి. ఇప్పుడు దాన్ని నీళ్ళతో కడుగుదామంటే తనకి తీక్షణంగా ఆకలేస్తుందే? ఇప్పుడు దీపాన్ని తుడిచి, కుంకం పెట్టి పూజ ఆరంభిస్తే చాలా సమయం పడుతుంది . . .

దీపంకి నూనె వార్చాలని భువనా తొంగి చూసింది. ఒక ఈగ వత్తిలో అంటుకొని పడివుంది. వత్తిని చెయితో తీసినప్పుడు భువనా మనసులో ఏదో ఆలోచన లేచింది; దీపాన్ని తీసుకొని పెరడులోని బావి దగ్గరకి వెళ్ళింది. “నేను ఏ పని చేసినా తలకిందులుగానే చేస్తున్నాను!” అని బాహాటంగా తన్ను నొచ్చుకుంది.

“ఆ పనేదో రేపు చెయ్యవచ్చుగా? ఇప్పుడేం తొందర? నువ్వు ముందు భోంచెయ్!” అని పంచలో నిలబడి మట్టి కూజానుంచి నీళ్ళు తాగుతున్న ఆమె భర్త మాటలు వినిపించాయి; రఘుపతి ఆఫీసుకి బయలుతేరుతున్నాడు.

“రేపు శుక్రవారం; దీపం తోమకూడదు!”

“రేపు తోముతేనేకదా తలకిందుల పాట? మరెందుకు ఇప్పుడు అలాగన్నావ్?”

“అవును, అన్నాను, బాగా నవ్వండి! మీకు అన్నం వడ్డించడానికి ముందు నేనీ దీపం వెలిగించియుండాలి! కాకికి అన్నం పెట్టి మీకు వడ్డించాను. ఇప్పుడే తీరికగా ఈ దీపం వెలిగించుతాను . . . అందుకే అన్నాను . . . ”

“రోజూ పొద్దునే ఒకసారి నువ్వు దీపం వెలిగిస్తున్నావుకదా?”

“ఆహా, నేనెక్కడ పొద్దునే లేస్తున్నాను! ఆరుగంటలైన తరువాతేకదా? అది మహా పాపం . . . ”

రఘుపతి మరేం అనక ఊరుకున్నాడు. తెలివితక్కువగా మాటాడుతున్న భార్యతో వాదించడానికి ఇది మంచి సమయం కాదు. ‘ఇదిగో చూడు, మనం ఈ ఊరుని అనుసరించి మెలగాలి,’ అని అతను భువనాకి పదే పదే ఎంత చెప్పినా, ఆమె వినదే! పనిమనిషి పొద్దున ఆరున్నర గంటలకి వస్తోంది; పాలవాడు రావడం ఏడు గంటలకి; మరి భువనా ఎందుకు ఐదుగంటలకే లేవాలి? సరే, లేవనీ, దానికి ఎవరూ అడ్డు చెప్పరు! అసలు భువనాకి ఆరుగంటలకే మెలకువ వచ్చేస్తుంది. మొదటిరాత్రి పదిగంటలవరకూ పిల్లలతో సందడి. ఈ ఊరూ, వాతావరణం, అలాంటివి. ఊరు

నిద్రపోవడం చాలా ఆలస్యంగానే జరుగుతోంది. స్నేహితులు వీళ్ళని చూడడానికి రావడం, వీళ్ళు వాళ్ళని దర్శించడానికి వెళ్ళడం - ఇవన్నీ మెల్లగానే జరుగుతాయి. కాని భువనా ధోరణి వేరు. ఇదేం పిచ్చి? "పొద్దున్న హాయిగా నిద్రపోయే సౌఖ్యముందే- దాన్ని అనుభవించలేని జన్మ నీది!" అని రఘుపతి తరచుగా భార్యని ఎగతాళి చేసేవాడు, కాని ఆమె వింటేనా? ఎన్నిసార్లు పాడినపాటే పాడటం?

"నేను వెళ్తున్నాను! తలుపు మూసుకో!" అని రఘుపతి చెప్పి వెళ్ళాడు. 'హూం' అని భువనా జవాబు ఇచ్చింది కాని దానికి అగత్యం లేదని ఆమెకి తెలుసు. ఇప్పుడే తలుపు మూసేస్తే తక్కిన పనులు ఎలా జరుగుతాయి? పనిమనిషి పిండి పొడిచెయ్యడానికి మిల్లుకి వెళ్ళింది; అది తిరిగి రాగానే ఆ పొడితో ఏమైనా తినుబండారాలు చెయ్యాలే!

'సరేలే, ముందు నాకేమైనా పెట్టు!' అనే ఆకలి హెచ్చరిక వినగానే భువనా 'ఉత్తికే దీపం వెలిగించి, ఒక నమస్కారం చేసేసి, భోజనం చేస్తే చాలదా?" అనికూడా ఆలోచించింది; మామగారి బోధన గుర్తుకి వచ్చింది. అతను అనేవారు: 'దీపంకి కుంకం పెట్టి, కొత్త వత్తి వేసి, ఒక అగరుబత్తి వెలిగించి, దీపలక్ష్మికి ఒక నమస్కారం చేస్తే చాలు, స్త్రీలు మరేం పూజా చెయ్యనక్కరలేదు!' అని. 'సరే, ఈ రోజుమాత్రం అలా చేద్దామా?' అని భువనా అనుకుంది, కాని ఆమె మనసుకి అది కొరతగా కనిపించింది. అవును మరి! పెరడులో గన్నేరు చెట్టులో పువ్వులు గుత్తులు గుత్తులుగా ఉన్నాయి! ఇంతకుముందు ఈ ఇంటిలోవున్న ఎవరో పుణ్యస్త్రీ నాటిన చెట్టది; అందులోనుంచి ఓరెండు పువ్వులు తెచ్చి పూజా పీఠంలో పెడ్తే కళ్ళకి ఎంత సొగసుగా ఉంది! ఇవన్నీ చిన్నచిన్న పనులే, కాని అన్నిటికీ సమయం దొరకాలి; పది నిమిషాలైనా కావాలి. 'ఇదివరకే నేను చేసిన తప్పులు ఎన్నో?' అని ఆమె మనసు నిత్యమూ పీకులాడుతుందే?

దీపంని బాగా రుద్ది భువనా ఎండలో పెట్టింది. చెమటతో ఆమె రవిక తడిసిపోయింది. దాన్ని అలాగే బండరాయిమీద తీసిపారేసి కొత్త రవిక తొడుక్కుంది. వాళ్ల పెద్దబ్బాయి ఒక బుట్టలో పువ్వులు పోగుచేసిపెట్టాడు; భువనా తులసీ చెట్టులో కొన్ని ఆకులు గిల్లి తీసుకొనివచ్చి ఆ బుట్టలో వేసింది. పూజకి పువ్వులు

పోగుచెయ్యడంలో పెద్దబ్బాయితో పోటీపడే రెండవ అబ్బాయి జ్ఞాపకంలో వచ్చాడు; ఆ బుచ్చిగాడు తన వేలు గుంజుతూ అన్నయ్యని బెదిరించిన ధోరణి గుర్తుచేసుకొని ఇప్పుడు భువనా తనలో నవ్వుకుంది; అరచెయిలో కుంకం కలిపింది. ఎండిన దీపం ముఖంలో కుంకంతో బొట్టులు పెట్టింది. దాన్ని పూజగదికి తీసుకొనివచ్చి, దీపం వెలిగించి, 'ఈ తక్కిన విగ్రహాలు ఇంకోరోజు తోమాలి' అని అనుకుంటూనే ఇవాళ పూజకి సిద్ధమైంది.

"భువనీబాయ్! బెహన్!" అని ఎవరో పిలిచారు. ఎదురింటి గుజరాతీ స్త్రీ రమాబాయ్ ఇంట్లోకి ప్రవేశించారు; చారు చెయ్యడానికి 'రసం పొడరు' కావాలన్నారు. చారుచేసే పద్ధతిలో కొన్ని సంగతులు భువనాన్ని అడిగి తెలుసుకున్నారు. దానితో సంభాషణ ఐపోతుందా? "నీ 'నాస్తా' అయిందా?" అని అడిగారు.

"ఇవాళ ఇతను ఏడుగంటలకి ఆఫీసుకి వెళ్ళలేదు; ఇప్పుడే వెళ్ళారు. అతనికి ఎలాగో వడ్డించేసాను. వంట చెయ్యాలంటే నాకు కష్టంగా ఉంది; కాని చెయ్యకపోతే మనసుకి ఎలాగోవుంది! నాకిప్పుడు మంచి ఆకలి వచ్చేసింది!" అని చెప్పి భువనా నవ్వింది.

"కొంచెం ఆగమ్మా . . . నేను వెళ్ళి కొంచెం డోక్లా తీసుకువస్తాను!" అని రమాబాయ్ తొందరగా బయలుదేరారు.

"వద్దండి . . . ఇదిగో చూడండి; . . . నేను కంచెంకూడా పెట్టేసాను . . . " అని బతిమాలి భువనా ఆవిడని ఆపింది.

"స్నానం ఐపోయిందికదా?" అని మాటవాసికి ఆవిడ అడిగారు.

"ఎనిమిది గంటలకే స్నానం చేసేసాను! టిఫనుకూడా చెయ్యాలంటేనే స్నానంకి ఆలస్యమౌతుంది . . . ఈ ఎండలో చాలా ఉక్కగా ఉంది . . . చల్ల నీళ్ళలో స్నానం చేస్తే ఎంత బాగుంది!" అని భువనా నవ్వింది. తలెత్తి ఆ ముత్తైదువని చూడడానికే భువనా కలవరపడింది. చలికాలంలోనూ ఈ గుజరాతీలు చెంబులు చెంబులుగా చల్లనీళ్ళు తలపై పోసుకొని స్నానం చేస్తారు; ఆ తరువాతే టిఫను, కాఫీ, టీ, ఏదైనా. "మీ అత్తగారుకూడా కాఫీ తాగినతరువాతే స్నానం చేస్తారా?" అని ఎవరో భువనాని అడిగివున్నారు. "మా ఇళ్ళల్లో కాఫీ తాగడం ఆరుగంటలకే ఐపోతుంది!" అని భువనా

వాళ్ళకి సాకు చెప్పింది. ఇటువంటి కుటుంబాలమధ్య సంసారం చేస్తూ, వంటకి ముందే స్నానం చెయ్యడానికి తను పడుతున్న కష్టాలగురించి భువనా మనసులో తపన నిత్యమూ చోటుచేసుకునివుంది.

ఎలాగో కొంచెం శ్రమపడి రాత్రి పదిగంటలకి నిద్రపోతే, పొద్దున నెమ్మదిగా ముందుగా మెలకువ వస్తుంది; కాని అదే తనకి అసాధ్యంగా ఉందే! అపూర్వంగా కొన్నిరోజుల్లో, ప్రాతస్సంధ్యకి ముందే భువనా మేలుకుంటుంది. దానితో "సరే, దీన్ని నేనొక మంచి అలవాటుగా చేసుకోవాలి!" అని నమ్మకమూ అమెకు కలుగుతుంది. కాని, ఆ భాగ్యం కొన్ని రోజులకే; త్వరలో అది మెలికలు విడిపోయిన వత్తిలాగ ఐపోతుంది. ప్రాతఃకాలంలో ప్రపంచలోని జీవరాశులన్నీ సూర్యమూర్తికి స్వాగతం చెప్పే సమయంలో నిద్ర లేస్తే అదొక మధురమైన అనుభవం అని భువనాకి తెలిసినా ఆ నియమం స్థిరపఱచుకోవటం ఎంత కష్టమని ఆమెకి బోధపడింది. క్రమంగా రాత్రి పదకొండుకి పడుక్కొని, ఉదయం ఆరుగంటలకి లేవడమనేది అలవాటైయింది; అదొక మహా దోషం, మహా పాతకం అని ఆమె మనసు వేధించుతూనేవుంది; ఆ అపరాధం తల్లి పాలుకి పోటీపడే చంటిపాపలాగ పీడించుతోంది.

శ్రీరాములవారు వనవాసం వెళ్ళిపోయారు. తాతగారింటినుంచి అయోధ్యకి తిరిగివచ్చిన భరతుడు తన తల్లి చేసిన మోసం విని కంపించిపోయాడు, ఏడ్చాడు: "నాకుగాని ఈ కుట్రలో ఎటువంటి సంబంధం ఉన్నా అన్నివిధాల పాపాలూ నన్ను ఆకట్టుకోనీ: గోవధ చేసిన పాపం, శిసుహత్య చేసిన పాపం, బ్రహ్మ ముహూర్తంలో నిద్రపోయిన పాపం - ఇవన్నీ ఏకకాలంలో నన్ను దండించుగాక!" అని ఎడతెగకుండా దుఃఖించాడు.

'అరుణోదయంలో నిద్రపోతే మహాపాపం!' అని భరతుడు చెప్పాడని చదివి భువనా తెలుసుకోలేదు. ఐతే అది ఒక అసభ్యమైన పని అని ఆమె తెలుసుకున్నది నిజం. చిన్న రోజులనుంచే మాటలు, పాఠాలూ, సామెతలూ - వీటి మూలంగా ఆమె గ్రహించిన బోధన అది. అమ్మాయిగా సంగీత అభ్యాసంకోసం తెల్లవారు జామున లేవడం అమెకి అలవాటే. కాని ఇప్పుడు నలుగురు పిల్లలకి తల్లిగా, ఒక ఇల్లాలుగా బాధ్యత వచ్చేసిన

స్థితిలో, ఆ అలవాటు చోటుచేసుకోలేదు; ఊరూ, లోకమూ మారిపోవడమే అందుకు కారణం.

భువనాకి బొత్తిగా ఈ ఊరంటే ఏవగింపు వచ్చేసింది. ఒక పక్క పనిమనిషీ, పాలవాడూ రాబోయే సమయాల్లో తనకున్న ఇబ్బంది; మరోపక్క భర్త ఆఫీసుకీ, పిల్లలు బడికీ వెళ్ళవలసిన సమయాల్లో పొందిక లేకపోవడం; సంవత్సరంలో ఎనిమిది మాసాలు ఓర్చలేని చెమట పట్టించే శీతోష్ణ స్థితి; అంతేకాదు. ఇటీవల ఆమె దేహంలోని స్వభావమూ బాగా మారిపోయింది; ఇంతకుముందెప్పుడూ ఎరుగని బాధలు ఇప్పుడు ఆమె సహించి తీరాలి. ఎలాగో అన్నీ ప్రశ్నలూ సవరించుకొని కాపురం చేసినా - అంతా సముచితంగా సాగుతున్నట్టు బయటికి కనిపించినా - 'ఇందులో ఏదో లోపం ఉంది!' అని ఎక్కడనో ఒక చోట ఒక కోడిపుంజు కూత వినిపిస్తోంది! 'భర్తకి తరువాత నిద్రపోయి, భర్తకి ముందుగా మేలుకొనే ఆదర్శ ఇల్లాలు' అనే వ్యాఖ్యం అనుసరించి తను మెలగినా, అందులో సాహిత్య శోభ లేదనే అసంతృప్తి ఆమె మనసులో మిగిలింది.

'సరే, ఈ పూజనైనా చెయ్యాల్సిందే!' అని తన ఆకలి మరచిపోయి భువనా పూజకి కూర్చుంది.

"భువనమ్మా!" అని పిలుస్తూ పొరుగింటి ఆంధ్ర మహిళ వచ్చారు.

లేచి, "లోపలికి రండి!" అని భువనా స్వాగతం చెప్పింది.

"నువ్వొక చిన్న బ్రాహ్మణ పిల్ల కావాలన్నావుకదూ? దొరుకుతున్నట్టు కనిపిస్తోంది! కాని వచ్చే నెల మొదటి తారీఖు వరకూ మనం కాచుకొని ఉండాలట! మనం తొందరపడితే ఇలాగే వెనకాడుతారు, బేరం చెయ్యాలనుకుంటారు! . . . "

"అప్పుడు వచ్చినా చాలండి! నాకింకా రెండు మాసాలవరకూ టైముంది. అంతలోనే అమ్మాయికి ఇంటిపనులన్నీ అలవాటైపోతాయి; నాకూ పథ్యభోజనం చేసిపెడుతుంది. చూద్దాం, దేవీ దయ ఎలావుందో? మా అత్తగారిని ఇబ్బందిపెట్టకూడదని అనుకుంటున్నాను" అని చెప్పి భువనా ఆయాసంతో ఒక నిట్టూర్పు వదిలింది.

"బాగుంది, మేం నీకు తోడుగా ఉన్నాంగా! నీకెందుకా బెంగ? నీకేం భయం వద్దు! 'సరే' అని వాళ్ళకి చెప్పమంటావా?"

"సరే, చెప్పండి. ఇవాళా రేపూ అన్ని పనులూ చెయ్యాలని నేను ఆరుగంటలకే నిద్రలేస్తున్నాను. ఇక సాయం వచ్చిందంటే నా బద్ధకం ఇంకా పెరిగిపోతుందేమో? ఆ పిల్ల మెల్లగానే రానీ, మనం తొందర పడవద్దు!" అని చెప్పి భువనా నవ్వింది.

"నీకా బద్ధకం? రాత్రి పదకొండుకి నిద్రపోతే ఉదయం ఆరుగంటలకి లేవడం ఎలాగ? మన శరీరం అంత సుళువుగా సర్దుకుంటుందా? చూడు, నీ రవిక ఎలా తడిసిపోయిందో? మార్చుకో! ఇలావుంటే దేహంకి మంచిదికాదమ్మా!"

"నేనదే చేస్తున్నాను. రోజుకి అరడజను రవికలు తొడుగుతున్నాను! ఉక్క భరించకుండా ఉంది!"

"వయస్సులో నాకంటే చిన్నదానివి, కాని మడి, ఆచారాలు నువ్వు ఖచ్చితంగా పాటిస్తున్నావు . . . నాకూ మడి అంటే అపేక్ష ఉందమ్మా, లేదనను. కాని నీకేమో ఇడ్లీ, దోసా పిండి తయారికే చాలా శ్రమ, సమయం చాలదే! అది నాకు చేతకాదమ్మా . . . సరే, నీ పూజ అయిందా? అదీ నువ్వే అలవరించుకున్న అలవాటు! అదీ మంచిదే! భక్తి, శ్రద్ధలతో ఎది చేసినా అది గొప్పే! నేను శుక్రవారం మాత్రం పూజ చేస్తాను . . . " అని అంటూ ఆవిడ లోపలికి తొంగిచూసారు.

"నేనింకా పూజ ఆరంభించలేదు . . . "

"నువ్వెలా పూజ చేస్తావ్? నాకు చూడాలనివుందమ్మా . . . "

"చూడ్డానికి నా పూజలో ఏముంది?" అని భువనా తడబడతూ అడిగింది. మంచి వేళ, వచ్చినావిడ "అయ్యో, మరచిపోయానే! నేను పొయ్యిలో బాణలి పెట్టి వచ్చేసానమ్మా! నాకు కుంకం ఇయ్! నేను వెళ్ళాలి!" అని అంటూ నెత్తిలో బొట్టు పెట్టుకొని, గబగబని పరుగెత్తారు.

ఈ ఇంట్లో నలుగురు పిల్లలంటే ఆ మహిళ ఇంటిలో తొమ్మిదిమంది. ఆ పిల్లలు తల్లికి సాయం చేస్తారు. ఆవిడ నొగసుగా ఇంటిపనులు చేసే ఇల్లాలు; ఎది చేసినా నిదానంగానే చేస్తారు. కాని భువనాకి అది చేతకాదు; ఆమెకని కొన్ని అనివార్య ఆశలు, అభిరుచులు ఉన్నాయే! తమిళుల ఆచారంలో పెరగడం వలన ఇడ్లీ, దోసా, తప్పకుండా కావాలి; తమిళ బాషలో ఒక సామెతకూడా ఉంది: 'చినిగిన గుడ్డలు తొడిగినా వాటిని రోజూ ఉతికి శుభ్రం చేసుకోవాలి!' అని. "ఇంటిలో చెయ్యవలసిన చిన్న చిన్న పనులకి

పిల్లల్ని పిలవకు! వాళ్ళని వండగదికి రమ్మని అనకు! అబ్బాయిలందరూ చదువుకుంటున్నారు!' అని రఘుపతి ఆజ్ఞకూడా ఉంది; ఈ ఐదవ పాప ఆడపిల్లగా ఉంటుందా?

భువనా ఆకలి మరచిపోయింది! కానుపుగురించి ఆమె ఆలోచన మళ్ళింది: అవును, నిజం! సాయంకని ఆ బ్రాహ్మణ బాలిక వస్తే తనకి మరేం విచారమూ ఉండదు! ఆది ఆరుసెలలు ఉన్నా చాలు! ఇంతకుముందు సాయంకి వచ్చిన ఒక అబ్బాయిని, ఒక పెద్ద మనిషిని భువనా గుర్తుచేసుకుంది: వాళ్ళలాగ ఈ అమ్మాయి తన్ను ఏడిపించదుకదా?

ఇలా ఆలోచిస్తూ భువనా బాల్టీలో నీళ్ళు పోసి, కొన్ని బట్టలు వేసింది: మంచి ఎండ వ్యర్థమౌతోంది. ఇది వర్షాకాలం. గభీమని మబ్బు రావచ్చు . . . వీటన్నిటికీ పనిమనిషి సాయం దొరకదు . . .

ఇంటిపనుల్లో ఇంతకుముందు తనకి తోడుగావున్న మనుషలని భువనా గుర్తుచేసుకుంది: ఖర్చు కొంచెం ఎక్కువైనా లెక్కచేయక ఒక అబ్బాయిని ఎంచుకొని, వాడికి భోజన వసతి ఇచ్చి తన ఇంట్లో ఉంచుకుంది. ఇక బట్టలన్నీ తనే కుట్టాలి, దర్జీకి ఇచ్చే డబ్బు పొదుపుచెయ్యాలి అని ఆమె ఉద్దేశం. 'అయ్యో, పాపం! పిల్లవాడు!' అని జాలిపడి, వాడు చేసిన తప్పులు క్షమించి ఓర్పుతో, నయంగా వాడికి అన్ని పనులూ నేర్పించింది. ఆఖరికి ఆ అబ్బాయి తన అల్ప బుద్ధిని చూపించేసాడు: మరెవరికో తోడుదొంగగా పనిచేస్తూ మెల్ల మెల్లగా ఈ ఇంటి సరకులు దోచుకోవడం ఆరంభించాడు. వాడిని వెళ్ళగొట్టిన తరువాత ఇంకొక ఘటన. నలభైయేళ్ళ బ్రాహ్మణుడొకడు " అమ్మా, నౌకరి కావాలి, నాది దిక్కుమాలిన బతుకు, ఆకలేస్తుంది!" అని ఏడ్చాడు. ఆ సమయంలో ప్రసవంకి భువనా అత్తగారు వస్తారని ఏర్పాటు. అందువలన భువనా అతన్ని పనిలో అమర్చింది. వాడొక పిసినారి: రొట్టిని పెనంలో వేసినతరువాత నెయ్యికి బదులు ఓరెండు బొట్లు నీళ్ళు జల్లేసి దాన్ని మెత్తపడేటట్టు చేసి "ఇది చాలా బాగుంటుంది!" అని వాదించేవాడు. ఒక బియ్యం గింజ ఐనా సరే, నేల పడిపోతే, దాన్ని గుచ్చియెత్తి డబ్బాలో వేస్తాడు. పప్పు గింజ - కంది పప్పు, సెనగ పప్పు, మినప్పప్పు - ఎదైనా సరే - దాన్ని తీసి జాగ్రత్తగా తగిన డబ్బాలో చేర్చుతాడు.

“ఎందుకయ్యా, ఆ గింజని ఏ చీమా, పిచికా తీసుకుపోనీ!” అని భువనా చెప్తే వినడు. ఇలాగ తన ‘బాధ్యతని’ ఎలాగో నెరవేర్చి ఆ పిచ్చి బ్రాహ్మణుడు ఒక నెల నౌకరీచేసి వెళ్ళాడు.

అతనికీ, అంతకుముందు పనిచేసిన అబ్బాయికీ, బీడీ తాగే అలవాటు ఉందని తెలుసుకున్న తరువాత భువనా చాలా బాధపడింది. ‘ఎందుకురా ఆ ఎంగిలికాయలని ఇంటిలో పనికి పెట్టుకున్నాను!’ అని తన్నే తిట్టుకుంది, మొత్తుకుంది. ఆ రోజే ‘నేను మడితో అన్నిపనులూ చేస్తున్నాను, నాకేం దోషం లేదు!’ అని ఆమె మనసుకు ఊఅట కలిగింది. అసలు ఇప్పుడుకూడా ఆమె పాటించే నియమం, శుభ్రతలో పొరపాటు జరిగిందని ఎవరైనా ఎత్తి చూపగలరా? ఆమె ఆరాటమంతా ప్రాతఃకాలంలో నిద్రపోకుండా ఉండడం తనకి అసాధ్యంగా ఉందనే. ఆమె ఒక మధ్యతరగతి స్త్రీ; చాలా బాధ్యతలు తలమోసే ఇల్లాలు. అందుకోసమే, అమె పొద్దున్నే లేసితీరాలి! సంకల్పం చేసుకున్నా ఆఖరికి నిరాశే మిగలాలా?

ఐనప్పటికీ భువనాకి ఒకటే ఆశ్చర్యం! ఎట్లాగో, ఏ చీకూచింతా లేని జడంగా తను అరుణోదయంలో నిద్రపోయినా, ఇంటిపనులన్నీ నియమంగానే జరుగుతున్నాయి! కాని స్నానం చెయ్యకుండా వంట, దాని తరువాత బట్టలు ఉతకడం - ఇవన్నీ దుర్నీతి కాదా? ఒక తడిసిన బట్టని ఎండబెట్టకుండా ఇంటిలో పెట్టుకుంటే, ఒక బ్రాహ్మణుడికి అతిథి సత్కారం చెయ్యని పాపం మనకి చుట్టుకుంటుందట!

అవన్నీ పాత కబుర్లు: అతిథులకి వడ్డించిన తరువాతే మనం భోజనం చెయ్యాలనే నియమం ఆ రోజుల్లో ఉండేది. తడిసిన బట్టని ఆరబెట్టకుండా భోంచెయ్యకూడదన్నారు. ‘మనం బట్టలు ఎండబెడుతున్నప్పుడు అతిథులు రావొచ్చు, అందుకోసం మనం తొందరపడకూడదు!’ అని రఘుపతి భువనాకి అర్థం చెప్పాడు. అవును నిజం. కాని పొద్దున్నే బట్టలు ఉతకడం ఆమె మనసుకి నచ్చలేదు. మండుటెండ వ్యర్థమౌతోంది. ఇవాళ అందరూ త్వరగా భోజనం చేసేసారు.

భువనా తలయెత్తి కూర్చుంది; తడిసి ముద్దైన రవిక మార్చుకుంది. మినుకుమినుకుతున్న దీపంకి కొంచెం నూనె పోసి, పూజకి సిద్ధమైంది. మిల్లుకి

వెళ్ళిన పనిమనిషి తిరిగివచ్చే సమయం; తను మధ్య లేవాలేమో? 'ఒక పదినిమిషాలైనా కదలకుండా ఉంటే బాగున్ను!' అని మనసులో అనుకుంది.

'అబ్బా!' అని ఒక నిట్టూర్పు. ఇంతసేపూ పని చేసి ఇప్పుడు తేర్చుకున్నందుకు బాగా చెమట పట్టేసింది; దేహమంతా తహతహలాడింది. ఆ అలసటలో అలాగే కూర్చునే నిద్రపోవాలని అనిపించింది; భువనా కళ్ళు మూసుకుంది. ఎవరైనా ఆమెను చూస్తే 'ఆహా, ఎంత భక్తి, ఎంత పరవశం! సమాధి అంటే ఇదే కాబోలు!' అని నివ్వెఱపడిపోతారు. భువనా కళ్ళు మూసుకున్న స్థితిలో 'దేవీ!, 'ఈశ్వరీ!' అని పిలవడంకూడా మరిచిపోయింది. "నన్ను సుకుమారిగా సృష్టించిన దేవుడు, అందుకు తగిన హోదా, సౌఖ్యం నాకివ్వలేదు. ఎక్కడో ఊటీ, కున్నూర్ వంటి ఒక వేసవి విడిదిలో మా కాపురం సాగుతే ఎంత బాగున్ను! అలాగైతే చేసే పనుల్లో ఎటువంటి భారమూ తెలియక నా మట్టుకు నేనే అన్ని పనులూ చేసుకుంటాను! ఇప్పుడు ఈ మండుటెంటలో వాడిపోతున్నానే!' అని అంగలార్చుకుంది.

చపలచిత్తం, తన్నెరుక, అలసట - అన్నీ ఒకేసారి ఆమెను ఆకట్టుకున్నా - భువనా వాటిని మించి - శారీరకంగా, మానసికంగా - తన పూజలో మునిగిపోయింది; ఆమె చేసే పూజ తనే స్వేచ్ఛగా అలవరించుకున్న ఒక ఆచారం. అందులోనూ ఒక క్రమ పద్ధతి ఉంది, కాని సంప్రదాయం లేదు. ఔచిత్యం లేకపోయినా అందులో పొరబాటు లేదని భువనా తృప్తి పడింది. అదే ఆమె ఆత్మతృప్తికూడా. ఒకే ఒక విగ్రహంతో, ఒకే ఒక స్తోత్రంతో ఆరంభించిన అలవాటే కాలక్రమంలో ఆమెను గట్టిగా పట్టుకుంది. అవును మరి: విత్తనంనుంచి ఉత్పత్తి పరిణమించడం సహజమేకదా? అందుకే పెద్దలు మనం అనుకున్నదీ, చేసేదీ హితంగా ఉండాలన్నారు. ఇప్పుడు దీపంచుట్టూ ఎన్నో కొత్త విగ్రహాలు కనిపిస్తున్నాయి. వాటికి తగినట్టుగా కొత్త కొత్త స్తుతులు వల్లించి, తన సేవలో నాణ్యత ఉండాలని భువనాకి ఆకాంక్ష కలిగింది. రెండు మూడు సంవత్సరాలముందు ఆమె అస్వస్థతతో బాధపడింది; మనసూ క్రుంగిపోయింది. తల్లి అనారోగ్యంవలన పిల్లలకీ శ్రమ; అందరూ మంచమెక్కారు. కాని తల్లినీ, ఆ కుటుంబాన్ని దేవుడు దయ రక్షించింది. ఆ కృతజ్ఞతకి ప్రతీకారంగా భువనా మనసులో భక్తి చోటుచేసుకుంది. ఆ భక్తి ఆమెను మించిన శక్తి అని గుర్తుచేసుకుంటే అదొక విధమైన వెర్రితనం అనికూడా

అనవచ్చు. త్వరలో ఆమె మనసులో ఒక కొత్త మార్పు చోటుచేసుకుంది; దేహాకృతిలోనూ భేదం కనిపించింది; చెమట పట్టడం మరీ తరచుగా అలవాటైపోయింది. భక్తి, శ్రద్ధలతోబాటు మడి, ఆచారం అనే అనుష్ఠానాలు పాటించడంవలనే ఇంటిపనులు బాగా పెరిగిపోయాయని భువనాకి తెలుసు. అందువలనే ఆమె దేహం దుర్బలంగా ఉందని, చెమట పట్టుతోందని అని లోకజ్ఞానం ఆమెకు చెప్తోంది. కాని భువనా దాన్ని ఆమోదించలేదు. ఒకానొకప్పుడు ఇదే భువనా తన తల్లితో "ఎందుకమ్మా నాకింత పెద్ద వెండి దీపం? అందుకు బదులు ఒక toilet set కొను!" అని అడగలేదూ? ఆవిడ నిదానంగా చుట్టుపక్కల్ని ఒకసారి ఆరసించి "నోరు మూసుకో! మరేం అనవద్దు! వియ్యంకులెవరైనా వింటే మండిపడతారు!" అని హెచ్చరించారు. ఆ ఘటన తలచుకుంటేనే ఇప్పుడు భువనాకి చాలా అవమానంగా ఉంది. ఆ వెండి దీపమే ఇప్పుడు ఈ ఇంటి దీపలక్ష్మి అయింది. అందుకే భువనా వరం కోరుకుంది: "దీపలక్ష్మీ, నమోస్తుతే! నిన్ను నిత్య దీపంగా పూజించడం నావల్లకాదు. కాని నా మనసార నీకు అఖండ ఆరాధన[1] చెయ్యగలను. త్రిసంధ్యలూ దీపాన్ని వెలిగించి నేను నిన్ను పూజిస్తాను. సకల దేవతులూ నీలో నిక్షిప్తమై ఉన్నారనే శాస్త్రవచనం నాకు తెలుసు. ఇదే నా మనవి: నీ దయవలన నా ఇంటనేకాదు, ముల్లోకాల్లోనూ నీ వెలుగు వ్యాపించాలి!" ఈ ప్రార్థన, అంజలి, అందులోని ఉదాత్తమైన భావన, భువనా మనసుని ఆహ్లాదపరచాయి. తన వంటా, స్నానమూ తలకిందులైనా, తను అరుణోదయంలో సిగ్గుమాలి నిద్రపోయినా, ఆ దోషాలకి ఈ దైవ ఆరాధన ఒక పరిహారంగా దొరికిందని ఆమెకు నమ్మకం కలిగింది.

దీపం చుట్టూవున్న విగ్రహాలకి స్తుతులు వల్లించినతరువాత, భువనా ఎదుట గోడలోవున్న పార్వతీదేవి పఠాన్ని తలయెత్తి చూసింది; వెంటనే అన్నపూర్ణాష్టకంనుంచి ఒక విభాగం వల్లించుకుంటూ ఆ పఠంమీద ఒక పువ్వు దోపింది. దేవీ కళ్ళని

---

[1] **కొందరు తమ ఇళ్ళల పూజా గదుల్లో నిత్యమూ వెలిగే దీపాలు ఉంచుతారు**. దానికి కామాక్షీ దీపం అని పేరు. 'కామాక్షీ దీపం, అఖండ ఐశ్వర్యం,' అనే వచనమూ ఉంది.

రెప్పవాల్చకుండా చూసింది. ఆ చిరునవ్వుని చూసి ఆనందించింది. అందులో కనిపించే శోభ మరేపటంలోనూ లేదు; ఒక స్నేహితురాలు బహుమతిగా ఇచ్చిన పటం అది.

అలా చూస్తున్న భువనా ఒక క్షణం నిర్ఘాంతపడిపోయింది. ఇదేంటి? వింతగా ఉందే? చెమట బిందువులా? బొట్టు బొట్టుగా మొలకెత్తినట్టు - నిగనిగమని- కనిపిస్తున్నాయే!

స్తోత్రం కొనసాగించడానికి ఆమె నాలిక కదల్లేదు; మతీ మరచిపోయింది. 'తల్లీ! అంబికే!" అని మనసులో విభ్రాంతితో పిలుస్తూ భువనా తన వేళ్ళతో అమ్మవారి నెత్తికి పైనున్నగాజు కప్పుని తాకింది. "తల్లీ, లోకమాతా! నీక్కూడానా చెమట బొట్టులు?" అనే ప్రశ్నతో ఆమె కళ్ళు తడిసిపోయాయి: 'ఇది దేవీ చూపే మాయా? లేక తన మనసు పడుతున్న భ్రమా? ఈ అద్భుతం ఎవరైనా నమ్ముతారా?'

మళ్ళీ మళ్ళీ ఆ దృశ్యం చూస్తూ భువనా స్తంభించిపోయింది. అవును, నిజం! ఇదేం గారడీవాడు చేసే గమ్మత్తు కాదు! దేవి నెత్తిమీద మొలకెత్తినట్టు చెమట చుక్కలు కనిపిస్తున్నాయి!

కన్నీళ్ళ మధ్య భువనా ఒక చిరునవ్వు నవ్వింది. దేవితో తను ముచ్చటలాడినందుకు ఆహ్లాదపడింది. "లోకమాతా! 'నీక్కూడానా చెమట బొట్టులు?' అని అడిగాను, నా మందబుద్ధికి మరేం నిదర్శనం కావాలి? కోట్లకొలదీ పిల్లల్ని రక్షించి, పోషించి, దారి చూపే జగన్మాత నువ్వు! ఇక ఉత్తికే నా కొరతలు నీదగ్గర మొఱపెట్టుకోను! తల్లీ, ఇక నా ఇక్కట్లూ, సణగులూ తగ్గనీ!" అని మనసార వేడుకుంది. పూజ ముగించి లేచినప్పుడు ఇంతకు ముదు తనెప్పుడూ అనుభవించని ఉత్సాహం ఆమెకు కలిగింది.

"అమ్మా, ఈ పాప నిద్రపోయింది; ఆ పిల్ల ఎదురింటి అమ్మగారిని చూసి వాళ్ళింటి పిల్లకాయలతో ఆడాలని వెళ్ళిపోయింది!" అని పనిమనిషి భుజంమీద పాప, ఒక చెయిలో పాత్ర మోసుకుంటూ వచ్చింది.

** ** **

తను చూసిన అద్భుతం తన భర్తకీ, పిల్లలకీ చెప్పాలని భువనా చాలాసేపు తాపత్రయపడింది; కాని ఆఖరికి ఆ ఆశ మానుకుంది. తన వివరణ విని రఘుపతి

ఎటువంటి వ్యాఖ్యానం చేస్తాడని భువనాకి తెలుసు; అది వినడానికి ఆమెకు ఇష్టం లేదు. ఆమె మనసులో ఒక భ్రమ ఉంది; ఐనా తన కళ్ళతో, తెలివితో, ఆ దృశ్యం చూసింది. మరి, ఆ నమ్మకం, విశ్వాసం ఎందుకు వ్యర్థమవ్వాలి? ఇంద్రజాలంగా ఆమె కళ్ళకి కనిపించినా అది మాయ కాదే! సొగసుగా కనిపించే ఆ దృశ్యం ఎందుకు ధ్వంసం చెయ్యాలి?

ఆ మరుదినం భువనాకి రోజువారిలాగే సాగింది: హడావిడి, తొందర, తపన, చెమట, అలసట; దినచర్యలలో ఎటువంటి మార్పూ లేదు. కాని ఆమె అంతర్బుద్ధిలో ఒక పరివర్తన: పూజ చెయ్యాలనే ఆలోచనకంటే ఆతురతే వాడిగా ఆకట్టుకుంది. ఇంటిలో ఎన్నో గొడవలు! కలం పోగొట్టుకొని ఏడ్చే అబ్బాయి; పాఠపుస్తకం కనిపించలేదని తల్లితో మొరబెట్టుకునే వాడి తమ్ముడు; పొరుగింట్లో ఆడుకొని, నేల పడిపోయి నొప్పితో ఇంటికి వచ్చి అమ్మచుట్టూ తిరుగుతున్న పిల్లవాడు; తల్లి ధ్యానముంతా తనమీదే ఉండాలని హఠంచేసే ఆఖరి పిల్లవాడు; ఆరోజు టపాలో వచ్చిన ఉత్తరాలగురించి ఆమెతో మాటాడాలని కాచుకున్న భర్త; ఇక, వీధిలోనూ, పెరడులోనూ ఎవరో, ఏదో కావాలని ఆమెను - ఇంటి ఇల్లాలుని - అడుగుతూనే ఉన్నారు! వీళ్ళందర్నీ సర్దుబాటు చేసుకుంటూ భువనా యంత్రంలాగ పని చేసింది; కాని అంతరాత్మలో దేవిని ప్రతిష్ఠించుకొనేవుంది.

ఆఖరికి పూజకి కూర్చుంది; దేవి పఠంని తీవ్రంగా చూసింది; అన్ని ఆకృతులు నిన్నలాగే కనిపించాయి. దేవి ముఖం క్రుంగినట్టు కనిపించింది; నెత్తిలో చెమట బిందువులు అలాగే ఉన్నాయి.

'తల్లీ, నీ కరుణ అంటే ఇదే!' అని తనివిచెందిన భావన భువనా మనసులో లేచింది. ఉక్కబోసే ఆ సమయం - అలసటతో, చెమట పట్టిన తన దేహం గిజగిజలాడుతుంటే - చల్లగా ఏదో పాకుతున్నట్టు ఒక తీయని ఊహ ఆ భావనలో కలిసివచ్చింది.

తను చూసిన దృశ్యం భర్తకీ, తన పిల్లలకీ చెప్పకుండా భువనా తన మనసులోనే నెమరువేసుకుంది.

మరుదినం; దానికి మరుదినం; అదే పాట, అదే దృశ్యం, అదే అద్భుతం! అదే సంతోషం భువనా మనసులో చోటుచేసుకుంది.

"చాలా ఉక్కగా ఉంది. నువ్వేం అనవేం?" అని రఘుపతి ఒకరోజు అడిగేసాడు.

"దానికేం? అదేం పెద్ద గొడవా? బాగుంది, వర్షాకాలం రాగానే మన దేహం చల్లబడిపోతుందా? మనమే మన మనసుని చల్లబెట్టుకోవాలి! ఎండని చూసి రెండురోజులైపోయాయి, బట్టలు ఆరకుండా తడిగావున్నాయి! వసారాలో ఎక్కడ చూసినా బురద, చెత్త! వద్దంటే మనం ఆపగలమా?" అని అంటూ భువనా ఒక దొంగ నవ్వు నవ్వింది.

ఆ మరుదినం దేవి స్వరూపంలో భువనా ఇంకొక మార్పు గమనించింది; నెత్తిలో లాగ నోటి కిందటి భాగంలోనూ, చెమట బిందువులు కనిపించాయి. అంటే నిలువుటద్దంలో చూసుకున్నప్పుడు తన మొహంలో అగపడే మంచు బొట్లులాగ . . .

ఆ దృశ్యం చూస్తూ, చూస్తూ, భువనా మేనుమఱచిపోయింది. "నాకేం భారం? సమస్తకోటి జీవరాశికి తల్లి, ఇదిగో, నా ముందు నవ్వుతూ కనిపిస్తోంది!" అని ఉప్పొంగింది.

ఇలాగే ఐదారు రోజులు గడిచాయి. తన దేహంలో కొత్తగా త్రాణ వచ్చినట్టు భువనాకి అనిపించింది. 'అసలు ఈ వాన తగ్గుతున్నట్టు కనిపించదే!' అని విసుగ్గున్నా, 'ఈ ఉక్క నేను భరించలేను!' అని ఆమె మొరబెట్టుకోలేదు. ఎప్పటిలాగే తడిసిన రవికలు మార్చుకుంది; 'ఇదొక పెద్ద గొడవ!' ఎప్పుడూ అని నొచ్చుకోలేదు.

ఇలా ఉండగా ఒక రోజు భువనా చూసినప్పుడు దేవి పఠంలో కొన్ని చోట్ల బూడిదరంగులో బూజెక్కినట్టు కనిపించింది.

'ఐయ్యో, ఈశ్వరీ!' అని ములుగుతూ భువనా పఠాన్ని తీసి దాని వెనకటితట్టుని చూసింది. వర్షంవలన అట్ట తడిగా ఉంది; ఆ పఠం వేలాడుతున్న చోట గోడ కొంచెం చించుకొనివుంది.

వెంటనే భువనా ఆ పఠం వెనుకనున్న మేకులు పీకింది; గబగబమని విప్పి మెల్లగా ఆ పఠం బయటకితీసి, ఒక మూల, ఎండలో ఆరబెట్టింది; 'ఇవాళ దేవి పఠం లేదు!' అని బాధ పడుతూనే పూజ చేసింది.

ఆ రోజు సాయంకాలం బజారుకి వెళ్ళి పఠానికి ఒక మంచి చట్టం కొనిపెట్టింది.

ఆ మరుదినం పూజకి ఆమెకు ఉత్సాహం లేదు. కాని అలవాటు తప్పుతుందా? కూర్చొని గోడమీద భువనా ఒక చూపు విసిరింది. ఆమె - ఆశించినట్టు - దేవి ముఖంలో చెమట లేదు. సచేతన స్వరూపిణిగా దేవిని చూపే అనవాలు కానరాలేదు. 'ఆమె లోకమాత, సకల జీవులను రక్షించే శక్తి ఆమెకుంది!' అని ప్రకటించే ఏ సూచనా ఇప్పుడు లేదు. 'నేను నాయకురాలిని, నా పేరు అఖిలాండేశ్వరి! అని చెప్పుకుంటూ సంబరాల్ల ఊరేగింపులో వచ్చే అమ్మవారు కాదు. 'నాకూ చెమట పట్టుతుంది, అది పోవాలని నేను తాపత్రయపడుతున్నాను!' అని ఆరోజు వాపోయిన దేవి మొహం ఇప్పుడు లేదు.

అందుకని భువనా మనసులో నిరాశ చోటుచేసుకుందా?

అసలు "పఠం తడిసిపోయిందోమో చూడు!" అని భర్త ఆజ్ఞకి భయపడేకదా, భువనా తను చూసిన చోద్యం ఎవరికీ చెప్పకుండా నోరు మూసుకుంది?

ప్రకృతిలో ఆ రహస్యమేమిటో తెలిసిపోయిందని భువనాకి అపేక్ష కలిగింది.

కొన్నిరోజులవరకూ ఆమె మనసులో వ్యాకులత పోలేదు. ఆఖరికి భువనా దేవిదగ్గరే మొరబెట్టుకుంది.

దేవీ మాటాడిందా? అవును కాబోలు! భువనా మనసు కుదుటపడింది. "తల్లీ, ఇదీ నీ సందేశమే అని గ్రహించాను. చెమటబిందువు కూడా ఒక ఆభరణమని నాకు తెలిసింది. నా సేవ కొనసాగడానికి నాకింకా కొంచెం బలం అనుగ్రహించు తల్లీ!" అని భువనా వేడుకుంది.

** ** **

"ఏం, ఎందుకు? ఊటీ, సిమ్లా వద్దా? నిన్నెందుకు భువనా అడగలేదు?" అని పరమేశ్వరుడు తన భార్యని - ఉమాదేవిని - అడిగారు.

పార్వతి మహేశ్వరుని చూసి చిరునవ్వు నవ్వింది; అతనికి తెలియని రహస్యమా?

మహేశ్వరి మంచుమూసిన శిఖరాలమీద కళ్ళు పోనిచ్చింది. "ఇక్కడ రమ్మని పిలిచినాకూడా తన పిల్లల్ని వదిలేసి రానేరాదు! ఆమె మనసు మారిపోయింది!"

"ఎలాగ మనసు మారింది? చెప్పు, దేవీ!"

'హూం!' అని పార్వతి నిట్టూర్పు పదలింది. "ఇదిగో, మీ భక్తుడు రఘుపతి; అతనికి రోజూ నుదుట విభూతి పెట్టుకునే అలవాటుంది. అందుకైనా అతను ఏమంటున్నాడో కొంచెం వినండి!" అని భర్తని కోరుకుంది.

** ** **

"ఏం, ఎందుకు? ఊటీ, సిమ్లా వద్దా? నువ్వెందుకు దేవిని వేడుకోలేదు?" అని రఘుపతి ఆశ్చర్యంగా భార్యని అడిగాడు.

"నాది ఆడ జన్మ కదా? మరి విసుగ్గోకుండా నేను బతకడం ఎలాగ? చెమట పట్టకపోతే 'నేను పడిన శ్రమ ఏమైంది?' అని ఆ ఊటీలోనూ నేను బాధపడతానేమో! 'నా కృషి ఎవరికీ తెలియనట్టుంది!' అని నొచ్చుకుంటాను. 'చెమట పట్టకూడదా?' అని ఆశ కూడా నాకు వస్తుందేమో, ఎవరికి తెలుసు?" అని భువనా జవాబు చెప్పింది.

'దేవుడా, మంచి ఆడజన్మ సృష్టించావయ్యా!' అని రఘుపతి మనసులో నవ్వుకున్నాడు. "నువ్వు చేసే పని ఎలాగోకాని, నీ మాటలూ తలకిందుగానే ఉన్నాయి!" అని అన్నాడు భార్యని వింతగా చూస్తూ.

నోరెత్తకుండా భువనా నవ్వుతూ అలాగే నిలబడింది.

ఇంతకు ముందు, ఒకసారి, భోజనం ఐనతరువాత "కాకికి అన్నం పెట్టలేదు, మరిచిపోయానే!" అని భువనా బాధ పడింది. పంచలో నిలబడివున్న ఆమె మామగారు అక్కడున్న కాకులని చూసి "రండి, రండి, మేమందరం భోంచేసాం, ఇక మీ పంక్తి!" అని తమాషాగా మాటాడుతూ "రామ్మా, ఇప్పుడు వడ్డించు!" అని కోడలికి చెప్పారు. ఒక పిడికెడు అన్నం పక్షులకి వేసి భువనా నివ్వెరపోయి అలాగే నిల్చుంది. మామూలుగా వచ్చే కాకులూ, చెట్లలో ఉన్న ఉడతలూ వచ్చి, పోటీ చేసుకొని భోంచేసి వెళ్ళాయి. ముందో వెనుకో కాకులకి అన్నం దొరికిందని భువనాకి తృప్తి కలిగింది; తన మఱపు వలన జరిగిన తప్పు మరచిపోయింది.

అవును. భువనా ఒక అల్ప సంతోషి. భర్త ఎగతాళి చేస్తే ఆమెకు కోపం వస్తుందా?

ముత్యంలాగ నవ్వుతోంది.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, డిసంబరు 1, 1957)**

# పసి హృదయం[1]

ఆ ఉత్తరంకూడా ఒక చంటిపిల్లలాగానే, ఆ దంపదుల్ని పూర్తిగా నిమగ్నం చేసేసింది.

లలిత ఆ ఉత్తరం చాలాసార్లు చదివేసింది. అప్పుడే స్నానం ముగించుకొని గదిలోకి అడుగుపెట్టిన భర్తకి అందించేముందు, "నాన్నగారు దగ్గరనుంచి ఉత్తరం వచ్చింది," అని చెప్పింది; "పదవీ విరమణ చేసి వచ్చేవారం ఇక్కడికి వచ్చేస్తున్నారు."

"ఏమిటా వాగుడు? ఉత్తరంలో ఏముందో సరిగ్గా చెప్పవేం?" అని కొంచెం చిరాగ్గా గొంతెత్తి ఆమెను మందలించాడు విశ్వం.

"ఐతే, ఇదిగో, అదేదో మీరే చదువుకోండి. నాన్నగారన్నవెంటనే ఆ వచ్చేదేదో మా నాన్నగారూ, అమ్మా అనుకున్నారేమో?" అని అంది లలిత, కోపంతో అ ఉత్తరం చేతికి అందిస్తూ. విశ్వం తన భార్యని కసురుకోడం అన్నది నేను అదే మొదటిసారిగా నా కళ్ళతో చూసాను; కొంచెం కలవరపడ్డాను కూడా.

"నిజంగానా? మా అమ్మా, నాన్నా వస్తున్నారా?" ఆ ఉత్తరం అందుకోడానికి విశ్వం ముందుకు జరిగాడు. "నా చేతులు తడిగా ఉన్నాయి. ఇంకా తలకి ఆరపెట్టి నూనె అంటుకోవాలి. అదేదో నువ్వే చదివి చెప్పు. నేను తల దువ్వుకుంటూ వింటాను" అన్నాడు.

"నేను చదివితే అసలు సరిగ్గా అర్థం అవదు మీకు," అని అన్నది ఆమె గరుకుగా. "మీకు తెలుసుగా, నాకోసం మీరేమైనా కథ పైకి చదివితే మళ్ళీ నేను నా అంతట అది చదివితేనే నాకు తృప్తి కలుగుతుంది. అర్థమైందా? ఇప్పుడు నేను చదవితే మీకూ అలాగే అనిపిస్తుంది." ఇలా అంటూనే దగ్గరలోవున్న ఒక

[1] (మే, 1950 **కళైమగళ్** తమిళ పత్రికలో, **'ఆయన దీర్ఘ నిట్టూర్పు విడిచాడు',** అనే వాక్యంతో అంతమవుతున్నట్లు ఒక కథ రాయాలనే పోటీలో మొదటి బహుమతి అందుకున్న కద. దీన్ని శేషారావుగారు అనువదించారు.)

టేబులుమీద ఆ ఉత్తరం పడేసి, విసవిసా నడుచుకుంటూ లలిత అక్కడనుంచి వెళ్ళిపోయింది.

నేను కొంచెం చిత్తరబోయాను. తనకోసం భర్త కథలు పైకి చదువుతూంటే ఆనందించిన లలితను నేనెరుగుదును. ఇప్పుడెందుకు ఆయనపట్ల ఈ గుసగుసలు? ఈ అకస్మాత్తు వైరం ఆమె నైజం కాదు. భర్త వాడిన వాగుడు అన్న పదం ఒక్కటే ఆమె కోపానికి కారణమా?

నేను ఈ చిన్న విషయంగురించి తపించిపోవడం ఏమిటి? ఏం జరుగుతుందో నాకు తెలుసుగా! ఆ వస్తున్నది తన తల్లిదండ్రులని తన భర్త భయపడిపోతున్నాడన్నే విషయం తెలుచుకొని లలిత గాభరా పడింది. అదే - ఆ విషయమే - ఇప్పుడామె ఈ విధంగా ప్రవర్తించడానికి కారణం. అయ్యో, ఆమె పసిబిడ్డ! ఇందులో అసలు లలితని తప్పుపెట్టడానికి నాకేం తోచలేదు.

తల దువ్వుకోడం పూర్తి ఐన తరువాత, విశ్వం టేబులుదగ్గర చేరుకున్నాడు. ఆ ఉత్తరం రెండుసార్లు చదువుకొని మళ్ళీ అక్కడే ఉంచేసాడు. నేనుకూడా అతని దగ్గరకు వెళ్ళి కుశల ప్రశ్నలు వేసాను.

"రండి, ఇలా కూర్చోండి," అన్నాడు విశ్వం. "ఇది మా నాన్నగారి దగ్గరనుంచి వచ్చింది," అంటూ ఉత్తరం అందించాడు.

నేనుకూడా ఆ ఉత్తరం కొన్నిసార్లు చదివాను. చదివేవారిని మళ్ళీ మళ్ళీ చేరివొడుచుతున్న పేరా ఇదొక్కటే:

"మా రాబోయే భవిష్యత్తు, వయస్సు మీరపడ్తున్నందునా, రానూ, రానూ మాలో శక్తి సన్నగిల్లుతుండడంవలనా, అక్కడికి వచ్చేయడంతప్ప మరేంచెయ్యగలం మేం? నేనింకా ఎన్నాళ్ళు, ఎన్నేడ్లు ఉద్యోగం చెయ్యగలను? అధికారంగా నేను రిటైరై సుమారు ఐదు సంవత్సారాలయింది. నా పరిస్తితిని ఇతరులు ఎలా అర్ధం చేసుకుంటారో నేను ఊహించగలను. నీతో కలసి జీవించవలసిన రోజులు తోసుకువస్తున్నాయి."

అదీ ఆ ఉత్తరంలోని సారాంశం. అందులో ఇమిడియున్న ముఖ్య సందేశం. గిలక కొట్టిన పాలమీద తేలే మీగడలాగ!

విశ్వం నాన్నగారు అరుణాచలం రాసిన కొన్ని ఉత్తరాలు నేను చూసివున్నాను. ఆవేశం పెద్దగాలేని కొన్ని అక్షరసమూహాలుగానే కనబడ్డాయి అవి. ఎప్పుడూ అవి క్లుప్తంగానూ, యోగక్షేమాలు అడిగి తెలుసుకొనేవిలాగే ఉండేవి. వాళ్ళ నాన్నగారు ఎప్పుడూకూడా ఆవేశంకి తావు ఇవ్వరని విశ్వం నాకు చెప్తూండేవాడు. ఐనాకూడా అరుణాచలం ఉత్తరాలు ఉత్తరాలుగా ఉన్నాయని నేనెప్పుడూ అనుకోలేకపోయాను. నా ఇంటినుంచి నేను చాలా దూరంలో ఉంటున్నందున, సాధారణంగా నేను ఇంటికి రాసిన ఉత్తరాల్లో నా భావోద్రేకాలని కూర్చి చెప్పేవాడ్ని. ఉత్తరాలు రాయడం ఒక కళ. నా ఉద్దేశంలో ఇద్దరి మధ్య నడిచే ఉత్తరప్రత్యుత్తరాలు అన్యోనతని పెంపొందిస్తాయి. సాధారణంగా అరుణాచలం ఉత్తరాలు క్లుప్తంగావుంటాయి, చెప్పుకోతగ్గవికావు అని అనుకునేవారికి, ప్రస్తుత ఉత్తరం స్వచ్ఛమైన గాలి పీల్చుకునేట్లు చేస్తుంది. అదీకాక, ఇప్పటి ఉత్తరం నిడురుగా కూర్చొని ఊపిరి తీసుకోవలసిన రీతిలో వచ్చిన ఉత్తరం.

ఉత్తరం విశ్వం చేతిలో పెట్టి, "వచ్చే వారం మీ అమ్మా, నాన్నా వస్తున్నట్లుంది. నేనుంటున్న జాగా ఖాళీ చేసెయ్యనా?" అన్నాను. నేను గది ఖాళీ చెయ్యాలేమో అని ఒకంత గాభరా పడ్డానుకూడ.

కాని విశ్వం, ఆ మాట వినదలచుకోలేదని చాలా మర్యాదగా అన్నాడు. నన్ను తానొక ఆత్మీయుడుగా భావిస్తునట్లు చెప్పి, అలాగే రాబోతున్న తన నాన్నగారికి నేను స్నేహితుడుగా ఉంటానని అభిప్రాయం వెలిబుచ్చాడు.

నేను మళ్ళీ కొత్తగా ఇంటివేట ప్రారంభించాల్సిన పనిలేదని రూఢీయైనందుకు చాలా సంతోషించాను. నా ఈ యాభైయేళ్ళ వయస్సులో ముప్పైయేళ్ళ విశ్వంకి, అలాగే రాబోయే అరవైయేళ్ళ అరుణాచలంకికూడా తోడుగా ఉపయోగపడ్డాననే భావంతో అంతవరకూ పచ్చిక పొలంలో మేతవేసిన ఆవు ఇక తన చావడికి తిరిగివెళ్ళినట్లు నా గదిని చేరుకున్నాను.

త్వరలో వాతావరణంలో కొట్టవచ్చినట్లు కనిపించే మార్పులు గమనించాను. విశ్వం మళ్ళీ వాలుకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. లలిత వంటింట్లో నిమగ్నమైయుంది. అప్పుడప్పుడు బయటికి వచ్చినాకూడా గిరగిరా తిరిగిన గోలీకాయలాగ వంటింట్లోకి మళ్ళీ మళ్ళీ మాయమైపోతుండేది.

అంతకుముందెన్నడూ నేను చూసివుండని ఆమె ప్రవర్తన - విశ్వంని పట్టించుకోకపోవడం - నాకు కొట్టనచ్చినట్లు కానవచ్చింది.

అంతవరకు, బయట తన స్నేహితులతో ఆడుకుంటూ అప్పుడే ఇంట్లోకి వచ్చిన పాప గీతా అమ్మా, నాన్నతోనూ, నాతోనూ మార్చి మార్చి, బుల్లిమాటలు మాట్లాడింది. ఐనాకూడా వాతావరణంలో ఎటువంటి మార్పు రాలేదు. సర్వజ్ఞనుడైన విష్ణుమూర్తి పాలసముద్రంలో నిశ్చలంగా నిద్రిస్తున్నట్టు వాళ్ళ చంటబ్బాయి ఊయలలో నిశ్చింతగా నిద్రిస్తున్నాడు.

పెద్దలు ముభావంగా ఉండడం గమనించిన గీతా మెల్లమెల్లగా ఊయలవైపు నడిచింది. ఏదో చిలిపిచేష్ట చేసింది కాబోలు, చంటబ్బాయి కళ్ళు తెరిచి ఏడ్చాడు. విశ్వం వాలుకుర్చీనుండి లేచివెళ్ళి, ఉయ్యాల ఊపడం మొదలుబెట్టాడు. లలితకూడా బయటకి వచ్చేసింది.

"ఉయ్యాల ఊపడం ఆపండి; ఇక వాడు పడుకోడు. బాబుకి ఆకలేస్తుంది," అని అంటూ ఆమె చంటోడిని చేతుల్లోకి తీసుకుంది. అప్పుడు గీతా వాళ్ళ నాన్నగారిని ఏదో అడిగింది. ఆ విషయం తనకి తెలియదనే సమాధానంతోతప్పించుకొని విశ్వం భార్యవంక చూసాడు; లలిత కూతురుకి సమాధానం చెప్పింది. ఆ వెనువెంటనే ఆ దంపదులు తమ వెనుకటి స్తితికి మారిపోయారు. వాళ్ళ మొహాల్లో విల్లివిరిసిన వెలుగు, వారి కంఠధ్వనిలోని పోలిక గమనించి నేను పులకాంకితుడైయ్యాను.

ఔను, నాకు నిజంగానే చాలా బాధ కలిగింది. ఈ చూడ ముచ్చటైన దంపదులు ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని ఆనందతరంగాలలో తేలియాడేవారు. నాకు తెలిసినంతవరకు లలిత ఎల్లప్పుడూ సౌజన్యంతోనూ, విశ్వం ఆమెపట్ల అభిమానంతోనూ, మెలుగుతారు. అందువలన గత ఒక గంటముందు చోటుచేసుకున్న పరిమాణాలను చూసిన నాకు కలవరం కలిగింది.

నేను ఈ ఇంటికి అద్దెకు దిగిన కొన్ని రోజుల్లోనే ఈ దంపదులు నా మెచ్చుకోలుకు పాత్రులయ్యారు. వారు చాలా చురుకైనవారు, తెలివైనవారు. వాళ్ళిద్దరూ గౌరవకుటుంబాలనుంచి వచ్చినవారే. ఆ విధంగానే వారి వారి కుటుంబగౌరవాన్ని అనుచరిస్తున్నవారు. ఇద్దరూ వారి వారి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో అభివృద్ధి చెందినవారే. లలిత అత్తమామలతో కలిసి కొన్నాళ్ళు

ఉన్నందులవలన వాళ్ళని బాగా అర్థంచేసుకొని ఉన్న పిల్ల. వాళ్ళది ఒక ఆదర్శ దాంపత్యం అని చెప్పుకోడానికి, ఇంకా కొత్తగా చెప్పుకోడానికి ఏమిటి మిగిలి ఉంది?

నా ఉద్యోగంవలన, దురదృష్టవశాత్తు, నేను నా కుటుంబానికి దూరంగా ఉండవలసి రావడంవలన నా సంతానంకి తండ్రిగా ఇవ్వవలసిన సలహా, సూచనలు ఇచ్చే పరిస్తితి నాకు లేదు. నా భార్య రోగిష్టి అవడంవలన నాతో ఉండలేని పరిస్తితి. అందువలన నా కుటుంబంలోని ప్రతిఒక్కరితోనూ, ఉత్తరప్రత్యుత్తరాలు నెరపడంలో అయితేనేం, వాళ్ళకి కావలసినప్పుడెల్లా సలహా సూచనాలు అందిస్తూండానికిగాని, ఈ ఆదర్శదంపదులే నాకు స్ఫూర్తిదాతలు.

ఆ కారణంవలనే, ఏదో స్వల్ప విషయానికి అన్యోనతగావుండే ఆ యువదంపదులు ఒకర్నొకరు అపార్థం చేసుకొని ఎదురుతిరుగుగా ముఖం పెట్టుకున్నందువలన, నేనెంత బాధ పడ్డానో, ఆ భగవంతునకే ఎరుక. లేదు, లేదు, నేనే పొరబాటు పడ్డాను! ఆ పరిస్తిని పిల్లలుకూడా ఇప్పుడు పసిగట్టేసారు.

పిల్లల ఆలాపాలన చూడవలసి ఉన్నందున ఆ దంపదులు వాళ్ళ మధ్యనున్న ఆభిప్రాయబేధాలను విస్మరించి, మళ్ళీ ఎప్పటిలాగే అప్యాయనురాగాలు వెల్లివిరిసినట్టుగా పిల్లలతో ఐక్యమైపోయి, వారితోబాటు ఆటాపాటల్లో మునిగిపోయారు.

చంటిపిల్లాణ్ణి, లలిత తన కాళ్ళమీద పడుకోబెట్టుకొని, భర్తకి కొంచెం దూరంగా నేలనే కూర్చొని ఆయనతో సంభాషిస్తోంది. విశ్వంకూడా మనస్పూర్తిగా నవ్వుతూ, చేతిలోవున్న పత్రిక పేజీలు తిరగవేస్తూ, "ఏమోయ్, ఒక కధ చదివి వినిపించనా?" అని అడిగాడు. అంతలోనే మళ్ళీ గబుకుమవి నాలిక కరుచుకొని, వెనక్కు తగ్గి, "ఓ, ఔనుకదూ? నేను చదివితే నీకర్థంకాదని ఎత్తిపొడిచావుకదూ?" ఆని అన్నాడు.

"అబ్బే, అలాగేంకాదు, బాగుంటుంది. చదవకూడదూ? నేను బుద్ధిగా వింటాను," అన్నది లలిత, ఆయనకి ఇంకా కొంచెం దగ్గరగా జరుగుతూ. విశ్వం ఉపక్రమించాడు.

ఒకరోజు గీతా వాళ్ళ అమ్మను జడవేయమని నసచేయడం మొదలుపెట్టింది. తన చేతిలోని దువ్వెన వాళ్ళ అమ్మపైకి విసిరింది. లలిత, "ఇప్పుడు

పనిగావున్నాను, కొంచెం ఆగు," అనగానే పాప, స్కూలుకి వేళైపోతుందని, వెంటనే జడవెయ్యమని, ఏడుపుని లంగించుకుంటూ మారాం చేసింది. లలిత నవ్వకుండా ఉండలేకపోయింది; తన కూతురు కోపగించుకోవడం గమనించి కొంచెం గర్వపడిందికూడా. భర్తపైపు తిరిగి, "చూసేరా, చూసేరా, అదెలా వా మీద రాచరికం చెలాయిస్తుందో? అని దొంగకోపంతో అడిగింది.

“ఆ జడేదో వేసేయకూడదూ?” అన్నాడు విశ్వం. “అలాగే వేస్తాను. లేకపోతే దాని మొరాయినుంచి నన్ను బతుకనిస్తుందా? అదేదో ఇప్పుడే వేస్తాను, లేకపోతే రోజంతా నా నరాలు పీకుతుంది, దెయ్యంలాగ!” అని అంటూనే లలిత కూతురుకి జడ వెయ్యడానికి భర్తకి ఎదురుగా చతికిలబడింది. అమ్మా, నాన్నలు పిల్లపాటిగా ఇంటివిషయాలు మాటాడుకుంటూ ఆనందిస్తునట్లు గీతాకూడా అమ్మ చేతి స్పర్శ మెత్తగా తన ఉంగరాల జుత్తుని సవరిస్తుంటే, తరువాయిగా ఆ రంగరంగుల రిబ్బను తవ తలని అలంకరిస్తుందనే తియ్యని ఊహతో ఆనందిస్తోంది.

ఇటువంటి ఉల్లాసభరిత దృశ్యాలు సర్వసాధారణమైనా అప్పుడప్పుడు నల్లమేఘాలు జొరపడుతుండేవి.

ఒకరోజు భర్తతో మాట్లాడుతూ, మాట్లాడుతూ. లలిత ఆడిన మాటలు వినిపించాయి. “సరే, అలాగే కానివ్వండి! నేను నా ఆలోచనలు బైటకి వినిపించేటట్లు మాట్లాడితే మీరు తల్లడిల్లిపోతారన్నమాట! నన్ను చిన్న దెయ్యం తల్లి, పెద్ద దెయ్యం అంటారన్నమాట! అది చాల్లేండి. ఇకనుంచి నా నోటికి తాళం వేసుకుంటాను. నాకు తెలుసు, నా స్వాతంత్ర్యం ఇంకా మూన్నాళ్ళ ముచ్చటే అని”.

విశ్వం నోరువిప్పలేదు. లలిత లేచి లోపలికి వెళ్ళిపోయింది. మరో అరగంటవరకూ వాతావరణం వేడిగానే కనిపించింది. ఇంతలో గీతా పెద్దగా ఏడ్చుకుంటూ పరుగెత్తుకొని ఇంట్లోకి వచ్చింది. తాను పడిపోయి మోకాలిలో దెబ్బ తగిలించుకున్నట్టు చెప్పింది. బెదిరిపోయిన లలిత వెంటనే బిడ్డని చేతుల్లోకి తీసుకుంది. విశ్వం వెంటనే ఆ గాయం శుభ్రంచేసి మందు వెయ్యడానికి సిద్ధమయ్యాడు. ఆ మందు ఇంట్లో సరిగ్గా ఎక్కడ ఉందని విశ్వంకి లలిత సూచన ఇచ్చింది. అంతలోనే అప్పుడివరకున్న ఘర్షణలు తొలగిపోయాయి.

ఐనాకూడా నా గుండె కొట్టుకునేవుంది; తీవ్రత తగ్గలేదు. ఆ కుటుంబంపట్ల నాకున్న సానుభూతి, దృక్పథం ఒకసారి చప్పబడిపోయాయి. ఇంతవరకూ ఆ యువదంపతులని నేను చూసిన ధోరణి వేరు. కేవలం ప్రేమానురాగాలతో కనపర్చేవాడిని. కాని ఇప్పుడేమో అపస్వరమైన లక్షణాలు కనిపిస్తున్నాయి. అందువలన ఒక డాక్టరులాగ రాబోయే పరిమాణాలు వాళ్ళకి తెలియపరచాలనిపించింది.

ఆ మరునాడుకూడా గీతా తన జడ వేయించుకోడానికి అద్దం, దువ్వెన, రిబ్బను, అన్నీ తీసుకొని వాళ్ళ అమ్మతో నాన్నగారున్న చోటుకి వచ్చింది.

"దేవుడా, ఏమిటే నీ గొడవ?" అని కోపం నటిస్తూ లలిత జడ వెయ్యడం ఆరంభించింది.

"అది నిన్ను వదలదు," అన్నాడు విశ్వం, నవ్వుతూ. "ఏమో, ఎవరికి తెలుసు? అమ్మకూడా తనకి రెండో బాల్యం వచ్చేయడంతో నిన్ను జడవెయ్యమని అడుగుతుందేమో?" అని అంటూ కూతురువైపు తిరిగి "గీతా, నీకు తెలుసా, నీ నాయనమ్మ, తాతగారూ, నీతో ఆడడానికి మనింటికి వస్తున్నారు" అని అన్నాడు.

"తాతగారు వస్తున్నారా? చెవుల్లో తెల్లపెండ్రుకలున్న తాతగారా?" అని అడిగింది గీతా.

గీతా అడిగిన ప్రశ్నకి తన భర్త నవ్వడం చూసి లలిత కొంచెం నొచ్చుకుందేమో. లేకపోతే గీతా తన తల తిప్పినందుకు చికాకుపడిందేమో? "కదలకు, బుర్ర తిన్నగా పెట్టు!" అని అంటూ పిల్లతల మీద మెల్లిగా మెట్టికలు పెట్టింది.

"దాని బుర్ర చితగొట్టేయకు!" అన్నాడు విశ్వం. "అందువలన మెదడు దెబ్బ తింటుంది, తెలుసా?" అని అంటూ మళ్ళీ నవ్వాడు. "లలితా, ఇది తెలుసుకో! ఇక ఈ ఇంట్లో నలుగురు పిల్లలన్నమాట! నాకు గీతా ఒక కూతురు; మా నాన్న ఒక కొడుకు; నీకొక కూతురు మా అమ్మ; కొడుకు అరుణ్; ఏమంటావ్?"

"ఇక చాలించండి, మీ మతిలేని మాటలు!" అని లలిత భర్తని మందలించింది. "మీ నాన్నగారు ఉత్తరంలో రాసినది మీరు అక్షరాలా అర్థంచేసుకున్నారన్నమాట! మీ అమ్మ, నాన్నని పసిపిల్లలని ఎలా అనుకుంటున్నారు? ఎవరైనా వింటే నవ్విపోతారు!" అని భర్త నవ్వుని క్షణంలో ఆపేసింది.

"'మరి ముసలితనం, పసితనం ఒకలాంటివే' అని అనడం నువ్వు వినలేదా?"

"నాకు తెలుసు . . . నాకు తెలుసు . . .అవును, నిజం . . . " అని బదులు చెప్పింది లలిత. "నా తల తిరిగిపోతోంది . . .  ఈ సామెతలు నాకు అర్థం కావటంలేదు!"

ఇదంతా గమనిస్తున్న నాకు ఏదో జరుగబోతుందేమో అనే అనుమానం కలిగింది. ఈ సమయంలో లలిత భర్త అంటున్నదానికి ఔనంటూనే నాలిక మడతపెయ్యడం, కూతురు జడని గబగబా పూర్తిచెయ్యడం, వంటింటులోకి విసురుగా వెళ్ళడం - ఈ చర్యలు చూస్తూంటే నాకు ఆమెపట్ల అనుమానం పెరిగి, పరుగెడుతున్న నా లోచనల్ని ఒకసారి దృఢపరిచాయి.

అత్తమామలు రావడంలో లలితకి ఎటువంటి ఉత్సాహమూ లేదనిపిస్తోంది . . .

ఆ మరుసటి రెండు మూడు రోజులు ఇంటి వాతావరణం ప్రశాంతంగానే ఉంది. విశ్వం తల్లిదండ్రులు వస్తున్నారు అన్నమాట తెలియజేస్తూ మరో ఉత్తరం రాకపోవడమే దీనికి కారణమని నేను ఊహించాను. నాయనమ్మ, తాతయ్యలు వస్తున్నారనే సంగతి గీతాకికూడా ఆలస్యంగా తెలియజేయటం ఎందుకని నేను కలవరపడ్డాను. త్వరలో ఆ రోజు రానేవచ్చింది; కాని ఇంటిలో ఎవరికీ ఆ విషయంపై ఉత్సాహమో, సంతోషమో కానరాలేదు.

'ఏదేమైనప్పటికీ లలితలో ఆనాశక్తి కొట్టవచ్చినట్టుగా కనిపిస్తోంది' అని నాలో నేనే అనుకున్నాను. ఆ పరిస్థితిలో, పాపం, విశ్వం మాత్రం ఏంచెయ్యగలడు? ఆ సమయంలో అతను స్థిరంగానూ, ప్రశాంతంగానూ కానవచ్చినందుకు నాకతనిమీద జాలి కలిగింది.

వయసు మళ్ళిన దంపతులు ఆ రోజు వచ్చేసారు; నేను కావాలనే వాళ్ళు వచ్చిచేరిన అరగంటకి ఆలస్యంగా ఇల్లు చేరుకున్నాను.

ఇంట్లోకి అడుగుపెట్టూనే నేను ఆ పెద్దాయనకి చేతులు జోడించి నమస్కరించాను. ఆయన భార్య లోపల – పెరట్లో – పూజా కార్యక్రమంలోనో, స్నానం చేస్తూనో – ఉన్నట్టున్నారు. విశ్వం మాత్రం వాళ్ళ నాన్నగారిదగ్గర కూర్చొనివున్నాడు. ఆయన్ని నాకు పరిచయం చేసాడు. అతని నాన్నగారుకూడా నన్నుచూసినందులో ఆనందిస్తున్నట్టు కానవచ్చారు.

ఆయన నన్ను చూస్తూనే వేసిన మొదటి ప్రశ్న: "మీరు రిటైరావడానికి ఇంకా ఐదారేళ్ళ సమయం ఉంటుందనుకుంటాను; నా ఊహ నిజమేనంటారా?"

"అయ్యా, నాకింకా ఏడేళ్ళ సర్వీసు ఉంది," అన్నాను.

"అంటే ఏడేళ్ళతరువాత మీరుకూడా బాలురైపోతారన్నమాట!" అని నవ్వుతూ అన్నారతను.

అతను చెప్పినది నాకు వింతగా అనిపించింది; నేను నవ్వేసాను.

"ఏడేళ్ళు పోతే మరింక బాల్యం అని అనరుకదా?" అని అడిగాను.

నవ్వుతూనే అతనుకూడా నాతో ఏకీభవిస్తారనుకున్నాను; కాకపోగా అతను నన్ను ఖండించారు.

"అసలు నా ఉద్దేశం ఏమిటంటే, మన సాంప్రదాయంలో మన జీవితాన్ని వెనకకి చూసుకుంటే మనం బాల్యందగ్గరే అంటుకుపోతాం. అందువలనే మనం చేస్తున్న వృత్తినుంచి విశ్రాంతి తీసుకొని మరొకరిదగ్గర ఆశ్రయం పొంది నీడ కోరుతాం."

నేనింక అతనితో మరీ ఏకీభవించకలేక పోయాను.

అరుణాచలంతో మరికొంతసేపు గడిపి నేను నా గదిని చేరుకున్నాను. ఆ తరువాత ఆయన భార్య కామాక్షి అమ్మాళ్ హాలులో ప్రవేశించి కొంతసేపటికి ఒక బల్లమీద వాలిపోయింది. ఇంతలో లలిత కొన్ని పళ్ళు తీసుకొనివచ్చి, వాటిని ఒలిచి, అత్తమామలకి అందించింది.

నేను లలితని గమనించాను. పిల్లల్ని వాళ్ళ తాత, నాన్నమ్మల ఎదుట తీసుకువచ్చి పరిచయం చేసింది. నేను ఊహించినట్టుగా ఆమె ముఖంలో చిరాకుగాని, కోపంగాని, కానరాలేదు. ఉత్సాహం, ఆనందం మూర్తీభవించినట్లుంది. ఐనా ఆమెపట్ల నా అనుమానం పూర్తిగా నివృత్తి కాలేదు. 'సహజంగా ఆశించే పుష్కలమైన తృప్తి, సంతోషంతో ఆ వృద్ధ దంపతులు ఆ ఇంట్లో గడపగలరా?' అని నేను విస్తుపోయాను. హాలులో విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళని చూసాను. ప్రేమ, వినయం, రెండూ నన్ను ఆక్రమించాయి. వారి ఆయువారోగ్యాలకోసం నేను మనసార ప్రార్థించాను.

త్వరలోనే నాకూ, అరుణాచలంకీ సన్నిహితం ఏర్పడింది. అవకాశం దొరికినప్పుడెల్లా నాతో కలుసుకోవాలని అతను ఆసక్తి చూపుతుండేవారు. కాని

అతని భార్య మాత్రం నాతో మాట్లాడడానికి పూనుకోలేదు. ఆమె బహూశా మహా ఐతే నాకన్న రెండేళ్ళు పెద్దనుకుంటాను. ఐనా ఆమె సాంప్రదాయం, సతాచారానికి కట్టుబడే పాత తరానికి చెందిన మనిషి. కాని అరుణాచలం దంపతులు వాళ్ళ సంభాషణలో నన్ను గమనించడం జరుగుతే, వాళ్ళతో వచ్చి కూర్చోమని అతను పిలుస్తారు. అప్పుడావిడ హఠాత్తుగా లేచి వెళ్ళిపోదు. మర్యాదపూర్వకంగా ఒకసారి లేచి, నిలబడి, మళ్ళీ యదాప్రకారం కూర్చుంటుంది; అప్పుడప్పుడు ఒక మాట కలుపుతుండేదికూడా.

ఆ వృద్ధురాలితో నేను సంభాషించిన సమయం చాలా స్వల్పమే; ఐనా త్వరలోనే నేనొక సంగతి గమనించాను. రెండవ బాల్యంలో కాలం గడుపుతున్నామనే భావన అరుణాచలంకి మాత్రమేకాదు. అప్పుడప్పుడు ఆయన భార్యకూడా అదే భావనలో ఉన్నట్లు నాకనిపించింది.

"మేం చిన్న పిలల్లం; ఎవరైనా మమ్మల్ని సాకుతూ, తిండి పెడ్తూ ఉండాలి." ఈ భావన ప్రతి నిత్యం వాళ్ళిద్దరిలో ఎవరో ఒకరు ప్రస్తావించేవారు.

ఆ దంపతులు వారి వృద్ధావస్థలో ప్రశాంతంగానూ, సౌఖ్యంగానూ జీవించడానికి అర్హులు. పూర్వం మహారాజులు, చక్రవర్తులు వయసు మళ్ళినతరువాత పరిపాలించడానికి సమర్ధులైనాకూడా రాజ్యభారం తమ తరువాతి తరానికి అప్పగించి కృష్ణా, రామా అని కాలం గడపడమనేది మన భారత సాంప్రదాయంలో ఒక అంశమే. కాని ఆధునిక యుగంలో కొత్తమందే ఆ మార్గం అనుసరించడానికి పూనుకుంటారు; అప్పుడుకూడా అధికారం అంటపెట్టుకొనివుండాలని ఇష్టపడతారు. బాధ్యతని తరువాతి తరానికి అప్పగించరు. కాని ఈ వృద్ధ దంపతులు పాతపద్ధతి ప్రకారం వారి బాధ్యతలని కొడుకూ, కోడలూ నిర్వహించాలని నిశ్చయం చేసుకున్నారు.

వారి విచక్షణ, నిర్ణయానికి నిజంగా ఆ దంపతుల్ని నేను మానసికంగా అభినందించాను. విశ్వం, లలిత ఆ పెద్దల్ని ఎల్లప్పుడూ ప్రేమాభిమానంతో చూస్తుండాలని నా మనసులో నోచుకుండేవాడిని. ప్రస్తుతం లలిత, విశ్వం, చాలా ప్రేమతోనూ, బాధ్యతతోనూ ప్రవర్తిస్తున్న విషయం నేను గమనిస్తున్నాను. కాని ఈ స్వభావం కొనసాగుతుందా? తన అత్తమామలు వచ్చినప్పటినుంచీ లలిత భర్తతో

కలిసి బయటకి వెళ్ళడం మానేసిందనే చెప్పుకోవాలి. అంతేకాదు. ఇరుగుపొరుగులవారితో మునపట్లాగ కలిసిమెలగడం లేదు. తన స్వంతిత పిల్లలతోనూ ఆడుతూ, పాడుతూ, గడుపుతున్నట్లు కనిపించడమే కాకుండా వాళ్ళని క్రమశిక్షణలో కూడబెట్టే ప్రయత్నంకూడా చెయ్యడంలేదు. ముందులాగ హాలులో కుర్చీలో కూర్చొని పుస్తకపఠనం చెయ్యడంలేదు. కాని ఈ తెచ్చిపెట్టుకున్న భక్తి ఎంతకాలం సాగుతుంది? అత్తమామలు ఇక్కడ రావడంవలన లలితలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చేసింది, కాని దాన్ని రహస్యంగా దాచుకోడం కష్టమే. ఐనా ఈ భావాలని ఎంతకాలం దూరంచెయ్యడం సాధ్యం?

లలితపట్ల నాకు ప్రత్యేక సానుభూతి లేదు. నాకొక దృష్టాంతం కొట్టవచ్చినట్టు కానవస్తోంది. అరటిచెట్టునుండి పొందవలసిన అన్ని విధాల లాభాలని పొందినతరువాతకూడా దానితో తృప్తిపడక పొరలలోపల దాగిన దవ్వనికూడా ఒలిచి వాడుకుంటాడు మానవుడు; మన మనసుకూడా ఆ విధంగానే పనిచేస్తుంది.

లలిత అంతరాత్మలో అణగివుండే భావాలు ఎప్పుడో ఒకప్పుడు బైటకొస్తాయని నేను ఎదురుచూస్తూనేవున్నాను.

ఆ సమయంలో స్తానికంగా ఉన్న సినిమా థియేటరులో ఒక ఇంగ్లీషు సినిమా ఆడుతోంది. ఆ సినిమాకి వెళ్ళాలని కొంతకాలంక్రితం లలిత విశ్వని సాధించడం నాకు తెలుసు. “మన థియేటర్లో అదెప్పుడు చూపిస్తారో? నా ఇంగ్లీషు క్లాసులో చదివిన పాఠం ఆధారంగా తీసిన సినిమా ఇది. ఈ థియేటర్ యజమాని మీ స్నేహితుడని మీరెప్పుడో చెప్పారు. మరి అది చూడబెట్టమని మీరు అడగవచ్చుకదా?” అని భర్తని అడిగింది. ఒక నెలాళ్ళుపాటు మళ్ళీ దాన్నిగురించి ప్రస్తావించడం మానేసింది. ఇప్పుడేమో ఆ సినిమా ఇంటికి దగ్గరలోవున్న థియేటర్ లో ఆడుతోంది! అది చూడడానికి ఇప్పుడు లలిత భర్తతో కలిసి వెళ్ళవచ్చుకదా? సిద్ధపడతారని ఊహించాను. విశ్వంకికూడా లలితకి ఆ సినిమాపట్ల అభిమానం తెలుసుకాబట్టి ఆమెతో విశ్వం వెళ్ళవచ్చు. అందువలన ఆ యువదంపతులు వయోవృద్ధులని ఇంటిలోనుంచి మళ్ళీ, యధాప్రకారం,షికార్లకి వెళ్ళవచ్చు; ఇది సహజమేకదా?

ఆ సినిమా గురించి లలితకి చెప్పాను. "ఔనా?" అనిమాత్రం ఆడిగి ఊరుకుంది. బహూశా తన భర్త వాళ్ళిద్దరూ కలిసి వెళ్దామని అంటాడనుకుంటింది. లేకపోతే తన్ను మాత్రం సినిమాకి దిగబెట్టమని సూచించవచ్చుకదా?

'ఇదా సంగతి?' అని అనుకున్నాను నా మనసులో. లలిత చాలా చురుకైన పిల్ల. తన మనసులో ఏముందో ఒకంత ఇతరులకి తెలియనివ్వదు. మరి ప్రస్తుతం ఆమె నిర్లక్ష్యంకి అర్థమేమిటి? ఆ సినిమా దగ్గర లేనప్పుడు నిండా అల్లాడుతుండేదికదా? మరి ఇప్పుడో . . .

కొన్నిరోజులు దొర్లిపోయాయి; నేను ఊహించినట్టు జరగలేదు. ఒక విధంగా నిజాన్ని ఊహించుకొని దిమ్మెరపోయాను. లలిత మూర్ఖురాలా? ఆ సినిమాగురించి ఇంటిదగ్గర ఏ విధమైన చర్చ జరగలేదు. అంతేకాక ఇవాళ ఆ సినిమా ఆఖరట. విశ్వంని ఆడిగాను. ఆ దంపతులకు ఆ ఆలోచనే లేదని నాకు చెప్పాడు. తనూ చూసే ఆలోచన లేదన్నాడు.

ఆ అవకాశం జారవిడవకూడదని నేను నిశ్చయించాను. ఆ మధ్యాహ్నం పెద్దవాళ్ళ సమక్షంలో ఆ ప్రస్తావన తెచ్చాను. "పాపం, లలిత ఆ సినిమా చూడడానికి అత్యాశ పడుతోంది!" అని చెప్తూ ఆ విషయం విశ్వంకి సూచన చేసాను.

"లలిత ఇంగ్లీషు సినిమాలుకూడా చూస్తుందా?" అని అడిగారు అరుణాచలం కొంచెం ఆశ్చర్యంతో.

"ఇంటిదగ్గర ఉన్నప్పుడు ఇరుగుపొరుగువాళ్ళు ఎంత చెప్పినా తమిళమో, ఇంగ్లీషో, ఏ సినిమాలూ చూడదే?" అంది అతని భార్య.

"మనుషులు మారరంటావా నీ ఉద్దేశంలో?" అని కల్పించుకున్నారు అరుణాచలం. "నలభైయేళ్ళు నేను సర్వీసు చేసాను; ఇప్పుడేమో ఏ పనీ చెయ్యకుండా కూర్చున్నాను. నువ్వు నీ జన్మంతా ఆ వంటగదిలోనే గడిపేసావ్! కాని ఇప్పుడు నీ భోజనంకోసం మరొకరి దయాదాక్షిణ్యంమీద ఆధారపడ్తున్నావ్!"

"అందులో తప్పేముంది?" అన్నాడు విశ్వం, నావైపు చూస్తూ. "మీరు ఏమంటారు? ఎవరైనా సరే, జీవితాంతం ఇతరులకి సేవ చేస్తూ ఎంత కాలం గడపాలి?"

“నీవన్నది నిజమే . . . ” అని అన్నాను, నేను తలాడిస్తూ.

నాకేమిటో అంతా గందరగోళంగా ఉంది.

లలిత ఏదో నెపంమీద అక్కడనుంచి దూరంగా వెళ్ళిపోవడం గమనించాను. ఆమె ఒక ఆదర్శ గృహిణి. ఆత్మవిశ్వాసం, బాధ్యత, ఆవిడ ఆభరణాలు. ఇల్లు తీర్చిద్దడంలో ఆరితేరిన స్త్రీ.

అంతలోనే ఆమె మడిచీరలు దండెమీద ఆరవేస్తుండడం గమనించాను. ఆమె మనసులో ఆ సమయంలో ఎటువంటి భావనలు పరుగెడుతున్నాయో అని నా మనసు బాధపడింది.

నాకొక ఆలోచన తట్టింది. అది విశ్వంకి తెలియజేసాను: “మీరు ఆ సినిమా చూసి తీరాలి. నేనే మీకు రెండు టికెట్లు తెచ్చిపెడ్తాను. ఒకటి నీకు, ఇంకొకటి లలితకి; మీరు వెంటనే తయారవ్వండి!” అని చెప్పి సినిమా థియేటర్ కి పరుగుతీసాను.

భార్యతో కలిసి సినిమాకి వెళ్ళడానికి విశ్వం నా సూచన అంగీకరించాడు. టికెట్లు లలితకి అందించి వాళ్ళు ఆ సినిమా తప్పకుండా చూడాలని నేను ఒత్తిడి చేస్తూంటే, లలిత కొంచెం తడబడుతూ కనిపించింది. కాని ఆమె అత్తమామలుకూడా నా సూచనని బలపరిచారు. ఎలాగైతేనేం, తన అత్తమామలు తాను ఇంటిదగ్గరలేని సమయంలో ఇబ్బంది పడరని - మళ్ళీ మళ్ళీ - తెలుసుకున్నతరువాతనే లలిత అంగీకరించింది.

విశ్వం, లలిత బయటకి వెళ్ళిన తరువాత ఆ వృద్ధులకి తోడుగావుండాలనే సంకల్పంతో నేను వాళ్ళదగ్గరకు చేరాను.

ఇప్పుడంతా లలిత చాలా సంతోషంగా ఉండడం గమనిస్తున్నాను అన్నారు అరుణాచలం.

“ఔను, నేనూ చూస్తున్నాను. వెనుకటికి ఆమె భర్తతో ఎప్పుడూ వాదించేదికాదు. నాలుగరోజులముందు తానుచెప్పినదానికి వేరే పప్పు తీసుకువచ్చాడని దెబ్బలాడడం చూసాను. వాడ్ని ఎలాగ వాయించిందో తెలుసా?” అంది అతని భార్య.

"మరి అందుకే నేనంటున్నాను, వాళ్ళ దృష్టిలో మనం పడకుండా ఉండాలని," అన్నారు అరుణాచలం.

నేను వాళ్ళతోబాటే ఉన్నానన్న విషయం వాళ్ళకి గుర్తుచెయ్యాలనుకున్నాను. ఆరోజు లలిత ఎందుకు భర్తని చిరాకుపెట్టిందనే కారణం నాకు తెలుసు; అసలు సంగతేమిటో చెప్పాలనుకున్నాను.

"అవాళ లలిత తయారుచేయబోయే ప్రత్యేక వంటకానికి ఆమె తెమ్మన్న వస్తువు చాలా ముఖ్యమైనది; ఏ వంటవాడికైనా అదొక ప్రశ్నకదా?"

"దగ్గరలో పెద్దలుకాని ఉంటే, ఎవరైనా సరే, కొంచెం మర్యాద, అమరిక చూపడం సహజం. మరి, ఈ ఇంట్లో పెద్దవాళ్ళెవరూ లేరుకదా? మేం చిన్నపిల్లలైపోయాం. అలాంటప్పుడు ఎవరైనా మమ్మల్ని పెద్దవాళ్ళని ఎందుకనుకోవాలి?"

'ఓరీ భగవంతుడా! విశ్వం తల్లిదండ్రులాంటివాళ్ళు, విశ్వం, లలితవంటి యువజంటలతోనే ప్రపంచం నిండిపోతే ఎంత బాగుంటుందో!' అని నేను అనుకున్నాను. ఈ విషయంలో నా సంతోషం తెలియజేయడానికి బిగ్గరగా అరిచి చెప్పాలన్న గాఢవాంఛ నాకు కలిగింది; కాని బైటకి ఇలా అన్నాను:

"లలిత అటువంటి మనిషి అని నేను చూడలేకబోతున్నాను."

మా సంభాషణ వేరే దిశలో తిరగడంతో లలిత తరపున నాకున్న ఆదరణ కొంతవాటి తగ్గింది. నా వయస్సుకి తగినట్టుగా ఈ రెండు జంట్లమధ్య నిష్పక్షపాతంగా నా ప్రవర్తనని నడిపించుకోవాలి. ఈ కుటుంబంలో నాకున్న పరిచయంవలన అలాగ మెలగడమే ఉచితం.

ఆ వృద్ధదంపతులు వచ్చిననాటినుంటి ఎందుకోగాని నా మనసు వాళ్ళవైపే మళ్ళుతూవుంది. ఆ విషయంలో ఆ రోజు నా మనసు దృఢంగా తేలింది.

రోజులు దొర్లిపోతున్నాయి; లలిత అత్తమామలు వచ్చి అప్పుడే రెండునెలలైంది. లలిత, విశ్వం ఇంగ్లీషు సినిమా చూసి మూడు వారాలైంది. ఐనాకూడా లలిత భర్తతోకలిసి బయటకి వెళ్ళడంకాని, సినిమాకని థియేటర్ కి వెళ్ళలేదు. ఆమెకు ఆ ఇల్లే ప్రపంచంగా మారింది.

విశ్వం తన తల్లిదండ్రులు ఆ చుట్టుపట్లవున్న చూడవలసిన ప్రదేశాలకు - గుడులూ, పార్కులూ - తీసుకువెళ్ళాడు. తన స్నేహితులకు పరిచయం చేసాడు. నాకు తెలుసు, అతనొక ఆదర్శ కొడుకే; కాని ఆదర్శభర్త కూడానా?

అత్తమామలు, అప్పుడప్పుడు, వాళ్ళతోబాటు మనవరాలినికూడా కూడా వెండబెట్టుకొని వెళ్తూంటారు. వాళ్ళతో వెళ్ళినా గీతా సాధారణంగా తల్లితో గడపడానికే ఎక్కువగా ఇష్టపడేది. అత్తమామలతో లలిత వెళ్ళడం చాలా అరుదే. ఒకరోజు లలిత అత్తగారిని తనతోపాటు దగ్గరున్న పార్కుకి రమ్మని పిలిచింది. దానికి ఆవిడ "గత నాలుగురోజులుగా నేను రోజూ బైటకి వెళ్ళడంవలన అలసిపోయివున్నాను. నువ్వు విశ్వంతో వెళ్ళమ్మా," అని అన్నారట. పోనీ, ఇరుగుపొరుగువాళ్ళనైనా లలిత తోడురమ్మంటుందేమో అని నేను అనుకున్నాను. కాని ఆమె కనీశం ఆ ప్రయత్నంకూడా చెయ్యలేదు. వెనకటికి లలిత తన అత్తవారింట గడిపిన రోజుల్ని తలుచుకున్నాను. మరి ఇప్పుడు భర్తతో గడుపుతున్న రోజులు! అత్తమామల అదుపులో ఉన్నప్పుడు ఆమె ఎన్నెన్ని కలలు కన్నదో? ఇప్పుడు ఆమెను పట్టుకున్నదంతా భయమే, అసహ్యాభావం కాదు.

ఇటువంటి ఆలోచనలు నా మనస్సులో మొలకడంతో నేను ఆ వృద్ధదంపతులని శ్లాఘించకపోయాను. నిందారోపణకూడా చెయ్యలేకబోయాను. ఈ పరిస్థితిలో వారి భావనలు సర్వసహజంగానే కనిపిస్తున్నాయి. మరి లలిత ఎందుకు భీతిల్లిపోవాలి?

ఇది లలిత స్వంత కుటుంబం; దాన్ని ఆమె చేతనైంతవరకూ బాగానే నడుపుతోంది. కాని ఆమెకు తీరుబాటైనప్పుడు ఇరుగుపొరుగులతోనూ, స్నేహితులోనూ కలిసి కాలక్షేపం చెయ్యవచ్చుకదా? కాని అలా చేస్తే లేనిపోని కబుర్లు, పుకార్లు బయలుదేరుతాయనే భయం కాబోలు! ఇంటితోనే ఉండిపోవాలని నిశ్చయించుకుంది; అలాగైతే తన ఆధీనంలో ఉంటుందనా?

ఆసక్తికరమైన ఒక సన్నివేశం - నేను చాలారోజులముందు గమనించినది - ఇప్పటికీ మరువలేకవున్నాను. లలిత, విశ్వం హాలులో పాచికలాట ఆడుతున్నారు. వాళ్ళ అమ్మాయి నాన్నపక్కన కూర్చొనివుంది. చంటివాడిని

లలిత తన కాళ్ళమీద పడుకోబెట్టుకుంది. ఇప్పుడింక విశ్వం కథ చదవడం, అది విని లలిత ఆనందంగా వింటుండడం అనే సన్నివేశాలు లేవు. ఇప్పుడంతా మనవరాలు తాత, నానమ్మలతో ఆడుకోవడం, వాళ్ళ ముద్దు ముద్దు మాటలతో నాన్నగారిని మురిపించడం లాటి దృశ్యాలే మామూలైపోయాయి. ఇటువంటి సమయాల్లో లలిత కావాలనే వంటింటిలోనే అతుక్కుపోయింది. అక్కడనుంచే ఇవన్నీ గమనిస్తూ ఇంటిపనులు చేసేది.

అప్పుడప్పుడు నేను ఆ వృద్ధదంపతులని దగ్గరలోవున్నగుడికో, ఏదైన మతపరమైన ప్రవచనాలు వినడానికో  నావెంట తీసుకువెళ్ళేవాడిని. అదొకటి నేను చెయ్యగలిగినది. ఆ ప్రయత్నంతోనే నాకు తృప్తి. ఇప్పటకీ నేను ఈ ఇంట్లో పరాయివాడే అవడంవలన ఈ ఇంటి వ్యవహారాల్లో ఇంతకన్న నేను జోక్యం చేసుకోవడం భావ్యమా?

నిజంగా అదే నా సమస్య; ఈ సమస్యని నేను వేరే విధంగా పరిశీలించాను. ఒకరోజు నేనుకూడా వయసు మళ్ళిన తరువాత అరుణాచలంలాగే నా జీవితం వెళ్ళబుచ్చడానికి ఇతరులమీద ఆధారపడి జీవించవలసిందేకదా? ఈ రోజు నేను ఈ వృద్ధులని విమర్శిస్తున్నానుకాని వారి వయస్సు చేరుకున్నతరువాత నా తీరెలా ఉంటుందో ఎవరు ఊహించగలరు? ఈ యువ జంటలో నేనేమైనా దోషం కనిబెట్టగలనా? లేదు, ఏమాత్రం లేదు!

పదవీ విరమణ తీసుకునేవారు సాధారణంగా వారి భవిష్యత్తు గురించి దిగులుపడతారని నేను వినివున్నాను. ఆ ఆరాటంలోని నేపధ్యం ఏమిటో ఇప్పుడు నాకు అర్ధమైంది. నా భవిష్యత్తు గురించి ఆలోచనే నన్ను కాస్త అసంతృప్తికి గురిచేస్తూండడంవలన ఈ వృద్ధదంపతులపట్ల నాకు సానుభూతి కలిగినా  నా అంతరాత్మలో మనసు ఈ యువ దంపతులపట్ల ఆనుకుంది.

నా ప్రోత్సాహంతో ఒకరోజు పిల్లల్ని వెంటబెట్టుకొని విశ్వం, లలిత ఒక తమిళ సినిమాకి వెళ్ళారు. నాకు కొంత ఆపీసుపని ఉండడంవలన నా గదిలో కూర్చొని నేను రాసుకుంటున్నాను.

ఆ వృద్ధదంపతులు ఏదో మాట్లాడుకుంటున్నారు. కొంతసేపటికి వాళ్ళ - సంభాషణ కొడుకు, కోడలమీద వెళ్ళింది. ఆతురతతో వాళ్ళేం మాట్లాడుకుంటున్నారని విన్నాను.

"బాగుంది! మరి ఇప్పుడు ఎందుకు వాళ్ళకెందుకు చెప్పకుండా ఉన్నారు?" అని అడిగింది కామాక్షి అమ్మాళ్.

"అదే, ఆ సంగతి ఎలా చెప్పాలని ఆలోచిస్తున్నాను," అన్నారు అరుణాచలం.

"అంటే, ఏమిటి మీ ఉద్దేశం? ఏమైనా వాడు మన కొడుకేకదా? మనం ఎందుకు భయపడాలి? మరో ఆలోచన లేకుండా మీరు వాడికి చెప్పాల్సిందే!"

"ఔను, నిజమే. ఇంకా రెండువారాలు టైముంది మనం వెళ్ళడానికి."

"మీరు మూడు నాలుగు రోజుల్లో తెలియజేయండి. ఒకసారి స్థిరపడిపోతే నాకు ఇక్కడ బజారులో కొంచెం పని ఉంది."

"హూం," అని అన్నారు అరుణాచలం. కొంతసేపు నిశబ్దం. ఆ దంపతులు తమ రాబోయే షష్టిపూర్తి గురించి కాబోలు చర్చించుకుంటున్నారనుకున్నాను; రాయడం ఆపి వాళ్ళదగ్గరికి చేరుకున్నాను.

"మా  షష్టిపూర్తి గురించి కాదండీ మేం మాట్లాడడం," అన్నారు అరుణాచలం. "అది గత సంవత్సరమే అయిపోయింది. ఇప్పుడు మేం మా మనస్ఫూర్తి కోరిక - మరో కార్యక్రమం గురించి - చర్తించుకుంటున్నాం."

నేను చిక్కులో పడ్డాను. అరుణాచలం సంగతేమిటో నాకు వివరించారు.

నిజానికి అతను ఉద్యోగవిరమణ చెయ్యలేదు; కాని ఇప్పుడు తీవ్రంగా యోచిస్తున్నారు. విరమణకి కారణం: అతని సహోద్యులలో పనితీరేపట్ల అతనికున్న అంకిత భావం; ఇంకా పనిచేయాలనే అతని కోరికని అభినందించేవాళ్ళు ఎక్కువమందే ఉన్నారు; కాని కొందరు తన వెనుకన "చూడవయ్యా, ఇతనికి అధికార వాంఛ, డబ్బు అంటే ఎంత ఆశ?" అని విమర్శించడం అతనికి తెలుసు. తన ప్రస్తుత పరిస్థితిపట్ల ఆయనకి పూర్తి సంతృప్తి ఉంది. కాని తాను పదవి విరమించాలనే కోరికకూడా ఆయన మనసులో తచ్చాడుతోంది. అతని పై అధికారులు ఆయన్ని విరమించుకోమనకుండానే అతను ఉద్యోగం వదిలేసి కొడుకుదగ్గర ఉండడానికి ఎలా సమర్థించుకోగలరు? ఆది అంత

అత్యవసరమా? ఇంకా చెప్పుకోవాలనుకుంటే ఉద్యోగంనుంచి నిష్క్రమించినా ముందులాగే వారి పూర్వీకుల ఇంట్లో కాలం గడపాలనివస్తే అది అతని గౌరవానికి హాని కదా? ఈ సమస్యగురించే అతను ఆలోచిస్తున్నారు.

తనకి రావలసిన సెలవు చేతికి అందిరావడం ఒక కారణమైతే, అసలు ఇక్కడ స్థితిగతమెలావుందో స్వయంగా తెలుసుకోవచ్చనికూడా ఇక్కడికి ఇప్పుడు రావడం ఇంకొక కారణం. వాతావరణం అనుకూలంగా కనిపిస్తే తన ఉద్యోగవిరమణగురించి ఒక నిర్ణయం చేసుకుంటారు; లేదంటే మళ్ళీ వెనక వెళ్ళి ఉద్యోగంలో కలుసుకుంటారు.

తన సెలవు ఐపోవస్తూందికాబట్టి వాళ్ళ నిర్ణయాన్ని అరుణాచలం దంపతులు కొడుకికి తెలియజేయాలనుకుంటున్నారు; తమ యింటికి తిరిగివెళ్ళిపోవాలని నిశ్చయించారు.

“నాకిది అర్థం కావడం లేదు!” అన్నాను నేను అరుణాచలంతో. మీకు అధికార వ్యామోహం అని ఎవరో తప్పుగా విమర్శించినమాత్రాన వాళ్ళమాటలు మీరు పట్టించుకోకూడదు! దేశానికి మీలాంటివారి సేవలు ఇంకా చాలా అవసరం.” నేను మనస్పూర్తిగా చెప్పిన మాటలవి.

ఆ మరునాడు విశ్వంకూడా వారి నిర్ణయం విని ఆశ్చర్యపోయాడు. “మీరు సెలవులో వచ్చారన్న విషయం ఒక్కసారికూడా చెప్పనేలేదే? ఏం? ఎందుకు?” అని హీనస్వరంలో అడిగాడు; తన తల్లిదండ్రులకి తనమీద నమ్మకం కలగలేదన విషయం గ్రహించి కొంచెం బాధపడ్డాడు.

“మేం సెలవులకి ఇక్కడకి వచ్చామన్న సంగతి తెలుస్తే మీరు మమ్మల్ని ప్రత్యేక అభిమానంతో గారాబం చేసేవారు. అప్పుడు మేం ఉక్కిరిబిక్కిరి ఐపోతాం!” అన్నారు ఆతని అమ్మగారు.

“అదే, అదే నిజం!” అంటూ ఆమెకు వంత పాడారు అరుణాచలం.

ఇప్పటికీ అతని మాటల్లోని ధ్వని నన్ను ఆశ్చర్యపరిచింది.

వాళ్ళు చిన్నపిల్లలనే ఆ ఇద్దరూ అంటున్నారు; కాని, నిజంగా చిన్నపిల్లలకీ, వారికీ ఏమైనా స్వామ్యం ఉందా? చిన్నపిల్లలు వాళ్ళ తల్లిదండ్రులపట్ల పూర్తిగా అరమరికలోని నమ్మకంతో ఉంటారు; అమ్మా, నాన్నా ఒకప్పుడు వాళ్ళని

శిక్షించినా అందుకు పిల్లు వాళ్ళని తప్పుబెట్టరు. ఎప్పుడైనా ఇంటిలో వాతావరణం వేడెక్కినప్పుడు అమ్మా, నాన్నా రాజీపడేందుకు ప్రయత్నిస్తారు. అప్పుడప్పుడు పిల్లలు పెద్దరికం వహిస్తూ అలాగే ప్రవరిస్తారు కూడా.

వారి సంభాషణబట్టి ఆ వృద్ధదంపతులుకూడా రక్షణకోసం మరొకరిపై ఆధారపడవలసివుందున్న భావం వెలువరించారు; వారు చివరికి స్వంత ఇంటికే చేరుతారనే విషయంలో నాకు ఎంతమాత్రమూ విచారం లేదు.

అరుణాచలం దంపతులకి వీడ్కోలు చెప్పడానికి నేనుకూడా రైల్వేస్టేషన్ కి వారితోబాటు వెళ్ళాను. వీడ్కోలు చెప్పే చివరి క్షణంలో నేనుకూడా ఉద్రేకంకి పాలయ్యానని చెప్పుకోవాలి. లలిత, విశ్వంతోబాటు నేనుకూడా నా భావాన్ని వ్యక్తపరిచే స్థితిలో - తడిసిన కన్నులతో - ఉంటానో అని కొంచెం సంకొచపడ్డాను. ఏ విధమైన భావాలూ లేనివారు అరుణాచలం దంపతులు, గీతా, ఆ చంటిపిల్లవాడు అరుణ్ - నలుగురు మాత్రమే.

ఈ ఒక్క విషయంలోనే ఈ వృద్ధులు, బిడ్డలు ఒకేలాగ ఉన్నారని నేను గ్రహించగలిగాను; ఇంటికి తిరిగివచ్చినప్పుడు ఆ విషయంపై విశ్వంని ఓదార్చాలనుకున్నాను.

రైలు పొగ కక్కుతూ మెల్లిగా ప్లేట్ ఫారం నుంచి బయలుదేరింది. ఆ వృద్ధదంపతులు క్రమేపి మా చూపులనుండి మాయమయ్యారు. మేం ఇంటికి వచ్చినప్పుడు విశ్వంని దగ్గరనుంచి గమనించాను.

“ఎవరేమన్నా మీ తల్లిదండ్రులు చంటిపిల్లలు కాదు! మీ చంటిపిల్లలనుంచి దూరమైపోతున్నట్టు మీరెందుకు బాధపడుతున్నారు?” అని నేను ఊరడించాను.

“వారు పిల్లలతో సమానమే,” అంది లలిత దృఢచిత్తం వ్యక్తీకరిస్తున్న ధోరణిలో. “పిల్లలు ఎప్పుడూ వూరికే కూర్చుండరు; ఏదో ఒకటి చేస్తూనేవుంటారు. నాన్నగారు మళ్ళీ ఉద్యోగంలో చేరాలనుకుంటున్నారు; అత్తగారు కూడా ఏదో ఒక వ్యాపకం చేస్తూండాలని ఆలోచిస్తుంటారు.”

“నిజంగా వాళ్ళు చిన్న పిల్లలే; మరొకరిమీద ఆధారపడకూడదన్నదే వాళ్ళ లక్ష్యం,” అన్నాడు విశ్వం, నా వంక చూస్తూ; తన చెయిని వదిలి తన వెంటనే నడుస్తున్న గీతాన్ని అతను పట్టించుకోలేదు.

“ఆ కారణం వలనే మీ నాన్నగారు ఎప్పుడూ అంటుంటేవారు - వాళ్ళు మరొకరి దయ, రక్షణమీద ఆధారపడి బతుకుతారని,” అన్నాను నేను అతనితో ఏకీభవిస్తూ. విశ్వం తల్లిదండ్రులకీ పిల్లలకీ మధ్య ఎటువంటి సామ్యం లేదని నా నిర్ణయాన్ని వెలిబుచ్చాలనే కోరిక నాకేకోశాన్న లేదు.

ఆ దంపతులు సహజంగా, చంటిపాపల మనస్తత్వంతో వారి పెద్దలగురించి మనసువిప్పి మాట్లాడుతున్నారనితప్ప నేను మరేం చెప్పాలి?

వారు తమ మనోభావాలు వెల్లడిస్తున్నందుకు వారిని శ్లాఘిస్తూ నా మనసు ఉప్పొంగిపోయింది:

‘దృఢమైన, శక్తివంతమైన ఇద్దరు స్వతంత్రజీవుల వారసులు మీరు. ఇప్పుడు మీరు బాధ్యాయుతమై, తల్లిదండ్రుల పాత్రలు - నిజానికి పసిపిల్లల మనస్తుతి కలిగియున్నాకూడా - పోషిస్తున్నారు. ఇప్పుడు మీరు నిజంగానే ఈ స్వాతంత్యంకి అర్హులు.’

బహుశా లలిత నా అభిప్రాయాన్ని తెలుసుకోందేమో లేక దూరాన్న వినిపిస్తున్న రైలు ఇంజన్ దీర్ఘ నిట్టూర్పు విన్నదేమో, ప్రేమ, అనురాగంతో తన దృష్టి భర్తవైపు మళ్ళించింది; ఒక దీర్ఘ నిట్టూర్పు విడుస్తూ అతనుకూడా ఆమె చూపులతో తన చూపులు కలిపాడు.

*******

# పాప ఏడ్చింది[1]

పాప బిగ్గరగా ఏడవడం విని గబగబా హాలుకి పరుగెత్తుకొని వచ్చాను; ఆ దృశ్యం చూసి నిర్ఘాంతపోయాను. నేను వచ్చినప్పుడు పాప ఏడ్పు వినిపించలేదు. అయ్యో! అసలు బొందిలో ప్రాణం లేదేమో అనిపించింది. మొహం బాగా నల్లబాఱిపోయింది. లేవనెత్తిన మెడ; తెరచిన కన్నులు; జడమైన ధోరణితో కనిపించింది. నేను వెళ్ళి ఆమె రెండు చెవులూ మూసాను, ఐనా ఏమీ వినిపించలేదు. ఒక నిమిషం, నాలుగు నిమిషాలు గడిచాయి. అయ్యో, కంఠ ధ్వని వినిపించదే? . . . పక్కన ఎవరూ లేరే? . . . ఇక ఏమౌతుందో? . . . గాబరాతో చుట్టుపక్కల తిరిగి చూసాను . . .

'అదిగో . . . మావారు!' అతన్ని చూడగానే నాకు ఒక నిమిషం విభ్రాంతి కలిగింది. 'ఛీ, ఎందుకతను అలాగ ఉత్తికే నిలబడిపోయారు! మగాళ్ళు అంటే ఇలాగే కాబోలు!' అనిపించింది. ఒక నిమిషం నా మనసులో సహించరాని ద్వేషం లేచింది. కాని పాప గొంతు వినిపించిన క్షణంలో అది మాయమైపోయింది; నాకది వెంటనే అర్థమైంది. అవును. పాపం, ఆయనకేం తెలుసు? పాప ఏడవడం ఆపేసిందని అనుకొనివుంటారు. నాకు తమ్ముడ్లూ, చెల్లెళ్ళూ ఉన్నారు; వాళ్ళతో మెలగడంవలన పిల్లలగురించి నాకు కొంచెం తెలుసు.

పాపకి గుక్క తిరిగినట్టు కనిపించగానే, నాకూ ఊపిరి తిరిగినట్టనిపించింది. "అబ్బా, మంచివేళ!" అని ఎవరో అన్న మాటలు వినిపించాయి. అనుమానం తీర్చుకోవాలని తిరిగిచూసాను. అవును, అతనే ఆ మాటలన్నారు. కొంచెం సమయంముందు అతను రేడియోకి దగ్గర నిలబడి, కుర్చీలో కూర్చుందామా, వద్దా అనే ప్రశ్నతో తగవులాడుతున్నట్టు కనిపించారు; ఇప్పుడు దానిమీద వాలడం చూసాను. అవును,

---

[1] (ఆగస్టు, 1949, **కళైమగళ్** తమిళ పత్రికలో, **'పాప ఏడ్చింది ',** అనే వాక్యంతో ఆరంభమవుతున్నట్టు ఒక కథ రాయాలనే పోటీలో మొదటి బహుమతి అందుకున్న కద.)

అతని మనసులో ఆరాటం లేదు. ఇంతసేపూ పాపగురించి గాబరా పడినా ఏంచెయ్యాలో తెలియక తపించిపోయారు. పాపం, అతనికీ పాప అంటే లోలోపల చాలా ప్రేమ ఉంది, కాని మగవారుకదా? నేను ఆడదాన్ని, నాలాగ మెలగడానికి అతనికి సాధ్యమవుతుందా?

మనసులో ఇలాంటి ఆలోచనలు ఏమేమో లేచినా, నా స్వల్పత్వం, ఆరాటం మింగేసి కొన్ని నిమిషాలు నా ఆడతనం నిరవేర్చిన విజయంకి నేను గర్వపడ్డాను. పాప కంఠధ్వని వినిపించినట్టు చేసానుకదా? అంతేకాదు. అభిమానంతో పాపని రెండు చేతులతో తీసుకొని నడుములో పెట్టుకొని, మావారి మీద కడగంటి చూపు విసిరాను. ఆ దృశ్యం చూసి అతను ఆనందిస్తున్నారని తెలియగానే నా ఆనందం మితిమీరిపోయింది. అతనితో ఏమీ మాటాడకుండా వెళ్ళకూడదని, ఇంతవరకూ నేను అడగాలనుకున్న ప్రశ్న గుర్తుచేసుకొని, అడిగేసాను: “అసలు బాలాకి ఏమైంది? ఎందుకు ఏడ్చింది? కింద పడిపోయిందా? దెబ్బ తగిలిందా?”

“నేను కొట్టాను.”

‘అయ్యో, ఇతను ఏమంటున్నారు? నన్నెందుకిలా చంపుతున్నారు? అయ్యో, నిజంగానా? పాపని వాయించారా?’

ఒకసారి అతన్ని చురుగ్గా చూడడంతో నా మొహం చిరచిరలాడింది; నాలో ఒకే సమయంలో కోపం, మనోవేదన, జుగుప్స, చోటుచేసుకున్నాయి. మరేం అనక, వంటగదిలో దూరాను. ఇతని అనుచిత ప్రవర్తన నేనిక భరించలేను; ఇన్నిరోజులూ పగబట్టిన మనిషిలాగ కనిపించారు. మరి, ఇప్పుడేమో . . .

ఇంతలో స్నానం ముగించుకొని వదిన[2] వచ్చేసింది; నా తోడికోడలు మొహం చూడడానికే నాకు లజ్జగావుంది.

“లలితా, పాప ఏడ్చిందా? . . . ఏం, నువ్వూ ఏడుస్తున్నావా? ఎందుకు?” అని అడిగింది.

---

[2] తోడికోడల్ని వదిన అని అంటోంది.

నా మనోవేదన తాళలేక చెప్పేసాను; పాప వెక్కి వెక్కి ఏడ్చిన ధోరణి, వణుకుతున్న ఆమె గడ్డంలో ఇప్పుడూ కనిపించే బాధకి కారణమేమిటో వివరించి చెప్పాను.

వదిన ఎక్కువగా ఏమీ అనలేదు. కాని ఆవిడ కళ్ళలో, ముఖంలో ఒక విధమైన ఆశ్చర్యమూ. ఉదాసీనత కనిపించాయి. 'ఇవన్నీ మామూలేగా?' అనే పైఖరిలో ఆవిడ మనసుందని నేను గుర్తుచేసుకున్నాను; నాకూ ఏడవాలనిపించింది.

అప్పుడే మా ఆయన వంటగది ద్వారందగ్గరవచ్చి నిలబడ్డారు.

"నేనేమో నాకు తెలియకుండానే - ఆవేశంతో - పాపని కొట్టాను. రేడియోలో న్యూస్ వింటున్నాను. పాప ఏదో అడిగింది. వెంటనే చెంపలో దాన్ని గట్టిగా వాయించేసాను. పాపం, నేనిలా చేస్తానని పాప ఎదురుచూడలేదు వదినా!"

అతని మాటలు విన్నతరువాత వదిన రెప్పవేయకుండా అతన్ని ఒకసారి చూసింది: క్షమాపణ అడగడానికీ, అది ఇవ్వడానికీ ఇద్దరిమధ్యా బంధుత్వం అని ఒకటి ఉందికదా?

నాకలాగే తోచింది. ఆవిడ మనసులో ఏముందో నాకు తెలియదు. నాకు వదినమీద కోపం రాలేదు; కోపమంతా మావారిమీదనే. మనిషికి ఎంత అజాగ్రత్త! స్వంత పాపనే నాన్న వాయించుతే తల్లికి రోషం, తల్లి కొట్టితే నాన్నకి కోపం - ఇది లోకంలో ఎంత సహజం! దాక్షిణ్యం చూపకుండా వదిన టూకీగా ఓ రెండు మాటలు చెప్పివుంటే ఇతనికి బోధపడుతుందేమో? ఇతనివలన నాకూ అదే గతి, అవస్థ - నలుగురు చూసి నవ్వడానికి. రోజూ ఏం పని చెయ్యకుండా, భోజనం చేసి, నిద్రపోయి, న్యూస్ వింటూ, పిచ్చాపాటీ చెయ్యడం ఇతనికి అలవాటైపోయింది. ఇక నా మాటకొస్తే నిత్యమూ చిన్నతనం, దాసత్వం, భవిష్యత్తు గురించి భయం. కలవరం . . . మా పరువు, ప్రతిష్ట కాపాడుకోవాలని, సాంప్రదాయకంగా మేమిప్పుడు మా మరిది కుటుంబంతో ఉంటున్నాం. కాని ఇవాళా రేపూ ఎవరికి ఏ హక్కులున్నాయని గట్టిగా చెప్పడం సాధ్యమా? అందరికీ - తమకు తామే స్వాతంత్రం, కుటుంబాలకి హక్కులు, బాధ్యతలు వచ్చేసాయి. మాకని కుటుంబం లేదు, కాని వాళ్ళతో మేముండడం వాళ్ళకి భారమేకదా?

అవును, మావలన వాళ్ళకి కష్టమే అనాలి. ఇప్పుడుకూడా వదిన ముక్కుసూటిగా రెండు మాటలనగలదా? పాపం, మావారి మాటలు వింటూ నిలబడింది; ఏమీ అనక పాపని తన చేతుల్లోకి తీసుకుంది.

"వదినా, పాపని నాకివ్వండి. అది ఇక నాదగ్గరికి రాదేమో అని నాకు భయమేస్తుంది" అన్నారు మా ఆయన.

వదిన పాపని అతనిపక్కన తీసుకొనివెళ్ళింది: "ఇదిగో, పాపకి ఇవన్నీ తెలుసునా? . . . ఏమ్మా, బాలా . . . వెళ్ళు . . . మీ పిన్నాన్న నిన్ను పిలుస్తున్నారు," అని అంటూ అతనికి అందించింది. కాని . . . అయ్యో . . . ఇదేంటి? పాపకి ఇష్టం లేనట్టుంది! గభీమని తల్లి భుజంమీద వాలి మొహం కప్పుకుంది!

వదినకి తృప్తి కలిగిందేమో? తాను చెప్పాలనుకున్నదేదో పాప స్పష్టంగా తన చర్యలో తెలియజేసిందికదా? మా ఆయన మొహం ఏదోలాగ ఐపోయింది.

వదిన మెల్లగా నవ్వుతూ, దాన్ని మరిచిపోవాలనే ఉద్దేశంతో "అమ్మలూ, వెళ్ళమ్మా . . . అతనేం చెయ్యరు . . . " అని అంది. బాలా తిరిగి ఇంకొకసారి చిన్నాన్నని చూసింది; కాని అతని దగ్గరకి వెళ్ళలేదు.

"దీనికి oil bath ఇవ్వాలి. అదేదే ఇప్పుడే ఈ ఏడ్పుతోనే చేస్తే మంచిది. ఆ తరువాత పాపని మీకిస్తాను," అని వదిన అనగానే సరేనని మావారు అక్కడనుంచి నిష్క్రమించారు.

నా మనసులో నానావిధమైన ఆలోచనలు లేచాయి: "వదినా, మీరుకాబట్టి ఏమీ అనకుండా ఉన్నారు, మరెవరు ఇలా ఉంటారు?" అని మాత్రం అన్నాను. నాకు తెలుసు వదిన మనసు: ఆమెలో ఉన్న పెద్దమనిషితనం, లోలోపల ఆమె పడుతున్నబాధ నేను గుర్తుచేసుకున్నాను. ఒక ఆడదానికి ఇదికూడా తోచదా? తల్లి అన్నతరువాత మరెలాగ ఉంటుంది?

ఈ ఆలోచనతో నేను అల్లాడుతున్నా నా మనసుని వశంలో ఉంచుకొని వదినతో సాయపడి బాలాకి oil bath ఇవ్వడమైంది. సాయంకాలం మావారి అన్నయ్య వచ్చారు. అతనికి నేనే ఆ ఘటనగురించి వివరంగా చెప్పేసాను.

అతను బాలానీ, మావారినీ మళ్ళీ మళ్ళీ చూసారు. "పాపం, వాడికి మనసులో ఏదో ఆరాటం. ఏదో బాధ పడినట్టుంది . . . మన బాలాకూడా అల్లరి చేసే పిల్లే!" అన్నారు.

వదిన ఏం చెప్పదలచుకుందో అది నేను చెప్పేసాను:

"పాపం! అదేం అల్లరి చెయ్యలేదు. ఇతను న్యూస్ వింటున్నారట . . . బాలా ఏదో అడిగిందట; ఇతను వెంటనే . . . "

నేను పూర్తిగా చెప్పడానికిముందే మావారు జోక్యం చేసుకున్నారు: "అవును. ఏ ఆలోచనా లేదు. న్యూస్ వింటుంటే పాప ఏదో అడిగింది. ఆ సమయం నా చెయ్యాగలేదు . . . పాపం, పెద్ద దెబ్బగా పడిపోయింది."

అతను తన తప్పుని ఒప్పుకోడం నాకు ఇష్టమే. కాని 'ఏ ఆలోచనా లేదు' అని ఎందుకనాలి? నిరుద్యోగి తను ఉత్తికే కాలక్షేపం చేస్తున్నట్టు చెప్పుకోవాలా ఏమిటి? అతనూ దానిగురించి మనసులో బాధ పడుతున్నారుకదా?

కాని అతని నిష్కపట మాటలూ, క్రుంగిన మనసుతో అతను పలికిన విధం పాపలకే నచ్చుతుందేమో? కొంచెం దూరంలో నిలబడివున్న బాలా మావారిని చూసి మెల్లగా 'చిన్నాన్నా' అని పిలిచింది.

"రా . . . రా, ఇలాగ రా!" అని మావారు దాన్ని పిలిచారు. నవ్వుతూ, ఓరకంటి చూపుతో బాలా అతనిపక్కవచ్చి నిలబడి, తటాలున అతని ఒడిలో చొచ్చుకుంది!

మా అందరినీ ఏదో ఒక పెద్ద సింహాసనంలో కూర్చోబెట్టినట్టు అనిపించింది దాని చర్య.

నిజంగానే ఆ తరువాత మా అంతస్తు పెరిగింది. మేమూ ముందులాగే ఇల్లూ వాకిలుతో హాయిగా కాపురం సాగించడం ఆరంభించాం. మేమే కన్న సంతానం అని చెప్పుకోడానికి మాకొక పాప లేకపోయినా దానిగురించి మేం ఎక్కువగా బాధపడలేదు; బాలా మా పిల్లే కదా? ఇప్పుడు దానికొక తమ్ముడుకూడా పుట్టాడు. ఆ ఇద్దరినీ తలుచుకొని మేం ఆనందిస్తాం; ఏమైనా సరే బాలాకి మాపై ప్రేమ ఉందని గ్రహించినవెంటనే మా మనసుకి ఒదార్పు కలుగుతుంది. అది చాలదా?

కాని ఆ ఊఋట త్వరలో మాయమైంది. మా మనశ్శాంతిని చెదరగొట్టాలని ఒక వార్త వచ్చింది. నా తల్లిదండ్రులూ, నా తోడికోడలు తల్లిదండ్రులూ ఉన్న ఊరులు పక్క పక్కగా ఉన్నాయి. మా అమ్మ నా తోటికోడలున్న ఊరుకి వెళ్ళింది. అప్పుడు బాలా తన అమ్మమ్మ ఇంటిలో ఉంది. నా అమ్మ దాన్ని చూసినట్టు చెప్పగానే, ఆహా, నేను ఎలాగ ఆనందించాను! కాని, అయ్యో, అమ్మ నాకు ఏమని చెప్పింది! చేప్తూంటే తనే ఎంత బాధపడింది!

బాలా ముద్దుగా, చురుకుగా కనిపించిందట. ఐదేళ్ళ బాలికలో కనిపించే ప్రజ్ఞ, పెంకితనం, నీటు - అవన్నీ అలాగే ఉన్నాయట. కాని అమ్మ దాన్ని "నీ పిన్నీ, చిన్నాన్న ఎవరు?" అని అడగ్గానే "నేను న్యూస్ విన్నప్పుడు నన్ను కొట్టారే అతనే నా చిన్నాన్న," అని బాలా అందట. "నా కళ్ళో షీకాయి పొడి జల్లిందే, అదే నా పిన్ని" అని అందట.

"ఎవరడిగినా బాలా ఇలాగే అంటోంది," అని నా తోడికోడలు తల్లి అమ్మకి చెప్పిందట.

అమ్మ తన బాధ్యత అనే రీతిలో నాకు తనకి తెలిసిన బోధన, ఆక్షేపణ, విమర్శన అన్నీ చేసింది; కాని నేను దుఃఖం భరింపలేకపోయాను.

ఆహా, బాలా ఏదీ మరిచిపోలేదు. పినతండ్రి కొట్టిన దెబ్బ మరిచిపోలేదు! "అమ్మలూ, నీ కళ్లో షీకాయిపొడి పడిందా?" అని నేను మాటిమాటికి అడిగిన ప్రశ్న మరిచిపోలేదు!

అంటే, పాప మనసులో మా ఇద్దరిగురించి ఇటువంటి నీచమైన తలంపు ఉందన్నమాట! 'అది మమ్మల్ని పూర్తిగా మరిచిపోయివుంటే ఎంత బాగున్ను!' అని నేను బాధపడ్డాను.

మావారితో చెప్పాను; బాలా ఎందుకు మమ్మల్ని మరిచిపోలేదని వివరించి చెప్పాను. అతనూ బాధపడ్డారు. కాని అది కొన్నిరోజులకే. నాది ఆడ జన్మకదా? నిత్యమూ ఏదో ఆలోచనా, కల్పనా, మనోవ్యధా నన్ను పీడిస్తూనేవుంది.

'ఆహా, మనకే పిల్లలనివుంటే ఈ ప్రేమ, అనురాగాలన్నిటికీ ఒక గౌరవం ఉంటుందికదా?" అనే ఆలోచన తట్టింది. దానికి పరిష్కారం ఏమిటో నేను ఊహించుకున్నాను.

నా మనసు పడుతున్న కలవరంలో గభీమని నాకొక కోరిక తోచింది. బాలా ప్రస్తుతం తన తల్లిదండ్రులతో ఉందని తెలియగానే, నా కోరిక తీర్చుకోడానికి ఇదే మంచి సమయం అని గుర్తు చేసుకున్నాను; మేమిద్దరం మా మరిదిగారింటికి వెళ్ళాం.

బాలాకి ఇప్పుడు మా ఇద్దరిమీదా ఉన్న ఎడబాటుని తొలగించి యధారీతిగా దాని మనసులో ప్రేమానురాగాలు వికసింపచేయాలని మా వాంఛ. బాలాకి లోబరచుకునే వయసు ఇంకా రాలేదు; దాని మనసు పక్వమవడానికి ఇంకా కాలమౌతుంది; విరక్తిని తోసిపుచ్చి ప్రేమని పెంచడం ఏం పెద్ద పని కాదనే ధైర్యంతోనే మేం వెళ్ళాం.

ఇంటి వాకిలిలో కనిపించిన బాలా మమ్మల్ని చూడగానే ఒక గెంతు గెంతి, "ఇదిగో వచ్చారు - పిన్నీ, చిన్నాన్న!" అని అంటూ పరుగెత్తుకొని రావడం చూసి 'ఆహా, ఈ అమ్మాయికి మనమీద ఎంత ప్రేమ!' అని నా మనసు పులకరించింది. గభీమని ఆ పాత ఘటన జ్ఞాపకం వచ్చింది; అది రెండు సంవత్సరాలముందు జరిగిన సంగతి, బాలా అది మరిచిపోలేదు. అవును. మనసులో ప్రేమవుంటే మరిచి పోవచ్చు, కాని పగ వుంటే ఎలాగ?

కాని నా మనసుని దృఢపరచుకున్నాను. నేను బాలాని వెతుకుతూ రావడం ఎందుకు? దాని మనసులో ప్రేమని పురిగొల్పాలని, పగని నివారించాలనేకదా?

నా తృప్తి తీరినంతవరకూ బాలాతో ముద్దుగా అన్ని ఆటలూ ఆడాను. అది పదే పదే మా చుట్టూ తిరగడం చూసిన తరువాత నాకు నా ప్రయత్నంలో తప్పక విజయం కలుగుతుంది అనే నమ్మకం వచ్చింది.

భోజనం తరువాత మేమందరం హాలులో కలిసివున్నాం. బాలా మావారి వీపుని ఆనుకొని నిలబడివుంది. నా ఒడిలో బిడ్డ. మావారికి శిశువులని తాకడమంటే ఏమీ తెలియదు. వదిన, మరిది కలిసి మేం ఆరుగురు ఉన్నాం. ఎదుట ఒక ఫోటో కనిపించింది; నాకు మంచి అవకాశం దొరికింది.

ఆ ఫోటో చూపించి "ఇది ఎవరు?"అని బాలాని అడిగాను. దాని మనసులో ఏముందో చెప్తుందేమో? 'పిన్ని', 'చిన్నాన్న' అని మామూలుగా మా ఇద్దరినీ వర్ణించకుండా "ఇది నన్ను వాయించిన చిన్నాన్న", "అది నా కళ్ళలో షికాయిపొడి జల్లిన పిన్ని," అని అంటుందేమో అని?

బాలా ఫోటోను చూసింది: "ఇదిగో, ఇది నాకు రైలుబండి ఇచ్చిన చిన్నాన్న; ఇది పట్టు చొక్కా ఇచ్చిన పిన్ని!" అని అంది; అది విని మేమిద్దరం నిర్ఘాంతపోయాం.

"అబ్బోయ్! ఏమే, వాళ్ళు ఇంతకుముందు ఇచ్చినవేవో చెప్తున్నావ్! నిన్న నీకు ఇచ్చిన చిన్న కారు, లోలక్కు - గురించి ఏమీ అనవేం?" అని మరిది అడిగారు.

నాకేం బోధపడలేదు. ఇప్పుడు మేం కొనితెచ్చిన బహుమతులగురించి బాలా ఏమైనా చెప్తే దాని మనసు మారిందని మేం ఆశించవచ్చు. కాని . . .

'అమ్మ నాకు సరిగ్గా చెప్పలేదా? అంత పెద్ద అపార్థమా?' అని నేను నన్నే అడుక్కున్నాను. అదొక ప్రశ్నగా కనిపించినా నాకొక పెద్ద భారం తగ్గింది; నేను విన్నది శుభవార్తే కదా?

మేం తిరుగు ప్రయాణంకి బయలుదేరాం. రైలు స్టేషన్ కి రావడానికి వదినకి కుదరలేదు; బాలా, మరిది వచ్చారు.

చిన్నాన్న వాయించినది, పిన్ని కళ్ళలో షీకాయి జల్లినదీ బాలా మరిచిపోయిందా? దాన్నే అడుగుతే? మళ్ళీ జ్ఞాపకం వస్తుందేమో? ఆ భయంవలన నేను స్టేషన్ లో మరిదినే అడిగాను. ఆ సమయంలో బాలా మావారి భుజంమీద తల ఆనుకొని చుట్టుపక్కలని చూస్తోంది.

"మరిచిపోయిందే? మీకింకా గుర్తుందన్నమాట!" అని అంటూ అతను నవ్వారు.

నేనందుకు అడిగానని కారణం చెప్పి నవ్వుతూనే నా మనసులో ఏముందో అతనికి తెలియజేసాను.

"ఓ, అదా? అవును . . . అక్కడ బాలా అలాగే చెప్పింది కాబోలు . . . కాని ఇక్కడకి వచ్చిన తరువాత అవాళ చెప్పినట్టే చెప్తోంది . . . " అన్నారు అతను.

"అదెలాగ? . . . వినడానికి వింతగా ఉందే?"

"అవును . . . ఇప్పుడు వింతగానే అనిపిస్తుంది . . . అప్పుడేమో . . ." అతను గొంతు తగ్గించుకొని నాకు అసలు విషయమేమిటో చెప్పారు.

"అమ్మమ్మ దగ్గర ఉంటే అలాగే చెప్పివుంటుంది . . . "

"అలాగా? ఏం, ఎందుకు?"

అతని బవాబు విని నేను ఉలికిపడ్డాను.

వదిన తన తల్లిదగ్గర తన కష్టపాటులు చెప్పుకున్నట్టుంది. అది బాలా అమ్మమ్మ మరిచిపోలేదు. మనవరాలని పక్కన పెట్టుకొని ముద్దులాడిన్నప్పుడెల్లా ఆవిడ బాలా పిన్ని, చిన్నాన్నల గురించి అడుగుతూ ప్రశ్నలతోబాటు జవాబులుకూడా అమ్మాయికి నేర్పించారుకాబోలు! శెలవులతరువాత బాలాని ఊరుకి తీసుకురావాలని మరిది వెళ్ళినప్పుడు బాలా అంటున్న మాటలు విని అతనికి ఆశ్చర్యం, అసహ్యం కలిగాయి. కాని కొంచెం ఆగి, బాలా మొహం పరిశీలించిన తరువాత అతను నిజమేమిటని ఊహించారట: ఆమెలో రవంతైనా పగ, కోపం లేదు; కళ్ళలో అభిమానం, నవ్వులో ఉత్సాసం చోటుచేసుకున్నాయి. అసలు సంగతి అతనికి అర్థమైంది. కూతురు 'రక్షణ' తరువాత ఇంటికి రాగానే అతను దానికి మా గురించి కొత్త పాఠం నేర్పించడం మొదలుబెట్టారు. ఇప్పుడు బాలా మాట్లాడడం మారిపోయింది. కాని ఆమె పలికే విధం, బుగ్గల్లో కనిపించే ఎర్రదనం, కళ్ళలో కనిపించే కాంతి - ఇవేం మారనేలేదని అతను గ్రహించారు.

అవును. అతనన్నది నిజం. పాపకి ఏం తెలుసు? అది ప్రేమానురాగాలతో నిండిన మనసు; ఎవరు ఎది చెప్పినా దాన్ని తిరిగిచెప్పే లేత మనసు, తెల్ల మనసు.


నా మరిదిగారి ఊహ, అతను బాలా మనసుని అర్థంచేసుకున్నరీతి తెలిసిన తరువాత నేను ఏమీ అనలేక ఉండలేక పోయాను. "మీరేమో మేం ఇచ్చిన రైలు బండి, బొమ్మల గురించి బాలాకి గుర్తు చేస్తూనే ఉంటారు. కాని అమ్మమ్మ చూపే ప్రేమకి ఇవేం సాటి అని దానికి తెలియదే?" అని వాదించాను. కాని అతను నాతో ఏకీభవించలేదు.

రైలుబండిలో తిరుగు ప్రయాణం చేసినప్పుడు నా మనసులో ఎటువంటి కల్పనకీ చోటులేదు. నా కడుపులో పుట్టి నేలమీద వాలి ఏడ్చే శిశువుగురించి నా మనసులో

ఎటువంటి ఆలోచనా లేదు. ఆ రోజు ఆయన దెబ్బతో బాలా బిగ్గరగా ఏడవడం, ఇప్పుడు మా ఎడబాటువలన ఆమె బిగ్గరగా ఏడవడం - ఈ దృశ్యాలే మళ్ళీ మళ్ళీ నా మనసులో కనిపించాయి. పాప మనసుని అనుమానించి నేను పడిన బాధని గుర్తుచేసుకుంటే నాకూ సిగ్గుతో బిగ్గరగా ఏడవాలనిపిస్తోంది!

********

**(మూలం ప్రచురణ కలైమగళ్, ఆగస్టు, 1949)**



# అవును, రాతి మనసే!

# అవును, రాతి మనసే!

ఎదురింటినుంచి తను అప్పిచ్చిన ఆ రూపాయి అడిగి తీసుకోవాలని రాధై నిశ్చయించింది. నాలుగు రోజులు కూరగాయలకి అది పనికివస్తుందే! నెలాఖరిలో తనకి అటువంటి ఆశ కలిగితే తప్పా? వీధిలో కూరగాయలు అమ్మే సమయం వచ్చేసింది; ఇవాళ ఒకణాకి బచ్చలికూర కొంటే చాలు . . .

హక్కుతో డబ్బు అడగడానికి రాధైకు మొహమాటం. ఎదురింటి అమ్మాయిని పిలిచి "నాకు చిల్లర కావాలి" అని వార్త పంపించింది. ఆ పిల్ల అమాయకంగా "రాధై మామీకి డబ్బు కావాలట!" అని బాహటంగా అన్న కేక వినగానే రాధైకి పట్టరాని కోపం వచ్చింది. ఆ ఇంటినుంచి ఒక పిల్లవాడు వచ్చి రాధైకి ఎనిమిది అణాలు అందించాడు.

వచ్చిన పిల్లవాడిని ముద్దాడి వాడి చెయిలో ఏదైనా మిఠాయి ఇచ్చి పంపాలనే ఉత్సాహం రాధైకి లేదు. ఇది నెలాఖరి. 'అందరూ లేనిదేదో సర్దుకొని బతుకుతున్నారు,' అని ఊహించుకొని నవ్వేసినా రాధై మనసులో చికాకే చోటుచేసుకుంది. తనూ, భర్త - ఇద్దరే ఉన్న ఆ చిన్న కుటుంబంలో డబ్బు గురించి పెనుగులాటకి  ఏమైనా న్యాయముందా? కాని, ప్రతీనెలా ఆ అన్యాయమే జరుగుతోంది! కాపురం ఆరంభించిన రోజుల్లోనే అప్పులంటే ఇక సాగేదెలాగ? ఎదురింటి యజమానుడుకి నెలకి జీతం వెయ్యి రూపాయలు, కాని వాళ్ళ సంసారం పెద్దది! రాధై ఇంటిలోనూ అదే సంపద, ధోరణి చోటుచేసుకున్నాయి. రాబడి మాటకొస్తే రెండు కుటుంబాలమధ్య పెద్ద భేదం ఉంది, కాని . . .

ఆలోచనలో పడిపోయిన రాధై సందడి విని తిరిగిచూసింది. సైకిలునుంచి బుట్టని తీసి ఆమె పక్కన పెట్టాడు కిట్టు!

"షాప్పింగ్ ఐపోయిందా?" అని అడుగుతూ రాధై తల తిప్పి బుట్టలో ఏముందో చూసింది: అప్పడాలు; ఇంగువ; కాఫీ గింజలు; దశాంగ ధూపం. మద్రాసు వదలి ఉత్తరదేశం వెళ్ళిన తమిళులు మద్రాసుతో సంపర్కం నిలుపుకోడానికి ఉపయోగించే వస్తువులు . . .

"మీదగ్గర డబ్బు ఉందన్నమాట! లేకపోతే అప్పా?" అని రాధై అడిగింది.

"కాపీగింజలకి మాత్రం డబ్బివ్వలేదు. తక్కినవన్నిటికీ రొక్కమే! ఇవాళ ఆ పళ్ళ డాక్టరునుంచి నాలుగు రూపాయలు గుంజేసాను!" అని హుషారుగా అంటూ కిట్టు ఇంటిలోకివచ్చి దుస్తులు మార్చుకున్నాడు.

"ఓహో, ఆ దండయాత్ర మీరు ఇంకా వదల్లేదన్న మాట! అదేదో దొరికితే సెలాఖరితో మనకి మంచిదే!" అని తనలో గొణుక్కుంటూ రాధై సరకులని ఇంటిలోకి తీసుకొని వెళ్ళింది. మరే ఏ మార్గంలోనూ మామగారి ఆర్ధిక సాయం రాకపోయినా అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు ఇదొక మంచి ఉపకారం అని రాజం గుర్తుచేసుకుంది; వెంటనే కృతజ్ఞతతో ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

సందెచీకటి రాగానే రాధై దీపం వెలిగించి కుంపటిలో కొంచెం కట్టెనిప్పులు వేసి దశాంగ ధూపం  జల్లింది. సుగంధమైన పొగ లేచి పూజ గదిలోని దేవుళ్ళ పఠాలమీదకి వ్యాపించింది.

"ఇక చాలా?" అని రాధై అడిగింది.

"ఇక్కడ చాలు! తక్కిన గదుల్లోకి వెళ్ళి ధూపం వెయ్యి. ఈగలూ, దోమలూ పోవాలంటే ఈ దశాంగమే వాడాలి!"

"అది సరే . . . కాని సెలాఖరిలో వచ్చిన డబ్బుతో కొన్నదేదో నిప్పులో ఉవ్వడమంటే మనసుకి ఎలాగోవుంది!"

"అలాగని ధశాంగం నిప్పులో ఉవ్వకుండా మనం ఉండగలమా? దాన్ని తినగలమా? మరేం చెయ్యగలం? సెలాఖరిలోనూ మన బతుకు క్షేమంగావుందనే తృప్తి రాకూడదా?"

"ఇటువంటి తృప్తికోసం ఆ పళ్ళడాక్టరుతో యుద్ధం చేసారన్నమాట! పాపం!" అని ఒకలాగ సర్దుకొని రాధై, కుమ్మటిని తీసుకొనివెళ్ళి తక్కిన గదుల్లో ధూపం వేసింది. ఇంటిలో చిన్నది, పెద్దదిగా ఆరు గదులు. అద్దె తక్కువే. ఇంత మంచి ఇల్లు ఈ దంపతులకి దొరకడానికి కారణం కిట్టు తండ్రి, రాధై మామగారు. ఎదురింటి యజమానుడులాగే అతనూ మంచి ఆదాయంతో ఈ ఇంటిలో సంసారం చేసారు. అతను రిటైరనప్పుడు కిట్టుకి ఈ ఊరులోనే ఉద్యోగం దొరికింది, ఈ ఇల్లూ లభించింది.

విశాలమైన ఇల్లుతోబాటు మేజా, కుర్చీలు, తక్కిన సామానులు కూడా ఆ తండ్రి తన అబ్బాయికే ఇచ్చేసారు. అందుకోసం అతనిమీద ఈ దంపతులకి కృతజ్ఞత ఉంది.

"మన ఇంటిలో సామానులు మరీ ఎక్కువగా పెరిగిపోయాయి . . . ఈగలూ, దోమలూ పోవాలంటే దశాంగం ఎక్కువగానే వాడాలి!" అని తనలో చెప్పుకుంటూ రాధై హాలుకి వచ్చింది. అప్పుడే కిట్టు ఏటవాలైన కుర్చీలో బాగా వాలి కాళ్ళు బాగా సడలించుకున్నాడు.

కొంచెం సమయం నిదానించి మనసులో తోచిన ప్రశ్న గుర్తు చేసుకొని రాధై మాట్లాడింది. "ఇక ఎన్ని సంవత్సరాలు మీరు ఆ పళ్ళడాక్టరుతో జగడమాడాలని పూనుకున్నారు? ఇంతవరకూ, ఈ రెండు సంవత్సరాలలో, అతను యాభై రూపాయలు ఇచ్చివుంటాడా?"

"హూం."

"మీరు తరచుగా అక్కడికి వెళ్తున్నారన్న మాట?"

"ఆఫీసునుంచి వచ్చే దారిలోనే ఉంది వాడి ఇల్లు. అందువలనే నాకు వాడితో దెబ్బలాట అలవాటైపోయింది."

"మీరు దెబ్బలాడతారంటే నాకు ఆశ్చర్యంగా ఉంది . . . "

"దెబ్బలాట అంటే రెండు మూడు అరుపులు, అంతే! మరేంకాదు! 'అడగడానికి నాకు హక్కు ఉంది' అని వాడికి తెలియజేయాలని . . . "

"హక్కులకోసం మనం పోరాడినా ఆఖరికి మనం గోలచేస్తున్నామని అందరూ నింద మోపుతారు. అవునా?"

"హూం."

"గత సంవత్సరం మనం ఊరుకు వెళ్ళినప్పుడు మీ అమ్మగారు ఏమన్నారో తెలుసా? 'కిట్టుకి బుద్ధిచాతుర్యం లేదు; మొత్తంగా ఒక బీరువా, రెండు మూడు కుర్చీలు జప్తుచేసుకొని రావాలని వాడికి తెలియలేదే?' అని అన్నారు."

"బాగుంది! అదెలా సాధ్యం?" అన్నాడు కిట్టు.

“నాకూ అమ్మ[1] అన్నది వింతగానే అనిపించింది. నాన్నగారూ బుద్ధిచాతుర్యం లేకుండా పళ్ళడాక్టరుకి మూడువందలు ఇచ్చేసారు; దానిగురించి అమ్మ ఏమీ అనలేదు! మీకేమో అప్పుకి తగినట్టుగా ఏ సామానూ లాక్కోనే సామర్థ్యం లేదని అమ్మ ఉద్దేశం!”

కిట్టు మరేం అనక ఊరుకున్నాడు, కాని అతని మొహం ఏదోలాగ కనిపించింది. అది భరించలేక రాధై మాటాడింది: “‘నెలకి ఐదు రూపాయలైనా సరే, వసూలు చేసితీరాలని నాన్నగారు చెప్పేసారు. అందుకోసమే మీరు ఆ పళ్ళడాక్టరు దగ్గర నెలనెలా యుద్ధంకి రెడీ అవుతున్నారు’ అని నేను అమ్మకి చెప్పాను. ‘ఎందుకలా బతిమాలాడాలి, ఓ రెండు సరుకులు జప్తుచేసుకొనివస్తే మంచిదేకదా?’ అని అమ్మకి తోచిందేమో?”

“మనం మరేం చెయ్యగలం? అప్పులకాపైనా వాడికి పౌరుషం ఉంది; నేను గోలపెట్టేది దాన్ని అణచాలనే! పాపం, వాడూ రెండో, మూడో అని ఏదో ఇస్తున్నాడు . . . వాడికి వ్యాపారంలో గొప్పగా రాబడి లేదే? . . . అమెరికాలో పెద్ద చదువు చదివాడు, ఆ జబర్దస్తు వదలిపెట్టడానికి వాడికి ఇష్టం లేదు . . . ఇక్కడ మన ప్రజలు ఎప్పుడూ తమలపాకు నములుతూ రోజులు గడుపుతున్నారు. పళ్ళగురించి వాళ్ళకి ఏ ఆలోచనా లేదే! మరి రాబడి ఎలా వస్తుంది చెప్పు?”

భర్తతో ఏకీభవించి ‘అవును’ అని రాధై తలూపింది. కాని ఆమె మనసులో ఒక ప్రశ్న లేచింది: ‘నా భర్తకి సామర్థ్యం లేదని ఎందుకు నా అత్తగారు అన్నారు? అవును, ఎందుకు అనరు?’

‘అవును, అబ్బాయి బోళాతనం చూసే ఆవిడ అలాగ అన్నారు - ఇందులో ఆశ్చర్యమేముంది?’

కిట్టు ఈ ఊరులో ఉద్యోగంలో చేరిన కొన్ని మాసాల తరువాతనే అతని తల్లిదండ్రులు తమ సొంత ఊరుకి వెళ్ళారు. ఆ మాసాలలో తన జీతమంతా కిట్టు తన తల్లిదండ్రులకే ఇచ్చేసాడు. అది న్యాయమే కావచ్చు, కాని ఒక రోజైనా తన భార్యతో ఎక్కడకైనా వెళ్ళాలని కిట్టుకి తోచనేలేదు, అతను ప్రయత్నించనూలేదు. ‘ఇదిగో, ఒక రూపాయి!’ అని రాధైకి ఏదీ ఇవ్వనేలేదు. మరి ఆ ఇంటిలో స్నాన గదిలో ఇద్దరికీ వేరే వేరే

---

[1] ఇక్కడ రాధై చనువు చేసుకొని తన అత్తమామల్ని అమ్మా, నాన్నా అని అంటోంది

సబ్బులున్నాయే - రాధై తన సబ్బు ఎలా కొనుక్కుంది? ఆమెకని కొంత డబ్బు - అమ్మా, నాన్నా ఇచ్చినది - ఉంది కాబోలు. లేకపోతే రాధై భర్త దగ్గర "నాకు సబ్బు కావాలి!" అని అడిగివుంటుంది. ఇలాగే సాగింది వాళ్ల సంసారం. ఈ అనుభవాలకి రాధై ప్రతిస్పందన ఎలా వర్ణించడం  - అలకువ లేక అవమానం? "అంతా మంచికే!" అనుకుందాం.

కాని కిట్టు తల్లి మనసులో తన అబ్బాయికి గడుసుతనం లేదనే ఆలోచన రావడానికి అదే కారణం! కాని తన కొడుక్కి తెలియని ఆ సమర్ధత అతనికి నేర్పించాలని ఆ తల్లి పూనుకోలేదు. 'అది కోడలు బాధ్యత' అనే ఆవిడ ఉద్దేశం కాబోలు! ఆ కోడలుకీ ఆ సమర్ధత లేదని ఆవిడకి తెలుసు - ఐతే - బాగుంది, అందువలన అది తనే నేర్పాలా ఏమిటి?

కిట్టు తండ్రి పెద్ద దూపరదిండి; ఎంత డబ్బైనా ఖర్చు చేసే మనిషి. దానమూ, అప్పులూ అతనికి బాగా అలవాటైపోయాయి. "నా ధనం అందరికీ సొంతం, ఎవరైనా సరే తీసుకోవచ్చు!" అనే ధోరణి. కాని "ఇదిగో!" అని ఒక ముక్కుపుడకకూడా అతను కోడళ్ళకి ఇవ్వలేదు. 'కావాలంటే వాళ్ళే తీసుకోనీ!' అని అతని ఉద్దేశం కాబోలు! మెల్లమెల్లగా కిట్టు డబ్బు తరిగిపోయింది. రాధై, కిట్టు కాపురం ఆరంభించినప్పుడు వాళ్ళచేతిలో ఉన్నదంతా ఒక నేల జీతం, అంతే! అదీ, ఒక నెల తరువాత insurance premium  గా మారిపోయింది! ఆ రోజునుంచి ఈ రోజువరకూ నెలా ఈ సంసారంలో ఆదాయంకి మించిన ఖర్చులే!

రాధై మనసులో ఈ ఆలోచనలు రేగతుంటే కిట్టు ఆమెను వినోదంగా చూస్తూ "సరే, ఇక భోంచేద్దామా?" అని అడిగాడు.

రాధై గభీమని లేచింది. "అవును, మీకు గడుసుతనం లేదని నేనూ అంటాను. నాన్నగారి అప్పు వసూలుచెయ్యడానికి మీకు హక్కు ఉందంటున్నారు. కాని మీ జీతంలో నాకు నెలా ఐదు రూపాయలు ఇవ్వడానికి మీకు హక్కు ఉందని అనిపించలేదే? నేను నా హక్కుని ఎలా నిలబెట్టుకోవాలని తెలియక తికమకలు పడుతున్నానే? చిల్లర కావాలని - అది నాలుగైదు రూపాయలే ఐనా - మీకు పళ్ళడాక్టరుని అడిగి తీసుకోవాలని నిర్బంధం వచ్చిందే? కొంచెం ఆలోచించి చూడండి!"

అని బాహటంగా తన విసుగు తెలియజేసి నిష్క్రమించింది. ఆమెకి బదులు చెప్పడానికి కిట్టుకి త్రాణ లేదు. తను కొన్నిరోజులుగా గ్రహించినదే రాధై ఇప్పుడు చెప్తోంది; చాలా ప్రశ్నలు ఒకేసారి అడిగేసింది, అదే ఆశ్చర్యం! ఆ ప్రశ్నలలోవుండే ఆవేశం కిట్టుకి ముందే తెలుసుగా?

** ** **

రెండు రోజులతరువాత కిట్టు "ఇవాళ పళ్ళడాక్టరునుంచి పెద్ద రొక్కం వసూలు చెయ్యబోతున్నాను," అని రాధైతో అన్నాడు.

"మేజా? . . . బీరువా?"

"అవేం కాదు. మనిద్దరం పళ్ళు శుభ్రం చేసుకుందాం. వాడు అమెరికానుంచి వచ్చినవాడుకదా, కొంచెం ఫీజు ఎక్కువగానే ఉంటుంది. వాడికి మన వలన రూపాయల్లో నష్టం వస్తుంది!"

"అంటే, మనకి రాబడి లేదన్నమాట!"

"ఐతేనేం? ఏడాదికొకసారి పళ్ళు శుభ్రం చేసుకుంటే మనకి మంచిదేకదా?"

"మూడువందల రూపాయల అప్పు బాకీ తఱగాలంటే మనం ఎన్ని సంవత్సరాలు వెళ్ళిరావాలి - ఆరు లేక ఎనిమిదా?" అని హాస్యంగా అడిగిన రాధై భర్త మొహం చూడగానే నవ్వు చూపి, ఆపేసింది. ఆ తరువాత "అసలు పళ్ళు ఎలా శుభ్రం చేస్తారు? నొప్పి ఉండదా?" అని మళ్ళించింది.

"మనం కొంచెం నొప్పి భరించాలి."

"మనమీద కోపం లేదుకదా, డాక్టరుకి?"

"ఎందుకు కోపం? నీకెందుకు భయం?"

"ఉత్తికే అడిగాను; కోపంతో మన పళ్ళలో విషం ఎక్కించి 'ఇది ఒక septic case!' అని అతను తప్పించుకోవచ్చుకదా?" అని రాధై నవ్వింది.

కిట్టు ఏమీ అనలేదు; కాని అతని మొహంలో అలుకువ తేటగా కనిపించింది.

రాధై పళ్ళడాక్టరుని వెళ్ళి చూసింది. అతన్ని చూస్తే అప్పులకాపులాగ కనిపించలేదు. 'ఇతనికి అప్పులా?' అనే అనుమానంతోబాటు అతనిమీద రాధైకి మర్యాదకూడా కలిగింది. అతని భార్యని చూడాలని రాధై కోరింది, చూసింది. ఆవిడ ఒక దుర్బలమైన రోగిలాగ కనిపించారు. 'బాకీదారు భార్య ఇలాగే ఉంటుంది కాబోలు!' అని

ఆవిడని చూడగానే రాధైకి సానుభూతి కలిగింది. కాని త్వరలో అది అసంతృప్తిగా మారింది. "మీ ఊరు చీర చాలా బాగుందే! చౌక కూడాను. నాకొకటి కొనిపెడతావా?" అని అవిడ పొగడినప్పుడు "ఓ, తప్పకుండా!" అని రాధై మనసులో చిరచిరలాడింది. డాక్టరుగారి పిల్లలు పుష్టిగా, శ్రేయంగా కనిపించారు. ఇంటినిండా నొగసైన వస్తువులు; కళ్ళకి విందుగా ఒక పెద్ద హాలు; భోజనం చేసేడప్పుడు వాడిన మేజా, కుర్చీలు కలపతో -నల్లతుమ్మతో - చేసినవి. విలువైన పింగాణి సరుకులు; పువ్వులకోసం రకరకాల పాత్రలు; గోడలమీద చట్టంకట్టిన పఠాలు.

ఇంటికి తిరిగివచ్చేటప్పుడు రాధై భర్తతో "అప్పుకి బదులు అతను మనకి మేజా, కుర్చీ ఏదైనా ఇవ్వవచ్చుకదా? మనసులో ఉన్నది మనకి చెప్పడానికి అతను వెనుకాడుతున్నారేమో?" అని అడిగింది.

"ఇవన్నీ పనికరాని మాటలు!" అని కిట్టు తోసిపారేసాడు.

ఆ రోజు ఒక పళ్ళ వరుస శుభ్రం చెయ్యడమైంది. మరోక వరుస శుభ్రం చేసుకోవాలని దంపతులు మళ్ళీ వెళ్ళారు. డాక్టరు కిట్టుని ఆదరించేటప్పుడు దాధై మళ్ళీ డాక్టరుగారి భార్యని కలుసుకొని మాటాడింది; అక్కడున్న కొన్ని ఫోటోలు చూసింది.

"నా అత్తమామలు," అని రెండు ఫోటోలు ఆవిడ పరిచయం చేసారు.

"ఇప్పుడు ఎక్కడున్నారు?"

"స్వర్గస్థులైపోయారు!"

"గతించారు", "పోయారు" అని అనకుండా ఎంత చక్కగా, మర్యాదగా ఆవిడ చెప్తోంది అని ఆలోచిస్తూ రాధై తక్కిన ఫోటోలు చూసింది. కాని డాక్టరు భార్య వాటిని వర్ణించడానికి బదులు "మా ఆయన విదేశాల్లో ఉన్నప్పుడే మా అత్తగారు పోయారు; తిరిగివచ్చిన మరుసటి సంవత్సరం మా మామగారూ పోయారు. వయసు మళ్ళిన కాలంలో అబ్బాయిని అంత డబ్బు ఖర్చుపెట్టి పెద్ద చదువుకి అమెరికా పంపించడం అంత ముఖ్యమా? కాని మామగారికి చదివించాలని ఆకాంక్ష, అందువలన డబ్బుగురించి అతను లక్ష్యం చెయ్యలేదు. కాని మా అత్తగారు చాలా బాధపడ్డారు" అని వివరించింది.

'నా భర్త విదేశంలో చదివి డిగ్రీ సంపాదించుకున్నారు!' అనే ఘనత ఆ మాటల ధ్వనిలో లేదు. 'అతను విదేశం వెళ్ళకుండా ఉంటే బాగున్ను!' అనే శోకమే రాధై గ్రహించింది.

ఇంటికి తిరిగివచ్చినప్పుడు రాధై భర్తని అడిగింది: "అతనేం తాగుబోతా?ఎందుకలా అప్పులు పెరిగిపోయాయి? క్షేమంగా ఉండవలసిన కుటుంబం కాదా?"

"అలాగేం కాదు. అమెరికాలో చదువుకి చాలా ఖర్చయివుంటుంది. అది భర్తీచెయ్యడానికికూడా ఆదాయం రాలేదనుకుంటాను. చదువుకి తగినట్టుగా హోదా, ఇల్లూ, ఆడంబరం, వృత్తికి తగిన యంత్రాలు, అన్నీ తప్పకుండా కావాలి. అద్దె తగ్గే సూచనే లేదు! రోజూ రెండు పూట్లా మాంసం లేకుండా భోజనం లేదు! ఖర్చులు పెరుగుతూనేవున్నాయి. పళ్ళగురించి ఎవరికి చింత, చెప్పు! వీడికేం రాబడి లేదు!"

'అతని పళ్ళవరుసకూడా  అధ్వానంగా ఉంది!" అని గుర్తుచేసుకొని రాధై తనలో నవ్వుకుంది.

డాక్టరుతో స్నేహభావంతో మెలగాలని కిట్టు అతని మనసుకి కొంచెం శాంతి ఇవ్వాలని నిశ్చయించాడు; ఒక రెండు నెలలు అప్పు గురించి అడగడానికి డాక్టరుని కలుసుకోలేదు. రాధై కూడా నోరెత్తనేలేదు. కాని ఇంతలో ఎదురుచూడని ఒక నిర్బంధం దంపతులకి వచ్చేసింది. "నాకిది ఒక అత్యవసర పరిస్థితి; నువ్వు నాకు రెండు వందలు రూపాయలు పంపగలవా?" అని కిట్టు తండ్రి రాసారు. అతనికి నెలా వచ్చే పింఛను కిట్టు జీతంకన్న ఎక్కువే, అది అతనికి సరిపోలేదు. మరి తన మనవరాలు పెళ్ళికికూడా పూర్తిగా బాధ్యత వహించిన మనిషికదా అతను? "మేనమామలు నీకు ఏమైనా ఇస్తున్నారా, లేదే? మరి తాతగారు ఇవ్వకూడదా? హాయిగా తీసుకోవమ్మా!" అని మనవరాలికి అతని భార్య పదే పదే ప్రేరేపించింది. ఖర్చుగురించి ఆ రోజుల్లో అతను లక్ష్యం చెయ్యలేదు. ఇప్పుడు కిట్టుకి నిర్బంధం వచ్చేసింది!

ఉత్తరం చదివిన తరువాత రాధై, కిట్టు దానిగురించి మాటాడలేదు; కాని ఇద్దరూ దానిగురించే ఆలోచిస్తూనేవున్నారు.

మరుసటిరోజు రాధై భర్తని "మీరేం చెయ్యబోతున్నారు?" అని అడిగింది.

"నాకూ ఏంచెయ్యాలో తెలీదు. 150 రూపాయలైనా పంపాలి, అప్పు చేసి తీరాలి."

"మనం అప్పు తీర్చగలమా?"

"సమయానికి రావలసిన డబ్బు రాకుండా నాన్నగారు ఇబ్బంది పడుతున్నారు. అతను అడిగినప్పుడు మనం పంపించకుంటే ఎలాగ?"

"మరీ అంత గండం అంటే అతను అక్కడే జమచెయ్యవచ్చుకదా, మనకెందుకు రాయాలి?"

"అదేం మాట?అతనికి చేతకాదంటున్నావా?"

తన తండ్రి ఆస్తి ఒక అక్షయపాత్ర అనే నమ్మకం తన భర్తకివుందని గ్రహించి రాధై బాధపడింది. కాని అది ఊరటగానూ అనిపించింది. కిట్టు మనసులో కపటం లేదని ఇప్పుడు బాగా తెలిసిపోయిందికదా?

"నాన్నగారి ఉత్తరం చూపిస్తే పళ్ళడాక్టరు ఏమైనా ఇవ్వవచ్చు."

"నాకలా తోచలేదు."

"నాకూ తోచలేదు. ఇప్పుడే గభీమని ఆ ఆలోచన వచ్చింది."

"ఇప్పుడూ నాకు అదే ఆలోచన; వాడివ్వడు."

"చుట్టరికంలేనివారందరికీ మీ నాన్నగారి ఆస్తి సొంతం, బంధువులకి ఆ హక్కు లేదు, అవునా? 'ఇక్కడనుంచి వెళ్ళినప్పుడు నాన్నగారు మనకి ఇంటిలోని మేజా, కుర్చీలు వదిలేసారు' అని మనకి గొప్పగా ఉంది. రెండువందలేకదా? సరకులని అమ్మేసి డబ్బు పంపించేయండి."

"ఎందుకు అమ్మాలి? నాన్నగారిచ్చినది వాడడానికి నాకు హక్కు ఉంది."

"'ఏదైనా కొని పంపించండి అని మనం మీ నాన్నగారిని అడుగదాం' అని నేను అంటే మీరు వెంటనే 'అతన్నెందుకు మనం అడగాలి? అతనెందుకు మనకి పంపాలి? అతని దయ లేకుండా మనం బతుకుతే చాలదా?' అనే అర్థంలో భర్త జవాబుని రాధై ఎదురుచూసింది. కాని కిట్టు తల వంచి చేతులతో కళ్ళద్దాలు శుభ్రం చెయ్యడం చూసేటప్పుడు అతని మొహంలో ఆలపించే శోకం చూసినతరువాత ఇక అతన్ని హింసించకూడదని మరేం అనక ఊరుకుంది. అప్పుచేసి తండ్రికి తన బాధ్యత నెరవేర్చాలని కిట్టు బాధపడుతున్నాడు. అది చాలదా?

** ** **

"డబ్బు పంపించారా?" అని రాధై అడిగింది.

"హూం."

"మనం అప్పుచేసాం అంటే నాన్నగారు ఇష్టపడరు."

"అదీ ఉత్తరంలో అతనికి రాసాను."

"హూం" అని అంది రాధై. ఇక మామగారు చిక్కునుంచి తప్పించుకున్నారని సంతోషించింది. కాని ఆ ఊరడింపు త్వరలోనే కరిగిపోయింది - గాలిలో అస్తమించిన కర్పూరం లాగ.

కొడుక్కి కృతజ్ఞత తెలుపుతూ ఆ తండ్రి ఒక ఉపదేశమూ చేసారు.

"నీకూ, నీ భార్యకి ఒక సలహా: మితంగా కాపురం చెయ్యండి! ఐనా, పిసినారితనం వద్దు! నా సంగతి వేరు. నా బంధువులకి - పేదలకి - నేను సాయం చెయ్యాలనే పరిస్థితి ఏర్పడింది. ఎలాగో అబ్బాయలిద్దరికీ పెద్ద చదువులు ఇచ్చి నేను నా బాధ్యత తీర్చుకున్నాను."

అదే అతను ఉత్తరంలో రాసారు.

అది చదివిన తరువాత కిట్టు ప్రతిస్పందన ఎలాగ వర్ణించడం? బైరాగిలాగ ఉపేక్ష. కాని దానికి బదులు మామగారి సందేశం రాధైని అదురుగొట్టింది; ఏడవాలనిపించింది; నవ్వాలనీపించింది. ఇతరులకి తన ఆస్తి వదిలేసి, తను అనుభవంలో ఆర్జించిన జ్ఞానం తన పుత్రుడుకి అతను అప్పగిస్తున్నారా? ఇప్పుడే అతనికి మితవ్యయం అంటే ఏమిటని తెలిసిందా? అసలు అతని బోధనకి అగత్యం లేకుండా ఈ దంపతుల కాపురం నిత్యమూ జరుగుతోందే! పిసిరితనం అనే హద్దుగుర్తులో కాలు పెట్టక, దాని ఒడ్డులో నిలబడి "మేం సుఖంగానే ఉన్నాం!" అని నిజమూ, గర్వమూ కలిసిన ధ్వనితో ఘోషించే ఘనత ఈ కాపురంలో ఉంది. ఇంతకన్న నీచమైన స్థాయికి దిగజారిపోవాలా ఏమిటి?

అసలు కాపురం అనే మాటకి వస్తే అందులో దొరతనం ఉండదా మరి? పావు లీటరు బియ్యం వండినా మూడు రాళ్ళు పేర్చిన పొయ్యే వాడాలి. మనఃపూర్వకంగా రాధై దూపరదిండితనంగా ఏ ఖర్చూ చెయ్యలేదు. కిట్టుకికూడా పౌడరు, స్నో అనే అలంకార వస్తువులమీద మోహం లేదు; కాలేజీ రోజుల్లో అవన్నీ తనివితీరా అతను అనుభవించేసాడు. ఇక సిగరెట్లు, అటువంటి చెడ్డ అలవాట్లు లేవు. వక్కపొడి అంటే

మాత్రం చాలా ఇష్టం. ఈ దంపతులు కొంచెం ఎక్కువగానే మధ్యతరహా కుటుంబాలతో మెలగడంవలన కొన్ని బట్టలు, దుస్తులు కొన్నారన్నది నిజం. ఐనా కూడా 'ఈ చీరకి జోడుగా ఈ పాదరక్ష, ఈ జాకెట్టుకి ఈ Vanity Bag బాగుంటుంది!' అనే రీతిలో రాధై ఏనాడూ ఆలోచించలేదు, దుస్తులు ధరించలేదు. కిట్టుకికూడా ఇంతకుముందు ఆడంబరం అంటే ఇష్టం. కాని 'నేనొక ఆఫీసరుగారి అబ్బాయిని!' అనే హోదా పోయినతరువాత, ఉద్యోగ అన్వేషణలో దిగినతరువాత, అతను తన స్వంత స్థితికి తగినట్టుగా మారిపోయాడు.

కాని ఒక విషయంలో కిట్టూ, రాధై - ఇద్దరికీ ఖర్చే! ప్రతీ సంవత్సరం, వేసవికాలంలో, ఈ దంపతులు బహుదూర ప్రయాణం చేస్తారు. జన్మభూమితోబాటు ఇక ముందు చూడని ప్రదేశాలు చూడాలనీ, ఆ ముచ్చటలేవో అనుభవించాలనే కాంక్ష అందరికీ సహజమేకదా? ఈ దంపతులు కాపురం ఆరంభించి మూడు నాలుగు సంవత్సరాలే అయ్యాయి; పిల్లలు ఇంకా పుట్టలేదు. అందువలనే ఆ కాంక్ష గూఢంగా వారిద్దరి మనసులో చోటుచేసుకుంది. తల్లిదండ్రులనీ, వాళ్ళ తరపు బంధువులని తరచుగా కలుసుకొని ఉల్లాసంగా కాలం గడపడమంటే మనసుకి ఎంత హాయిగా ఉంది! తల్లిదండ్రులని చూడాలని పూనుకున్న ప్రయాణంలో మరికొన్ని జాగాలూ, నగరాలూ వీళ్లు చూడడం అలవాటైపోయింది. అందుకేనా ఈ కడుపుమంట?

ఒక ఆలోచన తరువాత ఇంకొకటి లేచి రాధైని కలవరపరచింది. ఆఖరికి తటపటాయించుతూ భర్తని "నా ముప్పై రూపాయలు ఇస్తారా?" అని అడిగింది.

"ఇప్పుడు ఎందుకు?"

"నా దగ్గర ఉండనీ; కావలసినప్పుడు నాకు దొరకదు. మా అమ్మ నాకిచ్చిన డబ్బుతో ఏదైనా కొనాలి."

"సాయంకాలం ఇస్తాను!" అని కిట్టు చెప్పి వెళ్ళాడు. రాధై మనసు పేజీ, పేజీగా చినిగిపోయిన పుస్తకంలాగ అల్లాడింది. ఇంతకుముందు రాధై కొత్త కోడలుగా ఉన్నరోజుల్లో ఆమెను చూడడానికి వచ్చినవారు రెండు, మూడు, ఐదు రూపాయలు అని తాంబూలంలో పెట్టి ఇస్తే, ఆమె అత్తగారి చిల్లరపెట్టెలో దాన్ని అలాగే పడేస్తుంది; ఇప్పుడు భర్తని నా డబ్బు అంటోందే?

అవును. రాధై ఇప్పుడు అడగాలని పూనుకుంది; తన పెద్దమనసు వలన తనకేం లభించింది?

సాధువైన అబ్బాయిగా, అణకువతో, తన జీతంలో ఐదురూపాయలుకూడా భార్యకి ఇవ్వాలని తెలియని సుపుత్రుడుగా కిట్టు కాలం గడిపిన రోజులు రాధై గుర్తుచేసుకుంది. 'ఇది నా తన తల్లిదండ్రులు నాకిచ్చిన డబ్బు!' అని ఆలోచించక, ఎటువంటి పక్షపాతమూ ఎరుగని స్త్రీగా అతని భార్య, ఈ రాధై ఉంది. కాని, ఏం లాభం! ఆమె పెద్దమనసు, ఔదార్యం ఎవరైనా మెచ్చుకున్నారా? డబ్బు, సొమ్ము అనే మాటకొస్తే వీళ్ళకున్న ఉపేక్ష, అజాగ్రత్త తనకి నిస్సందేహముగా తెలిసిపోయిందే?

'ఇక ఊరుకుంటే లాభంలేదు అని రాధై నిశ్చయించింది; కిట్టుకి అది తెలియనీ!

సాయంకాలం ఆఫీసునుంచి రాగానే కిట్టు "ఇదిగో, నీ ఇరవై రూపాయలు! బాకీ పది రూపాయలు తరువాత ఇస్తాను" అన్నాడు.

రాధై మరేం అనక దాన్ని మేజామీద పెట్టి లోపలికి వెళ్ళబోతుంటే కిట్టు "అది నీ దగ్గరే ఉండనీ. నా పర్సులో పెట్టకు!" అని ఆజ్ఞ ఇచ్చి, కుర్చీలో కూర్చొని, బూట్సు తీయసాగాడు.

ఆ మాటలు వినగానే రాధైకి కిట్టు ఆ బూటుతో తన చెంపమీద బాదినట్టనిపించింది. ఆవేశంవలన వెంటనే మాటలేవీ రాలేదు. కొంచెం సర్దుకొని "నేనెలాగ ఉండేదానని మీరు బాగా మరిచిపోయారు!" అని చెప్పి వంటగదిలోకి మాయమైంది.

సువర్ణమైన చెప్పులైనా అవి మన కాళ్ళడుగున పడితీరాలి - ఇదే రాధై అత్తగారి భావన. తన కూతురుకీ, కోడలికీ సమానత ఇవ్వాలని ఆవిడ ఏనాడు ఆలోచించలేదు. రాధైలో ఎన్ని మంచి గుణాలున్నా ఆ ముత్తైదువ నిర్మలమైన ప్రేమ తన కోడలికి ఇవ్వనేలేదు. ఒకసారి తన కూతురుకి చీర కొనాలని ఆవిడ బజారుకి వెళ్ళారు. "అమ్మా, నా దగ్గర పది రూపాయలున్నాయి. నాకూ ఒక మామూలైన చీర కొనండి!" అని అంటూ రాధై డబ్బిచ్చింది. తల్లీ, కూతురూ బజారునుంచి తిరిగివచ్చి రాధైకి రెండు చీరలు చూపించారు. "వదినా, మనిద్దరం జోడుగా వాడుదాం అని ఇరవైఐదు రూపాయలకి రెండు చీరలు కొనేసాం!" అని ఆడపడచు అంది. "పదిరూపాయలకి ఏ చీరా లేదు!" అన్నారు అత్తగారు. ఆ పదిరూపాయలు ఆవిడ రాధైకి తిరిగి

ఇవ్వకూడదా? లేకపోతే దానికి బదులు నాలుగు జాకెట్టులు కొనియిస్తే ఎంత బాగున్ను! అలాగేం చెయ్యలేదు; ఆ పదిరూపాయలూ ఆవిడ తన కోడలికి కొన్న చీరకోసం తీసుకున్నారు. ఇది చూసి రాధై బాధపడింది. చీరని చూసి మెచ్చుకున్నవాళ్ళతో తప్పకుండా "ఇది మా అత్తగారి బహుమతి!" అని గర్వంతో చెప్పుకుంది. కూతురుకని జాకెట్లు డజను డజనుగా అత్తగారు దర్జీవాడుతో చెప్పి కుట్టించేవారు. పోతే పోనీ అని రాధైకి ఒకే ఒక జాకెట్టు. "వాళ్ళ అమ్మగారికి సింగర్ మెషిన్ ఉందిగా? ఆవిడ కూతురుకి జాకెట్లు కుట్టి ఇస్తారు" అని అంటూ ఆవిడ దర్జీఖర్చులు తగ్గించుకుంటారు. 'బాగుంది, పొదుపు చేయడమంటే ఇదే కాబోలు!' అని రాధై తనలో అనుకుంది.

టీ చేస్తూ రాధై కన్నీరు కార్చింది. 'మనకి డబ్బంటే ఎంత గిరాకీ అని తెలియదని వాళ్ళు అంటున్నారు. అందులో న్యాయమూ ఉంది అని నా భర్తకి వివరంగా చెప్పాలి!' అని తొందరపడింది.

రెండు గిన్నెలలో టీ, ఒక కంచెంలో snack (సీడై), తీసుకొనివచ్చి రాధై మేజామీద పెట్టింది. "రెండురోజులుగా ఈ సీడైకి బదులు మరేదైనా చెయ్యాలనుకున్నాను" అని ఆరంభించింది. కిట్టు ఒక పొట్లం విప్పడం చూసి ఆగింది.

"ఇంకొక కంచెం తీసుకురా!" అన్నాడు కిట్టు.

"ఇదేంటి, సింగాడా, సందేష్ కొన్నారా? డబ్బ పొదుపు చెయ్యడమంటే ఇదేనా?" అని రాధై హాస్యంగా అడిగింది.

"నువ్వు చాలా రోజులుగా అడగలేదూ?"

"అవును; ఎప్పుడో అడిగాను. మరెప్పుడైనా అడిగానా? ఇక అడుగుతానా?"

"నీకెందుకు కోపం? మనం ఎప్పుడూ మంచిదే తీసుకోవాలి."

"అంటే . . . ?"

"నాన్నగారికీ మనగురించి బెంగ వచ్చేసింది! అతను ఖర్చుదారి ఐపోయారు. మనకూ ఆ గండం వచ్చేస్తుందని భయపడుతున్నారు, మరేంలేదు!"

"మనం దూబరదండిగా ఖర్చు చేస్తున్నామా?"

“లేదు. మనం చేసేవి అత్యవసర ఖర్చులే. కాని అందులోనూ తగ్గించడానికి వీలవుతుందేమో?”

“నేనేదైనా తగ్గించితే ‘ఇదికూడా మనకి వద్దా? మనకేం చేతకాదా?’ అని మీరు అనేవారు. జ్ఞాపకం ఉందా?”

“అలా అనడం నాకు అలవాటైపోయిందనుకుంటాను!” అని కిట్టు ఒక జడ్డి నవ్వు నవ్వాడు.

‘ఆఫీసరుగారి అబ్బాయిగా మెలగిన రోజుల అలవాటు!’ అని రాధై మనసులో చెప్పుకుంది.

“సీడై మాత్రమే టిఫిను ఇవాళ. టీ బదులు కాఫీ చేద్దామనుకున్నాను. కాని వీటితో కడుపు నిండిపోయింది!” అని తృప్తితో రాధై టీ తాగసాగింది.

“మన ఇంటిలో ఒకరోజు కాఫీ తాగడానికి ఆ పళ్ళడాక్టరుని పిలవాలి! నేను తినుబండారాలు కొంటున్నప్పుడు వాడూ వచ్చాడు. ‘నాకివన్నీ ఇష్టం!’ అని నేను అన్నాను. వాడికి మన ఉప్పుమా, కాఫీ అంటే ఇష్టం అని అన్నాడు. ఒకసారి మనింటికి రానీ, మన ఇల్లు చూడనీ, వాడి భవనంకి మన ఇల్లే సాటి అని బోధపడుతుంది! . . . వాడొకసారి నన్నడిగాడు: ‘నువ్వెందుకు ఉత్తి M.A., చదువు చదివి ఊరుకున్నావ్? మీ నాన్నగారు పెద్ద ఆఫీసరు; నిన్నెందుకు అతను సీమకి పంపలేదు?” అని. అతని తండ్రి వాడిని అమెరికాకి పంపించారని గర్వం! అవును, నిజం. కాని ఇప్పుడు వాడి బతుకెలా ఉంది? మన అప్పు తీర్చకుండానే నా దగ్గర ఇలా వాగుతున్నాడు! ఇంటికి అద్దె తొమ్మిది వందల రూపాయలు ఇస్తున్నాడు. నేను నలభై రూపాయలు ఇస్తున్నాను. మన ఇల్లు ఎలావుందని వచ్చి చూడనీ! నేను పిలుస్తాను!” అని అంటూ కిట్టు కళ్ళు ఇటూ అటూ తిప్పుతూ ఇల్లంతా చూసాడు.

ఆ కన్నుల కాంతిలో రాధైకి కిట్టు ఇంతకుముందెప్పుడూ పలకని మాటలు వినిపించాయి: ‘హూం, నాన్నగారు రిటైరయినప్పుడు ఇంటి యజమానుడిని కలుసుకొని, నా నిలకడ కోసం ఏర్పాటు చేసిన ఇల్లు! ఇంత తక్కువ అద్దెతో, హాయిగా ఇల్లునిండా సరకులతో నాకు దొరికింది. ఎంత భాగ్యం!’ అవును, ఇప్పుడు ఆ

కన్నులనుంచి ఈ సందేశమే రాధై చెవులకి అందాయి; ఇంతకుముందు చాలాసార్లు భర్తనోటినుంచి వచ్చిన మాటలే; అదే అతని మనసులోని భావన.

"అసలు వాడి మనసులో మనం ఏదో సందుగొందుల్లో కాపురం ఉంటున్నాం అనే ఆలోచన కాబోలు!" అని గొణుక్కుంటూ కిట్టు ఏటవాలైన కుర్చీలో వాలాడు. "అబ్బా!" అని హాయిగా ఊపిరి వదిలాడు.

రాధై మనసులో ఒక ఆలోచన లేచింది: 'మామగారు డాక్టరుకి అప్పిచ్చి మోసం పోయారు. అలాగ బతికితే ఆస్తి ఎలా పెరుగుతుంది?' అని. కావాలంటే వెయ్యిరూపాయల జీతంతో ఉద్యోగం చేసిన అతను కొడుక్కి సొంతంగా ఒక ఇల్లుకూడా కట్టి ఇవ్వగలరు, కాని అతను అలాగేమీ చెయ్యలేదు. ఆ అదృష్టం కిట్టుకీ లేదు. కాని తండ్రి ప్రేమానురాగాల్లో నమ్మకంవున్న పుత్రుడికి అది తెలీదే? తండ్రి ద్వారా తనకి లభించిన గృహంలో అద్దెకున్నా, అక్కడ సుగంధమైన అగరువత్తి పక్కనేవుంది. దాని ధూమం ఎంతో సంతోషంగా ఉంది.

గభీమని రాధై భర్తని ఆడిగింది: 'అగరువత్తికి మనం నెలా ఒక రూపాయి ఖర్చు చేస్తున్నామా?"

"ఇదేం ప్రశ్న? మరేం ఆడగవద్దు!" అని కిట్టు విసుగ్గున్నాడు; అతని మొహంలో కోపమూ. చిరాకూ, కనిపించాయి.

"ఒక రూపాయి ఖర్చులో మనసుకి ఎంత ఇంపుగా ఉంది!" అని రాధై అనగానే కిట్టు ముఖంలో కనిపించిన చిరాకు ఒక చిరునవ్వులాగ మారిపోయింది. "హూం, హూం, మనిషి బతకాలంటే ఎన్ని అవస్థలు! మితంగా రోజులు గడుపుతున్నాం అనే తృప్తి కావాలి; 'మేం హాయిగా ఉంటున్నాం, మాకు విశాలహృదయముంది!' అనే గర్వమూ కావాలి! ఈ వీధిలో మనం ఒక పెద్ద ఇంట్లో ఉంటున్నాం, అందువలనే నేనొక పెద్ద ఉద్యోగంలో ఉన్నట్టు చాలామంది అనుకుంటున్నారు. నేనిచ్చే అద్దె గుర్తుచేసుకుంటే నాకు ఊరటగా ఉంది. ఇల్లు అన్న మాట వస్తే మనం భాగ్యవంతులే!" అని అంటూ కిట్టు చెయిలోనున్న వార్తాపత్రిక పేజీని తిరగవేసాడు.

తన ఇంటి శ్రేయస్సునుంచి ప్రపంచంలోని వార్తలకి దూకుతున్న భర్తని రాధై రెప్పవాల్చకుండా ఒకసారి చూసింది. ఒక అల్పసంతోషి మనసులోని ప్రశాంతి ఆమెకు

బోధపడింది. రాయిలాగ, నిశ్చలమైన మనసులో ప్రేమతోబాటు ఎన్ని ఉన్నత భావనలు, జ్ఞపకాలు మఱుగివున్నాయి! ఈ అబ్బాయిని తల్లిదండ్రులు చూడలేదు, కాని రాధై చూసింది.

'బిడ్డ మనసు రాయి' అనే సామెత రాధై గుర్తుచేసుకుంది; ఈ బిడ్డ మనసు ఒక రాతి శిల్పం!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, ఏప్రిల్ 7, 1957)**

# కొంటె సాక్షి!

నాకు ఎదురింటి రేణులో  ఒక మార్పు కనిపించింది: అణకువగా తలని పూర్తిగా కప్పుకున్న చీరకట్టులో కనిపించే సౌకుమార్యం; మనసులోని ఆహ్లాదం బాహటంగా వెలువరించే చిరునవ్వు; ఆ ఉద్వేగం ఎందుకని నాకు బోధపడింది. కొంచెం సమయంముందు కారు శబ్దం వినిపించిందే? . . . ఆమె భర్త వచ్చాడు కాబోలు . . .

భర్త రాకని రేణు ఒక వారంగా ఎదురుచూస్తోంది. ఒకరోజు సాయంకాలం రేణు నన్ను చూడడానికి వచ్చినప్పుడు మేమిద్దరం చాలా కబుర్లు మాటాడుకున్నాం: ఆమె పెళ్ళి; కొత్త బంధువులు; నా వజ్రపు ముక్కుపుడక; ఆమె బెనారసు సిల్కు చీర; పెళ్ళి సంప్రదాయాలు - ఇవన్నీ చెప్పుకున్నాం. ఆఖరికి ఆమె సెలవు పుచ్చుకున్నప్పుడే నేనడిగాను: “ఇంకా ఎన్నిరోజులు ఇక్కడ ఉండడానికి నీకు అనుమతి ఉంది?” అని. దొంగనవ్వు నవ్వుతూ, రెండు చేతుల వేళ్ళనీ బాగా విప్పి, మళ్ళీ ముడుచుకుంటూ “ఇంకా ఒక వారం, పదిరోజులు!” అని చెప్పి రేణు వెళ్ళింది. “ఓహో, అలాగా?” అని మాత్రం అడిగి నేను ఉరుకున్నాను. అప్పుడే నా మనసులో కలత చోటుచేసుకుంది: అందుకే కాబోలు ఆమె నన్ను కలుసుకోవాలని వచ్చింది, నేను మాటల్లోనే నిమగ్నమైపోయాను! పొయ్యి ముట్టించి నాలుగు అప్పడాలు, ఒడియాలు ఆమెకి ఇవ్వాలని మరిచిపోయాను. ‘రేణు ఇంకా కొన్ని రోజుల్లో అత్తవారింటికి వెళ్ళిపోతుందే!’ అని మా మనసు తపతపలాడింది.

ఆ తరువాత ఏవో రెండు మూడు  పిండివంటలు చేసి వాళ్ళింటికి పంపాను. ఆమె భర్త వచ్చినతరువాత , ఇద్దరినీ దంపతులుగా పిలిచి ఇడ్లీ లేక దోసా - కాఫీతో ఇవ్వాలని నా ఉద్దేశం. అందువలనే గతవారమంతా రేణుని చూసినప్పుడల్లా “మీ ఆయన ఎప్పుడు వస్తారు?” అని అడుగుతూనేవున్నాను. “అక్కయ్యా, అతను కలకత్తాలో బిజీగా ఉన్నారు!” అని రేణు చెప్పింది. ‘సరేలే, ఇక నీ సంతోషంకి హద్దులేదు!’ అని దాన్ని ఎగతాళి చెయ్యవలసిందే! అని నేనకున్నాను.

నాకు మా ఇంటి వసారాలో నిలబడి రేణు ముఖం చూడాలనిపించింది. ఆమె భర్త వచ్చేసాడని నేను నిస్సందేహముగా తెలుసుకోవాలని ఇరుకుగా, మళ్ళీ మళ్ళీ ఆరసి చూసాను; రేణు మాత్రం నిలకడలేకుండా ఇల్లంతా ఊరక తిరుగుతున్నట్టు కనిపించింది. ఒక మారు తన  ఇంటినుంచి, అకస్మాత్తుగా, నన్ను చూసేసింది. నా చెయి సైగని చూడగానే, సిగ్గుతో తల వంచుకొని, చీరని, తన తలవెంట్రుకలమధ్య సర్దుకొని నిష్క్రమించింది. పెళ్ళైన తరువాత రేణు తన గుజరాతీ సంప్రదాయంకి తగినట్టుగానే చీర తొడుగుతోంది; కాని ఇవాళ ఆమె తలని కప్పుకున్న వైఖరి నాకు ఒయ్యారంగా కనిపించింది.

ఆ రోజు మధ్యాహ్నం రేణు అన్నయ్యతో అల్లుడుగారు సినిమాకి వెళ్ళారని తెలుసుకున్నాను. “మీ బావగారితో రేణు ఎందుకు సినిమాకి వెళ్ళలేదు?” అని రేణు చెల్లెల్ని అడిగాను. “అక్కయ్య ‘నేను రాను!’ అని చెప్పేసిందే?” అని ఆ బాలిక నాకు జవాబు ఇచ్చింది. “ఓ, అలాగా? నేను దాన్ని వాయించుతాను అని అక్కయ్యకి చెప్పు!” అని అంటూ నిజంగానే నా చెయి ఎత్తి జడిపించాను. పుట్టిల్లో ఇలాంటి చాన్సులు ఎవరైనా పోగొట్టుకుంటారా?’ఈ జడ్డి రేణుకకి ఇదికూడా తెలియదా?’ అని నాకు కోపం; రేణుమీద నాకున్న అబిమానం వలనే ఆ కోపం . . .

కొంచెం సమయం తరువాత రేణు వచ్చింది; దాని జడ్డి నవ్వు చూసి నాకు జాలి కలిగింది.

“నీ చెల్లెలు చెప్పిందా?” అని స్వాగతం చెప్పాను.

“‘సావిత్రి బెహన్ కోపంతో ఉన్నారు’ అని మాత్రం చెప్పింది. నాకు రావడానికి ఇప్పుడే వీలయింది. రేపు మేం భువనేశ్వర్ వెళ్తున్నాం.”

“ఓ, అలాగా? అది సరే . . . నువ్వెందుకు మీ ఆయనతో సినిమాకి వెళ్ళలేదు? నీకోసమేకదా అతను వచ్చారు?”

రేణు మరేం అనక అలాగే నిలబడుతూనే ఉంది.

“నేనూ నీలాగే ఉండేదాన్ని. దీపావళి పండుగకి మా ‘బాబు’ వచ్చినప్పుడు నేనతనితో మాటాడనేలేదు. మా నాన్నగారు కోపంతో ‘అతను నీకోసం వచ్చారా? లేక దీపావళి విందుకని వచ్చారా?’ అని నన్ను అడిగారు . . . ”

రేణు రెప్పవాల్చకుండా నన్ను చూసి, చిరునవ్వు నవ్వింది. నోట ఏ మాటా రాలేదు.

"అక్కడ అత్తగారింట్లో సినిమా చూస్తావా? మీ ఆయనతో వెళ్తావా?"

"వెళ్తాం, అందరం కలిసి వెళ్తాం."

"అక్కడ మీరందరూ కలిసి వెళ్తారు; మనం ఇతరులని వదిలేసి జోడుగా వెళ్ళడానికి జంకుదాం. కాని ఇక్కడ మీ ఆయనతో నువ్వు వెళ్ళకూడదా? మీ అన్నయ్య 'నేను రాను!' అని బావగారితో చెప్పివుండాలి . . . "

"వాడు అలాగే అన్నాడు; నన్ను మాత్రం వెళ్ళమన్నాడు. కాని నేను వెళ్ళలేదు."

"ఏం, ఎందుకలా అన్నావ్? నీకేం పిచ్చి పట్టిందా?"

తన బోళాతనం కలసికట్టుగా వచ్చినట్టు ఒక చూపుతో కళ్ళు ఎత్తి రేణు నాకు ఇలా జవాబిచ్చింది: "ఇక్కడ మేమిద్దరం మాత్రం సినిమాకి వెళ్తే అక్కడకి వెళ్ళినతరువాత అలాగే ఇద్దరం కలిసివెళ్ళాలనే ఆశ వచ్చేస్తుంది. అది బాగుంటుందా? అందుకే . . . "

నాకు బోధపడింది. ఒక క్షణం ఏమనాలో తెలియక కలవరపడ్డాను. ఏదో ఒక పుష్కరం ముందు నేనలాగ ఉండేదాన్ని అన్న కారణం వలన రేణు ఈ రోజుల్లో అలాగేవుంటుందని నేను ఎదురుచూడలేదు. యుగయుగాలుగా మారని మానవ పకృతి ధర్మం, స్త్రీత్వం కొన్ని సంవత్సరాలలో మారడం ఎలా సాధ్యం? అనేక విధాల్లో నేను రేణులాగ, రేణు నా లాగ. వయస్సులో తేడావున్నా దాన్ని మించి మా ఇద్దరికీ చాలా పోలికలున్నాయి. కాని, ఇప్పుడు నా ఎదుట నిలబడివున్న రేణుని చూసి నాకు ఆశ్చర్యం కలిగింది; నాలో భావనలు లేచాయి: భర్త వచ్చేసాడు అని ఆనందించే పడుచు భార్య; తల్లిదండ్రులను మళ్ళీ వదిలి వెళ్ళాలనే బాధపడుతున్న యువతి; అత్తగారిల్లంటే దాన్ని మహత్వం, అందులో తన ధర్మమేమిటో గ్రహించిన కొత్త కోడలు - ఇవన్నీ తన హృదయంలో వేరే వేరే అరలుగా సమకూర్చి, ఒక ఆదర్శ స్త్రీగా మెలగాలనే అభిలాషతో రేణు నాకిప్పుడు దర్శనమిచ్చింది. ఈ రేణుని ఏడెనిమిది సంవత్సరాలముందు నేను బాలికగా చూసివున్నాను. ఇప్పుడు రేణు ఎటువంటి స్వప్నావస్థలో ఉందో, అటువంటి అవస్థలోనే నేనూ ఆ రోజు ఉన్నట్టు గుర్తుచేసుకున్నాను.

ఒక క్షణంలో దీర్ఘమైన కల కన్నట్టు నాలో అనేక భావనలు చెలరేగాయి. “రేణు, నాకొక పాట పాడి వినిపించు. ఈ సారి నువ్వు పాడి నేను వినలేదు. నీకు జ్ఞాపకం ఉందా? నువ్వు మీ వసారాలో కూర్చొని ఎన్ని పాటలు పాడేదానివి! నీకు మంచి కంఠం ఉంది” అన్నాను.

“అదేంటో అక్కయ్యా, ఆ రోజుల్లో నేను మొహమాటం లేకుండా నిండు సభల్లో మగవాళ్ళముందు పాడివున్నాను.”

“ఇప్పుడు నాదగ్గర నీకు మొహమాటం లేదుకదా? పాడి వినిపించు . . . ”

“అక్కయ్యా, నేను వెళ్ళి రేపు భువనేశ్వర్ ప్రయాణంకి కొన్ని ఏర్పాట్లు చెయ్యాలి.”

“వెళ్దువుగానీ . . . ముందు ఒక పాట పాడు.”

రేణు కొంచెం జంకినట్టు కనిపించింది, నవ్వింది. “సినిమా పాట వద్దు అక్కయ్యా! మీరా భజన పాడతాను,” అని అంటూ మృదువుగా, తన ప్రతిభ వెల్లడిస్తూ ఒక కీర్తన పాడింది. ఆ మాధుర్యం రమించి నా కన్నులు తడిసాయి. ఇటీవల రేణు పాడటం బాగా తగ్గిపోయినా, ఆమె కంఠధ్వనిలోని  ఉల్లాసం, తేలికగా గాలిలో వస్తున్న చల్లదనం నేనిప్పుడు ఇంకా గొప్పగా అనుభవించాను.  సంసార సముద్రలో ఎన్ని శోభలూ, విశేషాలూ, కళాకృతులూ ద్వీపవాసుల్లాగ, అణిగి, కుంగి మాయమవుతున్నాయి! ఈ రేణుకూడా అలాగే ముత్యంలాగ సముద్రం లోతున ఎక్కడో పడి ఉంటుంది.

“నేను వెళ్ళాలి, అక్కయ్యా!”

“అవును, వెళ్ళాలి . . . కొంచెం ఆగు . . . రేణు, నువ్వు ఆ రోజుల్లో ఒక సారి ప్రేమలేఖ ఏదో పాడుతూ వసారాలో కూర్చున్నావ్. అప్పుడు రషీద్ వీధిలో నడుస్తూ వెళ్తున్నాడు. వాడు తన దారి పోయేవాడు నీ పాటలోని తరువాతి వచ్చే పదబంధం పాడుకుంటూ వెళ్ళాడు. నువ్వది గుర్తించలేదు; కాని నేను విన్నాను. ‘రేణు, రషీద్ పెళ్ళి జరుగుతే బాగుంటుంది, ఇద్దరికీ మంచి పొత్తువుంది!’ అని నేను నాలో అనుకున్నాను. నాకుమాత్రం అలా అనిపించింది; నీ అమ్మా, నాన్నగారు కూడా నీ పెళ్ళిగురించి అప్పుడు ఆలోచించి ఉండరు.”

“అక్కయ్యా, రషీద్ ఒక కిల్లాడి. వాడు ఊరక ఊరంతా తిరుగుతాడు. మా బాబుకి వక్కాకు పోకంటే చాలా ఇష్టం. అదనికదే వెట్టిగా అలవాటైపోయింది.”

ప్రేమానురాగాలు రుచిచూస్తున్న సంసారంలో కటువుకూడా చోటుచేసుకుందని ఆమె పెదిమలు నాకు తెలియజేసాయి. "అలాగైతే ఆ పిచ్చిని మెల్ల మెల్లగా తగ్గించేయ్!" అని అంటూ "మీరింకా నాలుగు రోజులు ఇక్కడ ఉంటారా?" అని అడిగాను.

అవునని రేణు తలూపింది.

"పూరీనుంచి తిరిగిరావడానికే మూడురోజులవుతుంది."

"అలాగా? మంచిది. వెళ్ళిరా! బాగా Enjoy చెయ్!"

ఆ మరునాడు రేణు, దాని భర్త, అన్నయ్య, చిన్నాన్న - నలుగురూ కారులో ఎక్కడం చూసాను. అల్లుడుగారు అణకువతో డ్రైవరు పక్కన కూర్చున్నారు; వెనక సీటులో రేణు, అన్నయ్య, చిన్నాన్న.

'చిన్నాన్నకీ మతి పోయిందేమో?' అని నాకు భ్రమ కలిగింది. "అల్లుడుగారూ, మీ జాగా నాకు!" అని అతను అడిగి తీసుకోవద్దూ?" అని మా ఆయనతో మొరబెట్టుకున్నాను.

** ** **

ఎదురింటిలో సందడి అతిశయించే సూచనలు కనిపించాయి. రేణు అత్తగారింటికి వెళ్లిపోతుందని తెలిసి కొందరు స్త్రీలు ఆమెను చూడడానికి వచ్చారు. పెళ్ళైనతరువాత గుజరాత్ నుంచి అత్తగారింటికి వెళ్ళిన రేణు ఇప్పుడే పుట్టిల్లుకి వచ్చింది. ఇక్కడనుంచి ఆమె అత్తగారింటికి వెళ్ళడం ఇదే మొదటిసారి. అల్లుడుగారు రావడంతో ఆ ఇంటిలో రచ్చ మరీ తీవ్రంగా కనిపిస్తోంది. కాఫీ, టిఫను కోసం అతన్ని తప్పకుండా మా ఇంటికి ఆహ్వానించాలనుకున్నాను, కాని అదేం జరగలేదు. మాకు అల్లుడుగారితో ఎటువంటి పరిచయం లేదుకదా, సరే అని పిలవడం మానుకున్నాను. కాని రేణుకి ఒక రవిక గుడ్డ కొనిపెట్టాను. రకరకాల చీరలూ, రవికలూ ధరించడంలో గుజరాతీ స్త్రీలకి మంచి ఆసక్తి ఉంది. "అక్కయ్యా, నీకు ఈ చీరకట్టు చాలా బాగుంటుంది!" అని రేణు నన్ను ప్రేరేపించడం నాకు తెలుసు. రేణు నాతో అభిమానంతో మెలగడానికి ఒక నిదర్శనం చెప్తాను: "అక్కయ్యా, నువ్వు మంచి మంచి బట్టలు కొంటావు, కాని వాటిని శ్రద్ధగా ఉంచుకోవటం లేదు! అదే నువ్వు చేస్తున్న పొరబాటు! ఒక మంచి దర్జీ దగ్గర రవికలు

కుట్టించుకో. వాడు కొంచెం డబ్బు ఎక్కువగా అడిగినా సరే, బాధ పడకు, బాగా కుట్టి ఇస్తాడు. ఒక అరడజను మంచి సిల్కు రవికలు నీవశం ఎప్పుడూ ఉండనీ. నువ్వు మంచి అంతగత్తెవి. ఇంకా కొంచెం శ్రద్ధగా ఉంటే నువ్వు సినిమా తారలాగ రాణిస్తావ్!" అని రేణు పదే పదే విశ్వాశంతో నాకు చెప్పింది. ఆమె సలహా తోసిపుచ్చలేక, నేను నాలుగు రవికలు నా మోటుగాటి చేతులు మూసినట్టు కుట్టించుకున్నాను. 'సముచితంగా దుస్తులు ధరించాలి, అందులో అశ్రద్ధ ఏమాత్రం కూడదు!' అనే పాఠం ఆ రోజే నేను నేర్చుకున్నాను; నా స్నేహితురాలు బాహటంగా నాకు బోధించిన సందేశం అది. ఇక నాకు పరిచయంలేనివారు నన్ను చూస్తే విరుద్ధంగా ఏమీ భావించరుకదా?

టిఫనుకి పిలవాలనే ఉద్దేశంతో "ఎప్పుడు నీ ప్రయాణం? ఇంకా ఎన్ని రోజులుంటావ్?" అని మాటిమాటికి ఆమెని అడిగిన నేను ఆ రవిక గుడ్డ కొనగానే "రేణు, విను, నువ్వేమో నాకు చెప్పకుండా నీ భర్తతో వెళ్ళకూడదు!" అని ఆజ్ఞ ఇచ్చి హాయిగా నా రోజులు గడిపాను. రేణు త్వరలో అత్తగారింటికి వెళ్ళబోతుందనే నిజం గుర్తుంచినా నా మనసులో ఎటువంటి చలనమూ చోటుచేసుకోలేదు. 'ఇది సహజమేకదా?' అనే భావనే నన్ను ఆగట్టుకుంది. కాని నా చెయిలో ఎక్కడో దూరాన ఆకాశంలో మెరుస్తున్న తారలాగ 'రేణు!', 'రేణు!' అనే ప్రజ్ఞ మిణుకుమిణుకుతూనే ఉంది.

తెల్లవారింది. ఇవాళ రేణు ప్రయాణం. ఆమె వస్తే ఇవ్వాలని ఫిల్టరు కాఫీ తయారుజేసాను. ఎదురింటిముంది కారు నిలబడివుందా అని చూస్తూనే ఇంటి పనులన్నీ చేసాను.

రేణు వచ్చింది. నేను స్వాగతం చెప్పాను, కూర్చోమన్నాను. "నువ్వు లేనప్పుడు మీ అమ్మగారిని 'రేణు ఎప్పుడు వస్తుంది?' అని అడిగేదాన్ని. నువ్విక్కడ వచ్చిన తరువాత నేను నిన్ను అడిగే ప్రశ్న ఒకటే: 'నువ్వెప్పుడు ఊరుకి వెళ్తావ్?' అని. తలుచుకుంటే తమాషాగా ఉందికదూ?" అని అంటూ నవ్వాను.

రేణు చిరునవ్వు నవ్వింది; కాని ఆమె కన్నులలో శోకం కనిపించింది. కనురెప్పల బరువుతో కన్నులు సగం మూసుకొనివున్నాయి. రేణు మనసు నాకు అర్ధమైంది. ఐనాకూడా నా సంతోషం ఆమెకి తెలియజేసి, 'ఆడ జన్మంటే ఇది లోకంలో ఎప్పుడూ జరిగేదే!' అనే వాస్తవం ఆమెకి బోధించాలని ఆలోచించాను. ఇంకా కొన్ని చిన్న చిన్న

ప్రశ్నలు అడిగి రేణు నోటిలోనుంచి వచ్చిన జవాబులు విన్నాను. రేణుతో ఆమెకు తోడుగా వచ్చిన  చెల్లెలు చెయి పట్టుకొని “విను, నువ్వూ నీ అక్కలాగ ఒకరోజు మమ్మల్ని వదిలేసి పారిపోతావ్!” అని చెప్పి “రేణు, నేను నీ చెల్లెల్నిఅది పుట్టినరోజునుంచీ చూస్తున్నాను. అది అత్తగారింటికి వెళ్ళినప్పుడు నేను తికమకలాడుతానేమో తెలీదు. కాని నిన్ను ఇప్పుడు చూస్తే నాకు బాధగా ఉంది. మనిద్దరిలో అంత చనువు వచ్చేసింది!” అని అన్నాను.

ఎంగిలి మింగుతూ నిస్పృహతో నన్ను చూస్తూ, రేణు తల వంచింది.  “అక్కయ్యా, నేను వెళ్ళాలి” అని మనసు కరగించునట్టు ఆమె నోటినుంచి మాటలు వినిపించాయి.

“నీకోసం కాపీ చేసాను. తాగు.”

“వద్దు అక్కయ్యా! నాకెలాగో ఉంది. నాకు కాఫీ అలవాటు లేదే?” అని రేణు వినయంతో తన ఛాతీని అణుక్కుంది.

“సరే, కాఫీ వద్దు. కొంచెం సేపు మనం మాటాడదాం. ఏమంటావ్?”

“అక్కయ్యా, నేను వెళ్ళాలి . . . మామీని చూడాలి . . . ”

“సరే, ఉండు . . .  కుంకం ఇస్తాను.”

రవిక గుడ్డతో, తాంబూలంతో పళ్ళెం చూపి, ఆమె నెత్తిలో బొట్టుబెట్టాను.

“ఇవన్నీ ఎందుకు అక్కయ్యా? ఇంకా ఎన్ని ఇస్తావ్?”

“నేనేం గొప్పగా ఇస్తున్నాను?”

“ఆ Plastic డబ్బా, Ever Silver  spoon . . . ”

“రేణు, ఇవన్నీ ఒక లెక్కా? అన్నీ సామాన్యమైన వస్తువులే . . . నీకోసం తీసిపెట్టాను . . . తీసుకో . . . ”

ఆమె వెనుకాడడం చూసి నేను “రేణు, నీకెందుకింకా సంకోచం?నువ్వు నాకు చెల్లెలులాగ . . . ” అని అన్నాను.

నన్ను రెప్పవాల్చకుండా చూసి, రేణు నా బహుమతి తీసుకుంది.

“వస్తాను, అక్కయ్యా! . . . ”

“వెళ్ళిరావమ్మా . . . సంతోషంగా ఉండు . . . ” అని ఆమె భుజాలు తడముతూ సాగనంపాను.

గభీమని రేణు తిరిగి నన్ను చూసింది. అలాగే నా భుజం మీద - ఛాతీ ఎడం పక్కన - వాలి, తన మొహాన్ని బలవంతంగా పొడుచుకొని “సావిత్రీ బెహన్!” అని పెక్కివెక్కి ఏడ్చింది. బిగ్గరగా ఆరంభించిన వెక్కు క్రమంగా తగ్గుతూవచ్చి ఆఖరికి నాకొక మూల్గుగా వినిపించింది. గాబరాతో ‘రేణు!’, ‘రేణు!’ అని పిలుస్తూనే - ఆమెకంటే నేను వయసులో పెద్ద అని గుర్తుచేసుకొని - ఆమెను ఓదార్చాలని ఆమె వీపుని మృదువుగా రుద్దుతూ, నేనూ ఏడ్చాను. “రేణు, ఏడవకు . . . సంతోషంగా వెళ్ళిరావమ్మా . . . విను, నువ్వు రావాలి, తప్పకుండా రావాలి అని ఎదురు చూస్తున్న నేనే ఇప్పుడు నువ్వు వెళ్ళడానికి అనుమతి ఇస్తున్నాను. నేను మరేం చెయ్యగలను, చెప్పు!” అని నాకు తోచిన ఏవో మాటలు చెప్పి ఆమెను ఊఅడించాను.

రేణు మొహం తీయకుండానే వెక్కిలి విడిచింది. “రేణు, ఏడవకమ్మా, వెళ్ళిరా,” అని నేను మళ్ళీ ధైర్యం చెప్పాను.

గభీమని రేణు నన్ను వదులుకొని నిలబడింది. “వస్తాను, అక్కయ్యా!” అని అంటూ నన్ను తిరిగికూడా చూడకుండా, మెట్లు దిగి, గబగబమని నడిచి వెళ్ళిపోయింది.

“వెళ్ళిరా . . . వెళ్ళు!” అని నేను అన్నానని రేణు నొచ్చుకుందా? గభీమని నన్ను వదలుకుందే?

పక్కనేనున్న కుర్చీలో నేను అలాగే వాలాను. రేణు తల వాల్చుకున్న నా భుజం ఎడమ పక్కని ముట్టుకున్నాను. నా ఛాతీమీద చెయి పడినవెంటనే నా దేహమంతా పులకరించింది. హృదయం కరిగింది. ‘నా ముద్దు రేణు నా గుండెలో చొచ్చుకొని ఏడ్చింది!’ అనే ప్రజ్ఞతో నా మనసులో మధురమైన భావన కెరటాలుగా ఎగసి ఎగసి పడుతూన్నట్టు నాకనిపించింది. ఆమె కారులో ఎక్కి కూర్చున్నవరకూ నేను మా ఇంటి వసారాలో కాచుకొని, “రేణు, వెళ్ళిరా!” అని నా ఆకాంక్షని ఆమెకు తెలియజేసాను.

అంతేకాదు. ఆ తరువాత దీర్ఘంగా ఆలోచనలో పడిన నా మనసులో ఎన్ని మధుర భావనలు ఆకట్టుకున్నాయి! రేణు వెక్కి వెక్కి ఏడ్చి తన ప్రేమానురాగాలు నాకు తెలియజేసిందని నేను గర్వపడ్డాను. ఇవన్నీ వివరంగా మా ఆయనతో పంచుకోవాలని

నాకు ఆతురత కలిగింది. కాని అతనికి టూకీగానే చెప్పాను: “పాపం, రేణు ఏడుస్తూనే వెళ్ళింది!” అని. నేను అనుభవించిన సంతోషం అతనికి వర్ణించడం సాధ్యమా?

** ** **

ఆ మరుదినం తపాలులో తమిళ పత్రికలు వచ్చాయి. అసలు వాటి పేజీలు తిరగవేయాలని కూడా నాకు తోచలేదు. నా మనసులోని సుడిగుండంలో మధుర భావనలు తేలుతుంటే వాటిలో ఇతర ఘటనలు చొరపడడానికి నాకు ఇష్టం లేదు. రేణు మొహం నా మనసులో బాగా నాటుకొనివుంది; ఈ ఒకరోజైనా మరేదీ మా మధ్యలో రాకూడదని నేను నిశ్చయించాను.

“ఇవాళ మనం సర్కసుకి వెళ్దామా? రేపు ఆఖరి రోజని విన్నాను!” అని అడిగారు మా ఆయన.

“వద్దు. మూడు వారాలు కూడా తట్టుకోలేని సర్కసు, ఏం గొప్ప సర్కసు? మనేం చిన్న పిల్లలా?” అని నా మాటలు విని అతనికి ఆశ్చర్యం కలిగిందేమో? అతను మరేం అనలేదు!

కొంచెం సమయం తరువాత నేను చూసినప్పుడు  ఎదురింటిముందు ఒక కారు నిలబడివుంది. రేణు తల్లి, పిన్ని, చెల్లెళ్ళు, తమ్ముడ్లు అందరూ కారులో ఎక్కుతున్నారు. వాళ్ళ ముఖాల్లో ఉత్సాహం కనిపించకపోయినా, బయటకి వెళ్తున్న సందడిలో శ్రద్ధ, చురుకుతనం కనిపించాయి. అవును మరి, వెళ్ళవలసిన నిర్బంధం వస్తే, వెళ్ళి తీరాల్సిందే! రేణు లేకపోవటంవలన ఇవన్నీ ఆగుతాయా?

రెండురోజులముందు నేను రేణు తల్లితో మాటాడాను. “రేణు ఊరు చేరుకుందా? మీకు రెండు రోజుల్లో ఉత్తరం వస్తుందా?” అని అడిగాను.

“ఇవాళ టెలిగ్రాం వచ్చేసింది. కులాసాగా వాళ్లు ఇల్లు చేరుకున్నారు. రేణు ఉత్తరం రాయడానికి ఇంకా పది, పదిహేను రోజులు కాచుకోవాలేమో?” అని ఆవిడ కొంచెం బాధపడుతూనే అన్నారు.

“రేణు వెంటనే ఒక కార్డైనా రాసివుంటే బాగున్ను!” అని నేనూ అన్నాను.

“రెండు రోజులుగా నాకు ఇంట్లో ఉండడానికే బాధగా ఉందమ్మా! దానికి ముందురోజు పెద్ద గొడవ - పిల్లలందరూ పిచ్చపట్టినట్టు  ఏడుస్తూనే ఉన్నారు! వాళ్ళ

దుఃఖం పోవాలనే మేం సర్కసుకి వెళ్ళాం. ఆ మరుదినం పిల్లలకి చురుకుతనం, ఆటల్లో ఆసక్తి తిరిగివచ్చేసాయి! నాకంత త్వరగా మనసు మారుతుందా చెప్పు! నిన్నకూడా మరేం తోచక మానేజరు ఇంటికీ, కోవిలకి వెళ్ళాను."

'ఓ, అలాగా?' అని నా మనసులో లేచిన ప్రశ్నని కొంచెం అణచుకొని "అవును, మీరన్నది నిజం. నాకూ రేణు ఇక్కడ లేకపోవటం చాలా బాధగా ఉంది. ఆమెలో మనం చూసేది అసాధారణమైన మనసు; అందరికీ అది చేతకాదు!" అని నా సంతృప్తికి, ఆ తల్లి నిండు హృదయంకి తగినట్టుగా మాటాడి నేను ఇంటికి తిరిగివచ్చేసాను. కాని నా మనసులో కలవరం చోటుచేసుకుంది. ఏం, ఎందుకు? నేను కారణం తెలుసుకున్నాను . . .

నాకు రేణు అంటే అభిమానం ఉంది. ఆమెకూ నేనంటే ప్రేమ, అనురాగం. మా ఇద్దరిమధ్యా తీక్ష్ణమైన ప్రేమ అని నేను గర్వపడుతున్నానే - అదేమో ఉత్తి భ్రమ అని అనవచ్చా? రేణు సహవాసం లేదని బాధపడుతూ ఎదురింటివారు సర్కసుకి వెళ్ళారట! నేను రేణు సహవాసంలో ఏర్పడిన సంతోషం మరవకూడదని ఆ సర్కసుకి వెళ్ళలేదు! నా ప్రేమకి ఏమానా అర్ధముందా? రేణు తోబుట్టువులకీ, ఇక నాలాంటి స్నేహితులకీ ఎంత బేధం! వాళ్ళ ప్రేమతో నాది సమానమౌతుందా? రేణు నామీద వాలి, వెక్కివెక్కి ఏడ్చి, పుట్టిల్లో ఉంటున్న నాదగ్గర తన మానసిక క్షోభ చెప్పుకున్నప్పుడు నేను గర్వపడ్డాను. అంటే ఆమె బాధలోనేకదా నాకు సంతోషం కలిగిందని అర్ధం? ఇదేనా నా ప్రేమ? ఒక రోజు, రెండు రోజులని నేను రేణుపై సానుభూతి, అభిమానంతో ఆమెగురించి ఆలోచించాను; కాని త్వరలోనే నా దృష్టి మళ్ళీ ఆ పాత మార్గంలో కొనసాగిందే?

హూం, ఎందుకిలాంటి ప్రశ్న నాలో ఇప్పుడు లేవాలి?

పూలచెట్టులో గుత్తులుగుత్తులుగా వర్ధిల్లుతున్న పువ్వులు చూసి ఆనందించక, ఆ చెట్టుకింద, నేలమీదనున్న కలుపుమొక్కలు చూసానని నేను విలపించాలా? వాటిని పీకి పారేయడం ఏం పెద్ద పనా? మా ఇద్దరిమధ్యా ప్రేమ ఎలా పెరిగింది? మా జాతులు వేరు, మా బాషలు వేరు. మా ఇద్దరి అభిరుచులు - భోజనం, దుస్తులు, వయసు, పెంపు - అన్నిటిలోనూ తేడా ఉంది. అలాంటప్పుడు మేం అక్కా, చెల్లెలు అని

చెప్పుకొని మా ప్రేమానురాగాలు దృఢపరచుకున్నాం. ఇద్దరిమధ్యా ఎడబాటు అని రాగానే, కళ్ళు తడబెట్టుకుంటూ ఒకరినొకరు కౌగిలించుకున్నాం. ఇవన్నీ అబద్ధాలా? నా మతి ఎందుకు తుచ్ఛమైన కలుపుమొక్కలగురించి వణకుతోంది?

నా సంశయం తొలగించడానికి నా భర్త వచ్చారు. "ఇదిగో కలం; రిపేర్ చేసి వచ్చింది. ఇక ఎవరైనా కలం కావాలని అడిగితే ఆ చౌక కలం ఇయ్యి. దీన్ని ఇవ్వకు!" అని చెప్పారు.

"బాగుంది మీ వాలకం!" అని అంటూ నేను మొహం తిప్పుకున్నాను. నాకు నిజంగానే కోపం వచ్చింది. ఒకరోజు నేనేదో రాస్తూంటే రేణు వచ్చి కలం కావాలని అడిగింది. నేను నా దగ్గరవున్న వేరే చౌక కలం ఆమెకు ఇవ్వక నా చెయిలోని కలం ఇచ్చాను. అది ఆమె తిరిగి ఇచ్చినప్పుడు కలం మొన సరిగ్గా లేదు. ఇతని కొంటెతనం - రేణు ఊరికి వెళ్ళినతరువాత - ఆ కలం బాగుచేసుకొని వచ్చారు!

ఐతేనేం? నా సంశయం తొలగించడంతోబాటు అతను నా మనసుని దృఢపరిచారు. ఛాయలోని గొప్పతనం ఎండలో నిలబడితేనే మనకి బోధపడుతుంది. మందబుద్ధిని పాండిత్యమే తెలియజేస్తుంది. రేణుపై నాకున్న ప్రేమ మావారి ఉపేక్ష వలనే బోధపడింది!

********

**(మూలం ప్రచురణ: జనవరి 20, 1957)**

# మనసంటే ఎంత చోద్యం!

వికసించే మొహంలో చిరునవ్వు; తళతళలాడుతున్న ఎర్రని తమ్మంట్లు; కాటుక దిద్దిన కనురెప్పలు; తమలపాకు నమలడంతో ఎర్రబడిన పెదిమలు; నెత్తిలో చందన బొట్టు; ఆ ముఖ విలాసంకి తగినట్టుగా, మడిలో బిడ్డ. మరేం కావాలి? ఈ జాడలతో శోభిల్లుతూ, కొత్త తల్లిగా, ఉమా కనిపించింది.

“అమ్మాయికదూ, ఉమా? పేరు కణ్ణమ్మాకదూ? శ్రీకృష్ణుడికి స్త్రీవాచకంగా తగిన పేరు![1]” అని అంటూ స్నేహితురాలిని చూసి సుందరి నవ్వింది.

తన ఊహ సరే అన్న నిక్కుతో సుందరి ఉమా బదులుకోసం కాచుకొనివుండలేదు. కాని అంతలోనే . . .

“ఇది పుట్టినది ఏరోజని నీకు తెలుసా? మన స్వాతంత్ర్య దినం ఉదయాన్న! పేరు స్వరాజ్యలక్ష్మి!” అని అంటూ ఉమా తన బిడ్డని ముద్దుగా దగ్గరకి లాగ్గొని అణుచుకుంది.

సుందరికీ సంతోషమే. “అలాగా? చాలా మంచి పేరు! మనకి స్వతంత్రం రావడమంటే మన దేశంకి లక్ష్మీకటాక్షం అన్నమాట! స్వాతంత్ర్యదేవి అనే పేరుకంటే స్వరాజ్యలక్ష్మి అనే పేరే బాగుంది. నాకు నచ్చింది. ఐతే ఇది ఎవరి ఆలోచన? మీ ఆయన నీకు చెప్పారా?” అని ఆతురతో అడిగింది.

“లేదు. ఇది నా ఐడియావే! స్వాతంత్ర్యదినంకి ముందురోజు నాకు నొప్పులు రాగానే ఆడపిల్ల పుట్టితే ఆశతో స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టాలనుకున్నాను. నా ఆశ సఫలమైంది. బాలసారెకి వచ్చినప్పుడు మా ఆయన ముత్తులక్ష్మి అని మా అత్తగారి పేరు పెట్టాలనే ఉద్దేశంతో వచ్చారు. ‘అమ్మపేరులోనూ లక్ష్మీ ఉంది, ఇందులోనూ ఉందే? ఇది సరైన పేరు!” అని నేను అన్నాను. అతను సరేనని ఒప్పుకున్నారు, దీని అదృష్టం!” అని అంది ఉమా బిడ్డ తలని లాలించుకుంటూ.

---

[1] తమిళులు బాలకృష్ణుడిని కణ్ణన్ అని ముద్దుగా పిలుస్తారు. దానికి స్త్రీవాచకం కణ్ణమ్మా

"అవును, నీ కూతురు అదృష్టవంతురాలే! ఏదీ, నాకొకసారి దాన్ని ఇవ్వు! నీ మనసులో 'మగపిల్లవాడు కావాలి!, కృష్ణుడుపేరు పెట్టాలి!' అని ఆశకాబోలు! ఆఖరికి ఆడపిల్ల పుట్టి నీ మనసు మార్చేసిందన్నమాట!" అని అంటూ సుందరి పసిపాపని తల్లిదగ్గరనుంచి తీసుకుంది.

"ఈ భాగ్యవంతురాలిని తీసుకొనే శుభవేళలో నీకూ ఒక కూతురు పుట్టనీ! లేదా నీకూ మగపిల్లవాడే కావాలా, చెప్పు!"

"అబ్బోయ్, నాకు పిల్లలే వద్దు! అలా పుట్టినా ఆడపిల్లే కావాలి. తొలిబిడ్డ ఆడదైతేనే దానికి రకరకాల దుస్తులు తొడిగించి ముద్దులాడాలి, తల దువ్వి, సింగారించి, అన్ని ముచ్చటలూ చూడాలని మనకి ఆతురత ఉంటుంది, పదేళ్ళతరువాత మనకి తోడుగా ఇంటిపనులు చేస్తుంది! అదీ మంచిదేకదా?"

"'పిల్లలు వద్దు!' అని అంటున్నావ్, కాని నీ కల్పనాశక్తి ఎంతవరకూ దూకుతుందో చూసావా? నీకా పిల్లలు వద్దు?" అని ఉమా గబగబా నవ్వేసింది.

"సరే, అదెలాగో పోనీలే . . . ఉమా, రేపు గోకులాష్టమికదూ? గతసంవత్సరం నీకు గభీమని కృష్ణుడు పిచ్చి పట్టుకుందని చెప్పావ్! నాకు బాగా గుర్తుంది, మీయింటి బొమ్మలకొలువులో అన్నీ కృష్ణుడి బొమ్మలుగా నింపేసావ్! చూసావా, ఈ సారి బొమ్మలకొలువు రాగానే నీలో ఎంత మార్పు వచ్చేసిందని?" అని సుందరి సంభాషణ వేరే దిశలో మళ్ళింది.

"ఓ, అదా? అవును సుందరి, నీవన్నది నిజం! తలుచుకుంటే నాకూ ఆశ్చర్యంగానే ఉంది . . . ఆరోజు ఏదో ఆవేశంలో అలాగన్నాను కాబోలు - 'మగపిల్లవాడు పుట్టాలి, కృష్ణుడుపేరు పెట్టాలి' అని. ఇది పుట్టగానే ఆ పిచ్చి అణిగిపోయింది. అవును, మనుషుల మనసూ, ధోరణీ అని ఆలోచిస్తే మనకి అన్నీ చాలా చోద్యంగానే కనిపిస్తాయి!" ఉమా ఇంకా ఏదో చెప్పాలనుకుంది, కాని మరేం అనక నోరు మూసుకుంది.

సుందరి శెలవుతీసుకొని వెళ్ళిన తరువాతే ఉమా మనసులో ఏవేవో పాతజ్ఞాపకాలు లేచాయి. సుందరి చెప్పినట్టు జరిగినదేదో ఇప్పుడు వింతగా కనిపిస్తోంది. కాని ఇంతకుముందు దాని ఫరిణామం తనకి హానికరంగా కనిపించలేదూ? ఇప్పుడు

తనకున్న మనశ్శాంతి, నిలకడ కొన్ని మాసాలముందు లేనేలేదే? అంత ఎందుకు, ఇరవైరోజులముందుకూడా తను బెంగపెట్టుకోలేదూ?

గతసంవత్సరం, ఈ రోజుల్లో, కొత్తకాపురం ఆరంభించిన ఉత్సాహం ఉమా మనసుని ఆకట్టుకుంది. సంవత్సరం పొడుగునా ఎన్ని పండుగలు, వేడుకలు! తనే బాధ్యత వహించి తన ఇంటిలో అవన్నీ వైభవంగా కొనియాడడంవలన, తన మనసులోని ఆత్మాభిమానం ఎలా వర్ణించడం!

కాని గోకులాష్టమి పండుగలో ఉమాకేర్పడిన సంతుష్టి, ఆనందం మరే పండుగలోనూ ఆమెకి రాలేదు. ఏం, ఎందుకు? రకరకాల తినుబండారాలకి అది తగిన పండుగ అనే కారణమా? హూహూం, అలాగేం కాదు!

పాకుడుపాప ధోరణిలో, నీలవర్ణంలో కనిపించే ఆ బాలకృష్ణుని రూపం ఉమా మనసుని తీవ్రంగా నాటుకుంది. పూలదండలు, మామిడాకులు, అరటిమొలకలు, ముగ్గులతో కలిసిన పూజామండపంలో ఆ చిన్నికృష్ణుని చూసినతరువాత ఆమె ఏమని వేడుకుంది?

“నేను నిన్ను పూజించే ఈ రోజు నా జీవితంలో ఒక శుభదినంగా ఎంచుకున్నాను. నీలాగే నాకొక . . . ”

ఆమె మనసులో చిన్నికృష్ణుడే, లేకపోతే చిన్నికృష్ణుడిలాంటి పాప తనకి పుట్టాలని ఒక ఆలోచన, భ్రమ!

పిల్లలు పుట్టాలని బాహటంగా ఏ పూజా, వ్రతమూ చెయ్యని ఉమా మానసికంగా బాలకృష్ణుని ఆరాధించి అతని కటాక్షం కోరింది. ఆమెకు తెలియకుండానే కృష్ణుని పూజించాలనే ఆపేక్ష ఆమె మనసులో నిలుకడగా పాతుకుపోయింది.

‘కృష్ణుడు పూజకి ఒక అందమైన, పెద్ద కృష్ణుడి విగ్రహం కావాలి; ఆ ప్రతిమ ముఖంలో శిల్పనైపుణ్యం, కొంటెతనం, చిరునవ్వు - అవన్నీ ప్రతిఫలించాలి; నిజమైన బాలుడుగా కనిపించాలి!’ ఇవన్నీ ఉమా తలపోసుకునే ఉంది. పొరుగింటి ముత్తైదువతో బొమ్మల దుకాణంకి వెళ్ళింది.

3

అటువంటి బొమ్మని చూసినవెంటనే కొనడమేకాదు. దాన్ని నడుంలో అణచుకుంటూ "మామీ, చూసారా, ఇది ఎంత అందంగా ఉందో?" అని ఉమా ఉత్సాహంతో గెంతులాడింది, బొమ్మని ముద్దులాడింది.

"చూడు, పాపం, పిల్లలు లేకపోవడంవలన ఆ బొమ్మని చూడగానే ఉమాకి ఎంత సంతోషం!" అన్నారు ఆ ముత్తైదువ భర్త.

"అలాగే కానీ, ఈ బొమ్మ వచ్చిన వేళ ఉమాకి ఒక మంచి పిల్ల పుట్టనీ!" అని ఆవిడ అన్నారు.

"మామీ, నేను నిజంగానే అంటున్నాను. మీరే చూడండి, ఈ కృష్ణుడి మొహం ఎంత అందంగా ఉందని!" అని ఉమా చిరునవ్వుతో అడిగింది. ఇంటికి తిరిగివచ్చినప్పుడు ఆమె మనసులో ఆ దంపతుల మాటల్లో నిజముందేమో అనే అనుమానం కలిగింది. 'అవును, అది నిజమవాలి!' అని ఆమె ఆశించిందికూడా.

ముద్దైన విగ్రహంని పూజామండపంలో చూసినతరువాత కృష్ణుడుమీద పాటలు పాడాలనే అభిలాష ఉమాకి వచ్చిందంటే అందులో ఆశ్చర్యం ఏముంది?

"కృష్ణా, నీ బేగనే బారో . . . " అని ఉమా పాడుతుంటే ఆఫీసునుంచి ఇంటికి తిరిగివచ్చిన ఆమె భర్త శంకరన్ "అరే! కొత్త కృష్ణుడికి ఈ పాత పాటేనా దొరికింది?" అని ఎగతాళి చెయ్యగానే ఉమా కొంచెం జంకింది. కాని కాలక్రమంలో ఆ సంకోచం పోయింది. 'కృష్ణుడుమీద కీర్తనలు, భజనలు - ఇవన్నీ నేను పాడాలి, నేర్చుకోవాలి!' అనే ఆవేశం ఆమె మనసుని స్వాధీనం చేసుకుంది; అంతే, ఒక నెలలోనే ఇరవైఐదు రూపాయలకి రికార్డులు కొని జమచేసేసింది!

"మనది కొత్తకాపురం, మరి కొత్తగా, మంచి రికార్డులు వద్దా? ఇంకా ఎన్నిరోజులు పాతపాటలే వినాలి? ఈ కొత్తవన్నీ అపురూపమైనవి!" అని ఉమా భర్తకి చెప్పింది. అతనూ ఆమె మాటలు ఆమోదించాడు.

పత్రికలలో, పుస్తకాల్లో కృష్ణుడుబొమ్మ చూస్తే చాలు, దాన్ని వెంటనే చింపేసి ఉమా తన ఆల్బంలో కలుపుకుంటుంది. కృష్ణుని లీలలు ఎంత సంప్రదాయేతరంగా మన పురాణాల్లో చోటుచేసుకున్నాయో, మరి ఆ విధంగానే అతని పటాలూ ఉన్నాయిగా!

4

ఉమా ఆతురతతో వాటిని వెదికి, పోగుచేసింది. అదొక అంతులేని వేడుకగా మారిందంటే అందులో ఆశ్చర్యమేముంది?

ఆమె కాచుకున్నదశరా పండుగ వచ్చేసింది. తిరువళ్ళిక్కేన్ లో బసవున్న సుందరిని చూడాలని తన భర్తతో వెళ్ళిన ఉమా ఆక్కడ పార్థసారధి ఆలయంలో బొమ్మల దుకాణాలు చూసింది. ఒక బాలుడి ఎత్తుకి తగినట్టు, గంభీరంగా తలయెత్తి, చిరునవ్వుతో, 'అల్లుడు' లాగ కనిపించే కృష్ణుడు విగ్రహం చూడగానే ఆమెకు ఒక క్షణం దిగ్భ్రాంతి కలిగింది.

"ఇది ఒకటి కొంటే చాలు! చూడండి, ఆ మొహంలో ఎంత సొగసుందో?" అని ఉమా పలవరించడం మొదలుబెట్టింది.

"అసలు ప్రజలు తిండికిలేక ఈ రోజుల్లో తహతహపడుతున్నారు! ఈ మట్టికి 10, 15 రూపాయలు మనం ఖర్చు పెట్టాలా? సరే, కొన్నాం అనుకో, దాన్ని రక్షించడం చాలా కష్టం!" అని శంకరన్ కొంచెం కఠినంగానే జవాబు ఇచ్చాడు.

ఎన్నడూ ఇంత ఘాటుగా మాటాడని తన భర్త ధోరణి చూసి ఉమా మరేం అనక ఊరుకుంది.

పదిరోజులు గడిచాయి. ఇంకా ఒక వారంలో శివరాత్రి పండుగ రాబోతుంది. 'ఆ కృష్ణుడు బొమ్మని కొందాం,' అని భర్త తనకి చెప్తాడని, లేకపోతే గభీమని దాన్ని కొని తనకి బహుమతిగా ఇచ్చి రంజింపజేస్తాడనే అల్ప సంతోషమూ త్వరలో తొలగిపోయింది.

'ఆ విగ్రహాన్ని చూస్తే చాలు, మనకి ఆకలంటే ఏమిటని తెలియదు! కాని నా భర్తకి అదొక మట్టి ముద్దగా కనిపిస్తోంది; ఆ మొహంలోని లాఘువం, అందం అతనికి అర్థం కాలేదు. ఆలాగ చూస్తే ఒక రోజు మన దేహంకూడా ఒక పిడికిలి బూడిదేకదా? అతనికలా తోచలేదు. అతను ఆ బొమ్మ కొనడం ఏనాడూ జరగదు!'

ఉమా ఇలా మనోవ్యధతో బాధపడుతుంటే, నవరాత్రి పండుగకి బహుమతిగా పుట్టిల్లునుంచి ఆమెకి బహుమతిగా ఇరవైఐదు రూపాయలు వచ్చాయి.

అంతులేని ఆశతో, ఊమా తను ఉన్న అదే వీధిలో నాలుగిళ్ళుదాటి నివసించే రామయ్యరు ఇంటిలోని పదునాలుగేళ్ళ బాబు దారితోడుగా తిరువల్లిక్కేణి బొమ్మల

5

దుకాణంకి వెళ్ళి, పదిహేను రూపాయలకి ఆ పెద్ద కృష్ణుడి బొమ్మ, మరికొన్ని చిన్న కృష్ణుడు బొమ్మలు కొని ఇంటికి తీసుకువచ్చింది. కాళింగ నర్ధనుడు; గోపాల కృష్ణుడు; బాలగోపాలుడు; వెన్న తింటున్న బాలకృష్ణుడు; రాధాలోలుడు; ఇలాగ వాటి మధ్య తన నానావిధ స్వరూపాలని ప్రత్యక్షంగా చూపుతూ నిలబడి తన్ను ఆకర్షించిన ఆ కృష్ణుణ్ణి చూసి ఉమా మురిసిపోయింది; తన బిడ్డలోని అన్ని ముచ్చటలూ చూస్తున్న తల్లికి ఏర్పడే గర్వం ఉమా మనసులో చోటుచేసుకుంది.

"నీకు పిచ్చి ఇంత మితమీరి పోయిందా?" అని శంకరన్ క్రూరంగా పలికిన మాటలు ఉమా చెవులకి అందాయి. భర్త బొమ్మలు కొనడు; తన భార్య తనకి వచ్చిన డబ్బుతో బొమ్మలు కొనడమూ  అతను ఇష్టపడడు, అవును, అది అతని స్వభావంకి విరుద్ధం కదా? కాని తనకి ఆశ ఉందే! ఉమా ఏమీ అనక ఊరుకుంది. అందువలన అతనూ ఏమీ అనలేకపోయాడు. కృష్ణ బృందం వున్న మేజా హాలులో ఒప్పుగా కనిపించింది. సాయంకాలం దీపం వెలిగించడం, పువ్వులూ, అగరువత్తులతో పూజ - అవన్నీ ఇప్పుడు దేవుడి పీఠంనుంచి ఆ మేజాకి వచ్చేసాయి.

"నీకేం ఆ మీరాభాయ్ లాగ ఐపోవాలని ఉందా?" అని భర్త ఒక రోజు ఎత్తిపొడిచినా ఉమాకి ఆ మాటల్లోని గూఢమైన అర్థం తెలియలేదు.

"ఆ వేణుగోపాలుడిని గుర్తుచేసుకొని ఈ ముచ్చటలన్నీ కావాలంటున్నావా?" అని భర్త ఒకరోజు అడగ్గానే ఉమా ఉలికిపడింది.

'దేవుడా, ఇదేం విపరీతబుద్ధి? ఎందుకితనికి మనసులో ఇలాంటి ఆలోచనలు?' అని ఉమా తన్ను తానే అడుక్కుంది.

"ఉమా, నీకు ఆ వేణుగోపాలన్ అంటే అపేక్ష కదూ? ఆఖరికి సగోత్రం అని తెలిసిన కారణం వలనే అ సంబంధం జరగలేదని విన్నాను. 'అలాగయితే నీ మనసూ మారిపోతుందా?' అని నాకనిపించింది" అని దీపావళి పండుగకి వచ్చినప్పుడు శంకరన్ భార్యని అడిగాడు.

"ఇప్పుడెందుకు దానిగురించి? దయచేసి అలాగేం అడగవద్దు! ఉమాకి తగిన భర్త మీరే అని మీ పేరే చెప్తోంది. అతని పేరు అతను నాకు అన్నయ్య అని చెప్తోంది," అని ఆ రోజు ఉమా భర్తకి చెప్పింది.

6

అవును, మనసంటే చోద్యమే!

భర్తతో ఐదు సంవత్సరాలు కాపురం చేసినతరువాత తన మనసులో ఆ పాత భ్రాంతి లేవడం సాధ్యమా? 'అవును, సాధ్యం!' అనే అనుమానం ఇన్ని రోజుల తరువాత తన భర్తకి వచ్చేసింది. ఐదు సంవత్సరాల దాంపత్యంలో ఆమెలో ఎటువంటి ఆశాపాశాలు ఉన్నాయని అతను గ్రహించలేకపోయాడు. ఇద్దరిలోనూ ఆ లోపం చోటుచేసుకుంది. ఆమె స్త్రీ, ఉమా గుర్తుచేసుకుంది, కాని భర్తకి అది తెలియజేయడం కష్టం!

'పిల్లలు పుట్టనంతవరకూ మంచిదే!" అని మనఃపూర్వంగా ఆమె నమ్మింది. అదే ఉమా ఇతరులకీ, తన భర్తకీ చెప్పింది. కాని ఇప్పుడు 'సంతానం కావాలి!' అనే తృష్ణ తనకి వచ్చేసిందని సాహసంగా భర్తకి ఎలాగ చెప్తుంది?

'చెప్పాలా, వద్దా?' ఈ ఉభయసంకటంలో చిక్కుకొని ఉమా బాధపడింది. అసలు నిజమేమిటో తెలియక శంకరన్ భార్యని పైబడుతూనే వచ్చాడు. రానురాను ఈ సంఘర్షణలు మరీ చెడ్డగా మారాయి.

'బాలకృష్ణుడిని నేను కొనియాడినప్పుడు నా భర్త నన్ను అపార్థం చేసుకోలేదు. ఐతే ఇప్పుడు నేను కృష్ణుడికి అల్లుడనే పెత్తనం ఇచ్చినట్టు అతను చిరాకు పడుతున్నారు. అతనేం తప్పు చెయ్యలేదు!' అని గుర్తుచేసుకొని ఉమా వినయం, ఓపికతోనే రోజులు గడుపుతూ వచ్చింది. భర్త భావన ఆమెకు నచ్చలేదు, కాని దాన్ని తొలగించుకోవడం తనవల్లకాదని తెలుసుకొని బాధపడింది.

ఇంతలో అదృష్టవశంగా - దాన్ని ఎలా వర్ణించడం? - దేవుడి కృప; ఆ దంపతుల వొద్దిక; లేకపోతే ఉమా మనసులోని తీవ్రవాంఛ; ఇవన్నీ కలిసివచ్చి ఉమా కోరిక సఫలమయే సూచనలు కనిపించాయి.

ఆ శుభవార్త భర్తకి చెప్పినప్పుడు ఉమా "ఆ బాలకృష్ణుడు విగ్రహం చూసిన తరువాతే నాకలాంటి పిల్లవాడు కావాలనే పిచ్చి వచ్చింది!" అని నవ్వుతూ అంది.

"అందుకే, బిడ్డకి వేణుగోపాలన్ అని పేరు పెట్టేయ్! వాడి జ్ఞాపకమూ ఉంటుంది!" అని భర్త ఎగతాళి చేసాడు. అప్పుడే తన భర్త మనసు ఎంత లోతుగా ఆ ముట్టడిలో పాతుకుపోయిందని ఉమాకి అర్థమైంది.

7

“నా మసను తెలుసుకొని నన్ను ఏలుకున్నావ్. ఐతే నేను ముందు ఆశించిన కోరిక సఫలమవకుండా నన్ను కాపాడు! దయచేసి నాకు ఆడపిల్లనే అనుగ్రహించు; నా ఉల్లాసభరితమైన జీవితం పాడుచెయ్యకు!” అని ఉమా మనసార వేడుకుంది.

“సుందరీ, నేను నా మనసుని ఎప్పుడో మార్చుకున్నాను!” అని ఊమా చెప్పుకోలేదు!

స్వరాజ్యలక్ష్మి తన్ను అధిగమించి పుట్టిందని ఉమాకి తలవంపా? లేదు, గర్వమే! ఇప్పుడు ఉమాలో స్పందించేది మాతృహృదయంకదా?

********

**(మూలం ప్రచురణ. సిరుకద్రై, అక్టోబర్ 15, 1947)**

8

# ప్రేమ ఉన్న చోట . . . ?

'ఆరోగ్యంకి మించిన ఆస్తి మరొకటి లేదు!' అన్నారు పెద్దలు. కాని అటువంటి బతుకు నాకు కటువుగా కనిపించింది. వయస్సు పద్దెనిమిది దాటినవరకూ ఏ జ్వరమూ, రోగమూ నన్ను తాకలేదు. ఏ నాలుగురోజులు కలిసి అనారోగ్యంతో ఎప్పుడూ విశ్రాంతి తీసుకోలేదన్న కారణంవలనే నాకు జీవితమంటే ఏవగింపు వచ్చేసింది. 'నాకూ జ్వరం వచ్చి నేనూ మంచమెక్కుతే త బాగున్ను!' అని నొచ్చుకున్నాను.

'ఈ ఊరులోనే ఉంటున్న, పేరు మోసిన కుటుంబంకి చెందిన, నిత్యమూ ఆకర్షణీయంగా కనిపించే బ్రహ్మచారి డాక్టరు రఘునాధన్ చేతుల్లోనుంచి మనకి మందు దొరికితే ఎంత బాగున్ను!' అనే ఆకాంక్ష నాలో లేచింది. అతను తన చికిత్సమూలంగా ఊరులోవున్న చాలామందిని - మగా, ఆడా, వృద్ధులు అనే భేదం లేకుండా తాకడం చూసాను. 'మరి రెండు సంవత్సరాలుగా అతన్ని నా మనసులో ప్రియుడిగా కొనియాడుతున్న నాకు రోగి అనే వంకలో అతనితో ఓ రెండు నిమిషాలు ముచ్చలాడే అదృష్టం దొరకదా?' అని తపించిపోయాను. అందులో తప్పేముంది? స్వచ్చందంగా నాకూ రోగం రావాలని నేను కోరాను. మా ఇంటిలో మా అమ్మమ్మ, నాన్నగారు, అమ్మ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళు, వేరేవేరే సమయాల్లో, వేరే వేరే విధంగా డాక్టరు రఘునాధన్ దగ్గర చికిత్స అందుకున్నారు. ఐతే నేను నా మనసులో ఒక గుడి కట్టుకొని అందులో నా ఇష్టదేవతగా పూజించుతున్నా ఏ జబ్బూ నన్ను అంటుకోలేదని బాధపడ్డాను.

డాక్టరు రఘునాధన్ మెడికల్ ప్రాక్టీసు ఆరంభించిన రెండున్నర సంవత్సరాల్లోనే - యౌవన దశలోనే - తన సభ్యత, నైపుణ్యం వలన మంచి పేరు సంపాదించుకున్నారు. ఊరులో అందరి అభిమానం, గౌరవంకి అతను పాత్రులయ్యారు. త్వరలోనే మా Family Doctor గా, రెండు సంవత్సరాలుగా మా ఇంటికి రావడం మొదలుబెట్టారు. అతను రోగిని పరీక్షించి, మాటలాడి, ధైర్యం చెప్పి, చికిత్సగురించి వివరాలు చెప్పే ధోరణి చూసి నేను మురిసిపడేదాన్ని. నా ఉత్సాహం వట్టిపోకూడదని నేనతన్ని దూరంనుంచి చూస్తూంటే అతనూ నన్ను దీర్ఘంగా చూసి ఆ చోటునుంచి కదిలేవారు.

ఇంతకుముందే, అతన్ని చూసిన రోజుల్లోనే, నాకు అతనిమీద మోజు, మంచి అభిప్రాయం చోటుచేసుకున్నాయి. ఇప్పుడు అతని తళతళలాడే చూపులో నాకున్న నిగ్రహం కూలిపోయింది. నా మనసు అతన్నే శరణువేడుకుంది. డాక్టరు రఘునాధన్ మా ఇంటికి వచ్చివెళ్ళినప్పుడల్లా నేనతని చూపుని గుర్తుచేసుకొని హర్షించడం నాకు అలవాటైపోయింది.

'నాలాగే అతనికీ నామీద అభిమానం ఉందా?' అనే ఆలోచన రాగానే, 'ఆహా, అవును, తప్పకుండా!' అని నాలో నేనే గర్వపడతాను; వెంటనే ఊహాలోకంలో నా సంచారం ఆరంభమౌతుంది. పెళ్ళైనతరువాత మా దాంపత్యం గురించి రకరకాల ఘటనలు కల్పించుకొని ఆనందిస్తాను.

నా బాల్యంలో ఎవరో మా నాన్నగారికి నాకు రాబోయే భర్త ఒక డాక్టరుగా వస్తారని చెప్పారట. "ఓ, అలాగా? ఇవన్నీకూడా మన జాతకాలు చెప్తాయా?" అని నాన్నగారు అతన్ని అడిగారట, ఆలోచించారట; నాకూ నా రాబోయే భర్తగురించి ఎటువంటి పెద్ద ఆలోచనా లేదు.

కాని డాక్టరు రఘునాధన్ మా ఊరులో మెడికల్ ప్రాక్టీసు ఆరంభించి, మా ఇంటికి తరచుగా రావడం చూసినతరువాత నాకూ 'ఇతనే భవిష్యత్తులో మన భర్త కాబోలు!' అనిపించింది. 'ఆహా, అది నిజమౌతే ఎంత అదృష్టం!' అనే ఆలోచనే మొట్టమొదట నా మనసులో మా ఇద్దరిమధ్యా ప్రేమానురాగాలకి విత్తనం జల్లింది. క్రమక్రమంగా అతను మా ఇంటికి రావడం, ఒక కాంతశక్తితో అతను నన్ను చూడడం, ఆ తరువాత రాత్రీ పగలూ ఏపుగా పెరిగే మొక్కలాగ నా మనసులో ప్రేమ రేకెత్తడంనేను గుర్తుచేసుకున్నాను.

బాహటంగా అతని ధోరణిలో ఎటువంటి చలనం, మార్పు కనిపించకపోయినా అతని మనసులో నాగురించి ఆసక్తి ఉందేమో అనే భావనతో మా దాంపత్య జీవితం గురించి కలలు కంటూనే కాలం గడిపాను.

ఐతే కలలు ఎన్ని రోజులకి సాగుతాయి?

ఒకరోజు ఎవరో మా అమ్మతో "ఏమండీ, మీ అమ్మాయికి రఘునాధన్ సంబంధం చూడవచ్చుకదా?" అని అడగడం విన్నాను. కన్యగా పెరుగుతున్న రోజుల్లో పెళ్ళిగురించి

ఎవరేమన్నా దాన్ని వినడానికి నాకూ పాముచెవులున్నాయిగా? వాళ్ళ సంభాషణ విన్నాను.

మొదటినుంచే నా మనసులో ఒక ప్రశ్న పటాకిలాగ రేగడం నాకు తెలుసు. పెళ్ళి సంబంధాలకి ఈ ఊరులోనే మంచి వరులున్నారే? మరెందుకు మన తల్లిదండ్రులు ఎక్కడెక్కడో వెతుకుతున్నారు? రఘునాధన్ అంటే వాళ్ళకెందుకు ఆక్షేపణ? ఆ కారణంవలనే ఇప్పుడు 'సరే, వాళ్ళ మనసులో ఏముందో తెలుసుకుందాం!' అని ఆతురతతో అమ్మ చెప్పే మాటలు వినడానికి నేను సిద్ధమైయ్యాను.

“అవును, మేం అడగవచ్చు. కాని వాళ్ళు ఏమంటారో ఎవరికి తెలుసు?వాళ్ళ హోదాతో పోల్చుతే మనం ఏ మూల? ఎవరికి ఎక్కడ ప్రాప్తముందో?”

రఘునాధన్ తన తల్లిదండ్రులకి - ముగ్గురు కూతుర్లమధ్య - ఒకడే కొడుకు; అతనికి మంచి ఆదాయం ఉంది. అవును, అది చాలా పెద్దింటి సంబంధం; అతను మా ఇంటి అల్లుడుగా రావడం దుర్లభం అని అమ్మ భావన.

“వాళ్ళని అడగడానికి మనకేం నోరుందా?” అని అమ్మ మాటలు వినగానే నాలో చిరాకూ, నిరాశా చోటుచేసుకున్నాయి.

'పెళ్ళి సంబంధం అంటే అదేదో సమఅంతస్తులమధ్యనే జరగాలని శాస్త్రమేదైనా ఉందా ఏమిటి? మీరుగాని నోరు తెరిచి ఒక మాట అంటే ఈ సంబంధం సాధ్యం కాదా? మనం ఉత్తికే కూర్చుంటే వాళ్ళు వారంతటవారే వస్తారా? ఆడపిల్లలు కన్నవారు ఇలావుంటే మరి అబ్బాయిలని కన్నవారి ధోరణి ఎలావుంటుంది?'

నేనీ ఆలోచనతో బాధపడుతూ రోజులు గడిపాను.

ఆ రోజునుంచి అమ్మ అన్న మాటలు నేను పదే పదే గుర్తుచేసుకున్నాను: 'అవును. ఈ సంబంధం జరగవచ్చు; కాని అసలు జరుగుతుందా?'

అనుమానం ఊహాలోకంకి దారితీసినట్టే ఆందోళనూడా మనసుని అల్లకల్లోలం చేస్తుంది.

'ఈ రోజుల్లో ఎంతమంది డాక్టరు చదువు చదువుతున్నారు! మరెవరో డాక్టరు నా జీవితంలో జొరపడతారు కాబోలు! రఘునాధన్ అసలు నా భర్త కాదేమో?'

అటువంటి ఆలోచన రాగానే నా దేహమంతా వణుకుతుంది; రఘునాదన్ కి బదులు మరెవరికీ నా మనసులో చోటు లేదు. అదెలాగంటే పూర్ణచంద్రుడిని చూస్తే మనకి అతనితోబాటు వెన్నెల కనిపించినట్టు . . .

'అతనికి నేనంటే ప్రియమా? తనంతట తనే ముందుకు వచ్చి నన్ను పెళ్ళిచేసుకుంటే?' ఆ భావనతో నా మనసు కొంచెం కుదుటబడుతుంది. కాని నిర్మలమైన చోటులో రవంత మైల పడినా, కళంకంలేని మనసులో ఏ మాత్రం అనుమానం చొచ్చుకున్నా, అబ్బబ్బా! అదొక చిత్రవధ! ఆ యాతన ఎలా వర్ణించడం? రానూ రానూ నాలో మనశ్శాంతి బాగా జారుకుంది.

ఇంతకీ 'అతనికి నేనంటే ఇష్టం లేదేమో?' అనికూడా నేను ఆలోచించాను; నాకతని చూపు జ్ఞాపకం వచ్చినప్పుడెల్లా ఆ భావనే ముందువచ్చి నిలబడింది. చంద్రుడు తన కళలన్నీ కూడబెట్టుకొని ఉదయించడం మనకి తెలుసు; కాని పూర్ణగ్రహణంలో ఆ వెన్నెల కనిపించదే?

'బాగుంది! అతన్నీ, ఆ చూపూ చూస్తే మనకన్నీ బోధపడినట్టేనా?అసలు అతను నన్ను మాత్రం ఇలా చూస్తున్నారో, లేకపోతే అందరు ఆడపిల్లలూ అతనికి ఇలాంటి దృష్టిలోనే కనిపిస్తున్నారేమో, ఎవరికి తెలుసు? అతనికున్న కీర్తివలన ఈ ఊరులోని ముప్పావు వంతు ఇళ్ళలో రోజూవారి ఎన్ని అమ్మాయిల చేతులు అతను చూస్తున్నారో? ఎంతమంది మనసులో అతను చొచ్చుకున్నారో? ఏ అమ్మాయి ఇతనిదగ్గర చికిత్స అందుకొని ఇతని మనసు ఏలుకుందో? నేనితన్ని చూసి ఆహ్లాదించడం దూరంనుంచి; మరి, ఇతనికి చేరువలోవున్న ఏ అమ్మాయి ఇతని మనసు స్వాధీనం చేసుకుందో ఎవరికి తెలుసు? దూరంలో కనిపించే ఇతను నన్ను ఆకర్షించగలిగారంటే మరి అతనికి సన్నిహితమైన స్త్రీల వ్యామోహం గురించి చెప్పాలా ఏమిటి? అతని చూపంతా ప్రత్యేకంగా నాకే అని నేను మురిసిపోవడం న్యాయమేనా?

ఇటువంటి అనుమానంతో పుట్టిన నా అలసట నాకూ జబ్బు రావాలని కోరుకుంది.

ఏది చూసినా నాకు కటువుగా కనిపించింది.

'అతని ధ్యానమంతా నామీదే పడాలి; అయ్యో, నాకేదైనా రోగం రాకూడదా? అతను నా నాడి చూస్తున్నప్పుడు నేను అతని మనసుని నావశం చేసుకుంటాను.'

ఇదే నా పథకం; అది నెరవేర్చే మార్గం లేక భగవంతునిపై నిందమోపాను.

'దేవుడా, ఎందుకు నాకీ స్వస్థమైన బతుకు?' అని మొరబెట్టుకున్నాను. కాని జరిగేదంతా మన మంచికే అని రాజు-మంత్రి కథల్లో వర్ణించినట్టు నా జీవితంలోనూ ఒక ఘటన జరిగింది; మన పురాణాలు ఘోషించే సత్యం నేనూ విన్నాను.

ఒక రోజు రఘునాధన్ నుంచి మా నాన్నగారికి ఒక ఉత్తరం వచ్చింది.

"మీ అమ్మాయిని నా భార్యగా ఏలుకోవాలని అభిలాష. అందుకు మీరు ఏకీభవిస్తారా?" అని అతను అడిగారు. ఎంత ఆశ్చర్యం!

నేను సరేనని చెప్పాలనే నా తల్లిదండ్రులు ఎదురుచూసారు; అమ్మ నన్ను అడిగింది.

"నీకేం ఆక్షేపణ లేదుకదా?" అని అడిగినప్పుడు నేను మెల్లగా "లేదు" అనే అన్నాను. "నాకసలు చాలా ఇష్టం అనే మాటలు తొందరగా, సంతుష్టితో అనాలని నాలికవరకూ వచ్చేసాయి. కాని నాది ఆడజన్మ కదా? అలా అనలేకపోయాను. ఉప్పొంగుతున్న ఆనందం అణచుకున్నాను.

త్వరలో మా పెళ్ళి జరిగింది; నూతన వధూవరులుగా మేం శోభించినా నాకోక ప్రశ్న అడగాలని ఆరాటం కలిగింది.

ఇతనికి అసలు నాలో కనిపించిన శ్రేష్టత ఏమిటి? ఇతనేకదా తనంతట తనే నన్ను వరించివచ్చారు? మా ఇంటిలోవున్న అందరినీ ఒప్పించాలని ఈ పట్టుదల ఇతనికి ఎలా వచ్చింది? వాకు తెలిసి ఇతను అమ్మణి, సరసు, సులో - వీళ్ళందరికీ చికిత్స చేసివున్నారు; వాళ్ళందరినీ అందగత్తెలని వర్ణించవచ్చు. అందంలో నన్ను మించిన కన్నెలని అనవచ్చు. వాళ్ళ తల్లిదండ్రులుకూడా నా తల్లిదండ్రులతో సరిపోల్చుతే ఏమాత్రం తీసిపోరు. ఆ అమ్మాయిలకి చికిత్సచేసిన తరువాత, ఆ పరిచయం వలన వారందరిమీద ఇతనికి అభిమానం తగ్గిందా? ఆ కన్యలలో ఎవరినీ పెళ్ళిచేసుకోవాలని అతనికి తోచనేలేదే?

ఇదెలా మావారితో అడిగి తెలుసుకోవడం? హారతిలో సున్నం, పసుపూ కలిపినట్టు అతనితో ఏమేమో రెండు మూడు సంగతులు మాటాడుతున్నప్పుడు దిశ మార్చి ఆఖరికి అడిగేసాను.

"అయ్యో సరూ, నీకు నా మనసులో ఏముందో అర్థం కాదు!" అన్నారు ఆతను.

"అదేదో తెలియజేయకూడదా?" అని బతిమాలాను. 'ఆ అమ్మాయిలని చూసికూడా నా మనసు లొంగిపోయింది!' అని అతను అంటారేమో అని నాకు దిగిలు!

"సరే, చెప్తాను, విను. ఆ అమ్మాయిలు అందగత్తెలే కావచ్చు; వాళ్ళ తల్లిదండ్రులకి ఆస్తి, ఐశ్వర్యం అమితంగా ఉండవచ్చు; కాని నాకు వాళ్ళగురించి ఎటువంటి ఆలోచనా లేదు! వాళ్ళ అనారోగ్యమే నా మనసులో స్థిరంగా నిలిచిపోయింది: ఒక అమ్మాయికి ఏది చూడాలన్నా భూతద్దాలవంటి కళ్ళజోడు కావాలి! ఇంకొక అమ్మాయికి బక్కచిక్కిన దేహం; ఎన్ని మందులూ, టానిక్కులూ మింగినా ఆమెలో రవంత లాఘవం, చురుకుతనం కనిపించదు! ఒక పిల్లకి ఎప్పుడూ జ్వరం; మరొక అమ్మాయికి రెండు మాసాలకొకసారి చెవుల్లో, లేకపోతే కళ్ళలో నొప్పి! అందువలనే నా మనసులో వాళ్ళెవరికీ చోటులేదు."

ఆ తరువాత అతను నన్ను చూస్తూ మాటాడారు:

"నా వృత్తే నాకొక స్వయంవరంగా ఐపోయింది. రోజువారి రోగులతో సంప్రదించే నాకు నా ఇంటిలో శాంతి, ప్రశాంత అనుభవించడానికి ఆరోగ్యమైన భార్య కావాలని నేను నిశ్చయించాను. నా స్నేహితుడు ఒకతను "ఒరేయ్, అదంతా పగటికల!" అని అనగానే అది నిజమౌతుందేమో అని నేను భయపడ్డాను. కాని రెండు సంవత్సరాలు మీ ఇంట్లో నిన్ను తప్పిస్తే అందరికీ చికిత్సచేసాను. నీకు ఒక మొతాదుకూడా ఇవ్వలేదు. నీ తమ్ముడికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. కాని అది నిన్ను తాకలేదు; నువ్వు ఆరోగ్యవంతురాలు అని నాకు అప్పుడే తెలిసింది. మీ నాన్నగారిని అడుగుదాం అని అనుకున్నాను. 'సరేలే, ఎందుకైనా నాలుగు మాసాలు కాచుకొనివుందాం, నీ ఆరోగ్యం ఎలాగుందో చూద్దాం!' అని ఆలోచించాను. ఆ తరువాత దగ్గరకి రాగానే, ఇక తాళలేక మీ నాన్నగారికి ఉత్తరం రాసి, అతని అనుమతి అడిగేసాను!" అని అంటూ నవ్వారు.

'ఆహా, ఇతను ఎటువంటి ఆదర్శ భర్త!' అని నాకు మావారిమీద గర్వం కలిగింది. ఆ రోజు నేను దేవుణ్ణి నిదించలేదూ? 'నేను కోరినట్టు నన్నుగాని జ్వరమో జలుబో పీడించివుంటే ఇతను నన్ను లెక్కజేసేవారా?' అని ఆలోచించాను; దేవుడిపై నాకు భక్తి కలిగింది.

శ్రీమతి రఘునాధన్ గా నేను రెండు సంవత్సరాలు హాయిగా గడిపాను.

మావారికి బెంగళూరులో, ఒక పెద్ద హాస్పిటల్లో పని చెయ్యడానికి పిలవడంతో మేం మా కాపురం మా సొంతవూరునుంచి బెంగళూరికి మార్చుకున్నాం. అతని తల్లిదండ్రులు, ఆఖరి ఇద్దరు కొమార్తెలు, సొంతవూరులోనే ఉండిపోయారు.

అక్కడకి వెళ్ళిన కొన్ని మాసాలలోనే నాకు చికాకు పుట్టేసింది. కారణం: ఒంటరిపాటు. మావారు ఎల్లప్పుడూ హీస్పిటల్ పనిలో మునిగిపోయారు. నాతోకలిసి ఏవో రెండు మూడు నిమిషాలు మాటాడడానికి, భోజనం చెయ్యడానికికూడా అతనికి అవకాశం దొరకలేదు. అస్తమానం ఏదో ఒక బాధ్యత, రోగి, అతన్ని తరుముతూ వచ్చింది.

ఇవన్నీ నాకు నచ్చనేలేదు. కాని నేనేం చెయ్యగలను? అతను ఉద్యోగం చేస్తున్నారు, తన బాధ్యత నిరవేస్తున్నారు. 'వొద్దు!' అని నేను ఎలా చెప్పడం? అలా చెప్పవచ్చా?

ఆఖరికి నాకున్న కొరత వేరే విధంగా మారింది: 'సరే, ఇతను ఈరులో అందరికీ చికిత్స చేస్తూవుండనీ! మనతో ఏ పొత్తూ వద్దు!' అని నేను వాపోయాను.

'మనకీ జ్వరం, జలుబు, అని ఏదైనా వస్తే ఏవో ఐదునిమిషాలు మనతో మాటాడతారు; కాని నాకు అవేం రావుగా? తన వ్యక్తగత జీవితంలో, తన భార్యకి ఒక మోతాదు మందుకూడా ఇవ్వకూడదని, అందుకు పదినిమిషాలు ఖర్చు చెయ్యకూడదనే భావనతోనేకదా అతను నన్ను పెళ్ళిచేసుకున్నారు? సరే, అలాగే కానీ! నాగురించి ఏ ఆలోచనా లేకుండా ఆ హాస్పిటల్ నర్సులతో అతను సరసమాడనీ! మనం ఎలాపోతే ఎవరికి లెక్క?' అని నా మనసు నన్ను పీడించింది.

క్రమక్రమంగా ఈ వ్యధ తీవ్రమైన అనుమానంకి దారితీసింది: 'ఏమైనా సరే, డాక్టరులని నమ్మవచ్చా? వాళ్ళు నర్సులూ, లేడీ డాక్టర్ల వలలో పడకుండా ఉండగలరా?' ఎందుకోగాని నా మనసు నేనేదీ నమ్మకూడదని నన్ను హెచ్చరించింది. నా ఏకాంతవాశం వలన నా మనసులో శాంతి లేదు; మొహం వాడిపోయింది. హాస్పిటల్లో మావారిచుట్టూ రోగులూ, నర్సులూ గుమిగూడివున్నారనే ఆలోచన రాగానే నాకు పట్టరాని కోపంతో 'నా తల బద్దలైతే ఎంత బాగున్ను! ఎందుకీ బతుకు?' అని చికాకు కలిగింది. 'నాగురించి అతనికి ఏదీ గుర్తులో లేదు, నాకెందుకీ చిత్రవధ?' అనే ఆత్మనింద మాత్రం మిగిలింది.

ఒక రోజు నాకు తెలియకుండానే నేను కన్నీరు కార్చుతున్నాను; పాతజ్ఞాపకాలు నా విచారంకి కారణం. ఇంటిలోనూ, బయటా, విద్యచ్ఛక్తి వలన అంతా కాంతిగావుంది. కాని

నన్ను ఎవరో చీకటిలో అడవిలో వదిలేసినట్టు భ్రమ కలిగింది; ఏవో వికారమైన ఆలోచనలలో పడిపోయాను.

“సరూ!” అని ఎవరో బిగ్గరగా పిలిచారు; తిరిగి చూసాను.

“ఎందుకు? నువ్వు ఏడుస్తున్నావా? వింతగా ఉందే?”

“అవును. మీకెందుకు వింతగా కనిపించదు? మీ కళ్ళు నామీద పడితేనేకదా నేను రోజూ ఏడ్చి ఏడ్చి చిన్నబోవడం మీరు చూడగలరు? ఇవాళ ఆశ్చర్యంగా ఇంటికివచ్చి నాతో ఏవో రెండు మాటలు అన్నప్పుడే, నన్నూ, నా ఏడ్పునూ చూసారు.”

ఆవేశం నన్ను కప్పుకుంది; అరుస్తూ మళ్ళీ ఏడవడం ఆరంభించాను.

“అరేరే . . . నువ్వు రోజూ ఏడుస్తున్నావా? ఏం, ఎందుకు?” అని అడుగుతూ అతను నా పక్కన వచ్చికూర్చున్నారు.

నా మనసు కొంచెం కుదుటబడింది; మెల్లగా మాటాడానికి వీలయింది.

“నేనూ మీ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తాను; ట్రెయినింగుకి ఏర్పాటు చేస్తారా?”

“సరూ, ఎందుకు నీకు ఈ విపరీత ఆశ?”

“ఇందులో విపరీతం ఏముంది? నర్సుపని అంటే ఎంత గొప్ప! మిమ్మల్ని, మీతో పనిచేసే నర్సులనీ - ఆ దేవమణి గురించి - నిత్యమూ పొగడుతున్నారుకదా?” అని కొంచెం నిష్ఠూరంతోనే అన్నాను.

“అంటే? . . .”

“నేను నర్సుగా వచ్చి పని చేస్తే మీకు నాగురించి జ్ఞాపకం ఉంటుంది. నా ఉనికి మరచిపోరు! ‘నా వలన మీకేం బాధ రాకూడదు. ఏదో చిన్న ఉపకారం చెయ్యకలిగితే మంచిదికదా?’ అని అంటున్నాను. అప్పుడైనా మీరు నన్ను నిర్లక్ష్యం చెయ్యరని నాకనిపిస్తుంది,” అని ఎడతెగకుండా వాదించాను.

‘అబ్బా, ఇదెన్ని మాటలు చెప్తోంది! దీని మనసులో ఎటువంటి ఆలోచనలు!’ అని అతనికి ఒకటే విడ్డూరం కాబోలు! కొంతసేపు ఏమీ అనకుండా అతను ఊరుకున్నారు.

ఆ తరువాత “సరూ, నాకంతా బోధపడింది; నువ్విక ఒంటరిగా బాధపడకూడదు! నిన్నూ ఒక నర్సుగా చేస్తాను!” అని అంటూ నా చెయి అందుకోడానికి ప్రయత్నించారు.

“ఆహా, ఎంతచక్కగా నా మనసు మీరు గ్రహించారు!” అని నేను చిరచిరలాడాను.

'ఇతనికి అసలు నర్సు, నర్సు వేసే దుస్తులతో అంత మోహం అన్నమాట!' అని నాలో విసుగ్గున్నాను.

'నేనేం మీ దేవమణి కాదు!' అని మండిపడుతూ నా చెయి లాగ్గున్నాను.

"సరూ . . . " అంటూ అతను తన జాగానుంచి లేచారు. "నేను నీ అనుమానం పోగొట్టాలని వస్తే నువ్వేమో నా మొహం చూసికూడా మాటాడవా? నీ మనోవ్యధ పోవాలని వస్తే నన్ను తరుముతున్నావ్. సరే, నేను పోనా? చంచలమైన యౌవనావస్థలోనే నేనెటువంటి పిచ్చిపనులూ చెయ్యలేదు. ఇప్పుడు పెళ్ళయి - నువ్వు భార్యగా వచ్చిన తరువాత - నేను మేరమీఋతానంటున్నావా? అది వొత్తి పిరికితనం! నేను చెప్పవలసినదేదో చెప్పేసాను! ఇక, వెళ్తాను!" అని అన్నారు.

'ఆహ్, చెన్నపట్టంలో ఇతను చూడని అమ్మాయిలా?మెడికల్ కాలేజీలో ఎన్ని కన్నెలతో కలిసిమెలిగారో? ఆ సమయంలో అతనికి ఎంత దృఢమైన మనసు! ఆ తరువాతనేకదా మన ఊరులో డాక్టరుగా పనిచేస్తూ నన్ను పెళ్ళాడారు? నేనెందుకు ఇలాంటి మనిషిని దూషించాను?' అని ఆలోచిస్తూంటే నేను ఇదివరకూ ఏదో ఒక దివ్య సందేశం విన్న భక్తుడిలాగ స్తంబించిపోయాను.

"ఇక వెళ్తాను!" అని అతను చివరికి అన్న మాటలతో నాకు మెలకువ వచ్చింది.

"అయ్యో, వద్దు!" అని అరిచాను.

"అలాగైతే దగ్గరకి రావచ్చునా?"

అదేం ప్రశ్న? నేనేం చెప్పను?

"నన్నొక నర్సుగా మార్చుతే నా మనోవ్యధ మాయమౌతుందని అంటున్నారు. అంటే నా మనసుని మీరు అంత చక్కగా గ్రహించారన్నమాట! అదే నేను సహించలేకపోయాను!" అన్నాను కొంతసేపు తరువాత.

"నేను ఏ అర్ధంలో అలాగన్నాను అని నీకు బోధపడలేదు; అబ్బా, అంతలోనే నీకు పట్టరాని కోపం వచ్చేసింది!"

"ఇక నా చంటిపాపలకి నువ్వే నర్సు! తల్లికి మించిన నర్సు ఎవరున్నారు! చూసావా అప్పుడే నీ మొహంలో నవ్వూ, ఆనందం కనిపిస్తున్నాయి! నేనంటున్నది నిజమౌతే, ఇక

నన్నుకూడా మరిచిపోయి ఇక నీ ముచ్చటలన్నీ ఆ పిల్లలతోనే . . . !" అని ముద్దుగా నవ్వారు.

ఎది ఏమైనా, మా ఇద్దరిమధ్యా ఎటువంటి చిక్కులు, ప్రశ్నలున్నా, అతని ప్రేమకి నాకే అర్హత ఉంది; ఇది నిజం. 'ఈ ప్రపంచంలే ఎది అబద్ధమైనా, ఇది నిజం!' అనే భావన నా మనసులో దూసుకుపోయి అక్కడున్న గాయంని స్వస్థపరిచింది; నాకు స్వర్గలోకంలో ఉన్నట్టనిపించింది.

ఆ నమ్మకం నాకెప్పుడూవుంది; అది రోజురోజుకీ దృఢమౌతోంది: కాని ఒక సంగతి చెప్పితీరాలి.

సహజంగా భర్తమీదున్న మితిమీరిన ప్రేమానురాగాలవలన భార్య మనసులో అప్పుడప్పుడు అసూయ, అనుమానం చోటుచేసుకుంటాయి. నేనొక డాక్టరు భార్య; ఇద్దరి పిల్లకి తల్లి; మరి నాగురించి వేరే చెప్పాలా? అటువంటి సమయాల్లో నేను నాకు తోచే కొరతలు, అనుమానాలు నిర్లక్ష్యం చెయ్యను.

అతను తన రోజువారి చర్యలు, మాటలతో నా మనసులోని గాయాలు బాగుచేసి నామీద అతనికున్న ప్రేమానురాగాలు వెల్లడిస్తున్నారుకదా? అతనికి మరేం శ్రమ ఇవ్వకూడదని నా వాంఛ. ఇందులో ఆశ్చర్యమేముంది?

భార్య మనోవ్యధని అతను బాగుచేసారు; మరి ఇతరులకి అదే నైపుణ్యం దోహదం చెయ్యడంలో ఆశ్చర్యమేముంది?

ఇంటిలో శాంతి, ప్రశాంతి కావాలని అతను నన్ను భార్యగా ఎంచుకున్నారు. కాని నేను తరచుగా తికమకలు పడుతూ అతన్ని వేధించినా అతను లెక్కచెయ్యక నామీద ప్రేమ ధారపోసారు. నా మనసుని అతను పోషించిన విధం అతను ఇతరులకి చేసిన చికిత్సకంటే మేలైనది!

నా పెళ్ళికిముందే నాకతనిమీద ప్రేమ కలగడంవలనే నాకు అతనిపై అనురాగం పెనుభూతంగా వచ్చింది. దేవుడి దయవల్ల ఆ లవాటు తొలగింది. ఎంత ఆశ్చర్యం!

కాని నా కళ్ళతో నేను ఇదివరకూ తెలుసుకున్న నిజం ఇదే. ప్రేమలో ఇన్నప్పుడు మనకి తోచే కొరతలు, అవి వెంటనే ప్రేమవలనే తొలగిపోవడం ఒక పెద్ద వింత అనాలి! ప్రతీ

అనుభవం మనకి ప్రేమ ప్రభావం నిరూపిస్తుంది, ఆ వోకడ మనకి అర్ధమౌతుంది. ప్రేమకున్న శక్తిని గుర్తుచేసుకుంటే నాకు ఎంత గొప్పగా ఉంది!

********

**(మూలం ప్రచురణ: పుదుమై పెణ్, మార్చ్, 1948)**

# ఆ రోజుల్లో . . .

'ఏకాంతం ఎంత మధురం!' అని అవ్వయ్యారు[1] చెప్పిన నీతివాక్యం వినడానికి నాకూ ఎప్పుడూ ఇంపుగానే ఉంటుంది. ఈ రోజుల్లో - మన ఉరుకుల పరుగుల జీవితంలో - ఏకాంతంగా, ప్రశాంతంగా గడపడానికి - మనకెన్ని సాధనాలు ఉన్నాయి! కాని నాకు ఏకాంతంలో కలిగే మాధుర్యంకి కారణమేమిటో తెలుసా? పుస్తకాలు కాదు, సంగీతం కాదు, కుట్టుపని కాదు. గతంలో జరిగిన అనుభవాలగురించి ఆలోచించడమే!

మా పొరుగింటికి ఎవరో పడుచు దంపతులు కొత్తగా అద్దెకి వచ్చారని విన్నాను. 'పాపం, వాళ్లు ఎన్నిరోజులు ఇల్లు దొరక్క కష్టపడ్డారో? ఇకనైనా హాయిగా, సంతోషంగా ఉండనీ!' అని వాళ్లని దీవించాను. పోయిన సంవత్సరం, ఇదే సమయంలో, ఇల్లు దొరక్కుండా నేను పడిన మనోవ్యధ, ఆ తరువాత జరిగిన కొన్ని సరసమైన ఘటనలు గుర్తుచేసుకున్నాను.

అతి భయంకరమైన చీకటిని అనుసరించి వచ్చే వెన్నెల, తారల తేజస్సుని చూస్తే మనసుకి ఎంత ఆహ్లాదాంగా ఉంది! ఆ విధంగానే ఆ రోజుల్లో నా జీవితంలో వ్యసనంతోపాటు ఆహ్లాదపూర్ణమైన అనుభవాలు చోటుచేసుకున్నా, నేనిప్పుడు ఆ ఇంపైన అనుభవాలే నెమరుపెట్టుకొని ఆనందిస్తున్నాను.

కొత్తగా కళ్ళు తెరిచిన శిశువు తనలో తనే నవ్వుకున్నట్టు నేనూ ఆ పాతజ్ఞాపకాలలో పడి నవ్వుకుంటున్నాను.

ఆ సమయంలో మావారికి కొత్తగా మద్రాసులో ఉద్యోగం; అతనుమాత్రం ఒంటరిగా ఒక చోట బస ఉంటున్నారు; నేను పుట్టిల్లులో ఉన్నాను; ఇల్లు దొరక్క మేమిద్దరం కలిసివుండలేకపోయాం.

రెండు సంవత్సరాలుగా మావారు ఏవేవో  పరీక్షలకి చదువుకుంటూ ఇంకా ఉద్యోగంలో చేరలేదన్న కారణంవలన నేను నా రోజులు ఒకటి మార్చి ఒకటిగా పుట్టిల్లులో, అత్తగారింటిలో  గడిపాను. 'ఎప్పుడు మన కాపురం?' అని నాకు ఒకటే బెంగ. 'ఇల్లు దొరకడమన్నది ఒక పెద్ద ప్రశ్న,' అన్న సంగతి మరిచిపోయి

[1] తమిళ సాహిత్యంలో గొప్ప వివేకానికి, సూక్ష్మదృష్టికి పేరు పొందిన కవయిత్రి.

ఊహాలోకంలో కలలు కంటున్న సమయంలో “ఇల్లు దొరకలేదు!” అని మావారు రాసిన ఉత్తరం ఒక పిడుగులాగ వచ్చి నన్ను హడలుగొట్టింది; పేకముక్కలతో ఇల్లు కట్టుకున్న తరువాత అది కూలిపోవడం చూస్తున్న పిల్లలాగ నేను బాధపడ్డాను.

'సరే, మన ఆశలేవీ నిరవేరలేదు, నిరాశే మిగిలింది!' అని అంగలార్చుకుంటున్న నాకు మనశ్శాంతి కావాలని నేను నన్నే నిందమోపుకున్నాను. ఆఖరికి నా తెలివిలేమి ఈ గతికి కారణమని గుర్తుచేసుకొని నా నిరాశని నాలో దాచుకున్నాను. 'ఈ రోజుల్లో అల్లు దొరకడం ఎంత అసాధ్యం? అని ఎందుకు నేను ముందే ఆలోచించలేదు?' అని నన్నే తిట్టుకున్నాను.

ఎలాగో నా కలత తగ్గింది; కాని ఎన్ని రోజులకి? పది రోజులకే!

నా దూరపు బంధువు - ఒక అత్తయ్య - రావడంతో నా మనసులో అణిగియున్న భావనలు మళ్ళీ పైకి లేచాయి.

మద్రాసుకి వెళ్ళే రైలు ప్రయాణంలో వసతికోసం చాలామంది ఈ ఉరులో దిగి నా పుట్టిల్లులో కొన్ని రోజులుండి ప్రయాణం సాగిస్తారు; అలాగే ఈ అత్తయ్య కూడా మా ఇంటికి వచ్చింది.

'ఎవరెవరో మద్రాసు వెళ్తున్నారు; మనం వెళ్ళేది ఎప్పుడు?' అని నాకు ఆలోచన తట్టింది.

'ఈ రాత్రి బయలుదేరి అత్తయ్యతో మద్రాసు వెళ్తే రేపు పొద్దున్నే అతన్ని చూడవచ్చు! కాని . . . ' అని ఒక ప్రశ్న నాలో లేచింది.

'ఏం, వెళ్ళకూడదా? కాపురముంటేనే నువ్వు మద్రాసు వెళ్ళాలా? నీ పిన్ని మద్రాసులో ఉంది, అక్కడ ఉండి మీ ఆయన్ని చూడవచ్చుగా?' అని నా మనసు నాకు సలహా ఇచ్చింది.

అవును. అక్కడ నా పిన్ని ఉంది; నన్ను చూసి మూడు సంవత్సరాలయ్యాయని, నన్ను చూడాలని ఆతురతగావుందని కొన్నిరోజులముందు రాసింది. అక్కడకి నేను వెళ్ళవచ్చుగా? పిన్ని ఇంటిలో అతన్ని చూడవచ్చు. ఆ రోజుల్లో మావారు ఏదో పరీక్షకి చదువుతున్నప్పుడు మా చిన్నాన్న - తన మామగారి తమ్ముడిని - చూడడానికి తరచుగా ఆ ఇంటికి వెళ్ళేవారట; ఇప్పుడు ఉద్యోగంలో చేరినతరువాత తప్పకుండా అతన్ని

చూస్తూవుంటారు! 'అవును, నేను చిన్నాన్న ఇంటికి వెళ్తే తప్పకుండా మావారిని అక్కడ చూడగలను' అనే ఆశ నాలో మళ్ళీ మళ్ళీ లేచింది.

అవును. నేను పిన్ని ఇంటిలో ఉంటే అది సాధ్యమౌతుంది! నేను ఇక్కడ ఉంటేనేం, పిన్ని ఇంట్లో ఉంటేనేం - రెండూ నాకు పుట్టిల్లేకదా - ఎవరూ అపార్థం చేసుకోరు! నేనిప్పుడు అత్తతో మద్రాసు వెళ్తే, నా ఆశ యీడేరుతుంది, పిన్ని కోరిక సఫలమౌతుంది! అవును, నేను అత్తయ్యతో మద్రాసు వెళ్ళితీరాలి!

ఒక క్షణంలో, ఆ ఆలోచనతోబాటు వరుస వరుసగా గుమిగూడే చీమల గుంపులులాగ అనేక భావనలు నా మనసులో లేచాయి; ఐతే ఒక అనుమానం కూడా నన్ను కలత పెట్టింది: 'అమ్మా, నాన్నా ఒప్పుకుంటారా? అత్తయ్య కూడా నా ఆలచనకి అభ్యంతరం చెప్పక, మీన మేషాలు లెక్కబెట్టక సరే అంటుందా?' సరే, చూద్దాం!

డిటెక్టివ్ లాగ ఏదో అపరాధ పరిశోధనలో ఒక ముఖ్యమైన జాడ కనిపెట్టినట్టు నా ఒళ్ళు జలదరించింది. నా తల్లిదండ్రులని ఒప్పించడానికి నాకు కారణం దొరికింది; వాళ్ళు సరే అంటే మరి అత్తయ్యకి ఎందుకు ఆక్షేపణ? సరే, చూద్దాం!

ముందు అమ్మకి చెప్పాను: "అమ్మా, అత్తయ్యని రేపు ప్రయాణంకి రెడీ అవమని చెప్పు; నేనుకూడా అత్తయ్యతో వెళ్ళి పిన్ని ఇంట్లో కొన్ని రోజులు ఉంటాను."

"ఏమిటే, నీకెందుకే హఠాత్తుగా ఈ ఆలోచన?" అని అమ్మ అడిగింది.

"అల్లుడిగారికి తగిన భార్యగా ఉండాలనే . . . ." అని నవ్వుతూ అన్నాను.

అమ్మకి నా ఆలోచన ఎలాగో బోధపడిందనుకుంటాను. "సరే, వెళ్ళి రా! ఎందుకైనా నాన్నగారిని అడుగు" అంది.

అమ్మ సరే అన్న తరువాత నాన్నగారు అడ్డు చెప్పరని నాకు తెలుసు. ఈ ఇంటిలో నేను నాన్నగారి కూతురుని; అంతేకాదు, నేనేం చేసినా బాగా ఆలోచించే చేస్తాననే నమ్మకం అతనికి ఉంది.

నాన్నగారిని అడిగాను. "సరే, రైల్వే స్టేషన్ లో ఎవరు వచ్చి నిన్ను కలుసుకోవాలని రాయమంటావ్? చిన్నాన్నా లేక అల్లుడుగారా?" అని అడిగారు.

“అయ్యయ్యో, అల్లుడుగారికి వద్దు! చిన్నాన్నసే రమ్మనండి. అల్లుడిగారికి తెలియకుండా నేను చిన్నాన్న ఇంటికి వెళ్ళాలి, అక్కడ తటాలున అల్లుడుగారు వస్తే నన్ను చూసి అతను ఆశ్చర్యపడాలి! అదే నా ప్లాను, అందుకే ఈ ప్రయాణం!” అని అన్నాను.

నాన్నగారికి నా మనసు బాగా బోధపడిపోయింది. “ఓహో, అలాగా?” అని అంటూ నవ్వారు. “అల్లుడుగారికి రాయను; చిన్నాన్న స్టేషన్ కి వస్తారు” అన్నారు.

పిన్నింటిలో పిన్నితో, దాని అబ్బాయిలతో సరదాగా రెండుమూడు రోజులు గడిపాను. చిన్నాన్న సెంట్రల్ స్టేషన్నుంచి నన్ను ఇంటికి తీసుకొనివచ్చినప్పుడు నా మనసంతా మావారి గురించే. ‘నేనుగాని అతనికి ఉత్తరం రాసివుంటే అతనూ వచ్చివుంటారు, ఇంత సేపూ అతనితో మాటాడివుండవచ్చు!’ అని నాకు అనిపించింది. కాని వెంటనే “కావాలనేకదా అతనికి చెప్పలేదు? మరి ఎందుకీ చపల బుద్ధి?” అని నన్ను నేనే ఓదార్చుకున్నాను.

సొంత కూతురు లేకపోవడంవలన పిన్నికి నేనంటే చాలా అభిమానం. ఇప్పుడు మూడు సంవత్సరాల తరువాత నన్ను చూస్తోంది; దానికి నేనంటే అపారమైన సంతోషం అని వేరే చెప్పాలా!

నేను వచ్చిన కొంచెం సమయంలోనే పిన్ని అడిగిన ప్రశ్నలకి జవాబు చెప్తూ మావారు ఇటీవల మద్రాసులో ఒక ఉద్యోగంలో చేరారని చెప్పాను.

“అలాగా? నాకు తెలియదే?అతనూ ఇక్కడికి రాలేదు, నువ్వూ మాకు రాయలేదు! మరి ఇప్పుడు నువ్వు ఇక్కడ ఉన్నావని తెలుస్తే అతను ఇవాళ వస్తారేమో?”

“నేనిక్కడికి రావడం అతనికి తెలియదు పిన్నీ! నేనతనికి రాయలేదు. అతను తనంతటతాను వస్తేనే తెలుసుకుంటారు.”

“ఇదేంటే కమలం? బాగుంది! నువ్వెందుకు రాయలేదు? అతని ఎడ్రసు ఇయ్, నేను మా రాజుని పంపించి అతనికి చెప్పమంటాను.”

“వద్దు పిన్నీ! నివ్వేం చెప్పనక్కరలేదు! నేను కావాలనే మావారికి చెప్పలేదు.”

“ఎందుకు? జగడమా?”

“అలాగేం కాదు, జగడం కాదు. కాని ఒక పోటీ! చెప్పమంటావా? నువ్వు ‘నవ్వను!’ అని అంటేనే చెప్తాను!” అని ఆరంభించాను; నా రహస్యాలని పిన్నితో పంచుకోడానికి నాకూ హక్కు ఉంది.

“సరే, చెప్పు . . . నేనెందుకు నవ్వుతాను . . .” అని పిన్ని కొంటె నవ్వు నవ్వింది.

“పిన్నీ, అతను ఒకసారి నాటకమాడాలని ప్రయత్నించారు. ‘ఎవరికీ చెప్పకుండా తటాలుమని అతను మా ఇంటికి రావాలి, మా అందరికీ ఆశ్చర్యం కలగాలి’ అని అతని ప్లాను. కాని నాకు మానసికంగా అది తెలిసిపోయింది; అతనికికూడా ఆశ్చర్యం కలిగినట్టు నేనేదైనా చెయ్యాలని నాకు అప్పుడే అనిపించింది. ఇప్పుడు దానికి అవకాశం దొరికింది. అతనొకరోజు ఇక్కడికి వస్తారు. “చూసేరా? మీరు వేసిన ప్లాను నెరవేరలేదు; కాని మీరనుకున్నదేమో నేను చేసేసాను! మీరెప్పుడూ ఊహించలేదు, అవునా?” అని అతన్ని అడగాలి! చాలారోజులుగా ఇదే నా ఆశ, అందుకే రాయలేదు?”

“ఓ, అదా సంగతి? సరేలే!” అంది పిన్ని. నాలాగే పిన్నికి అల్లరి చెయ్యడమంటే చాలా ఇష్టం. అందువలనే నాకు అండగా నిలబడిందేమో? తనే మళ్ళీ నన్ను అడిగింది:

“మామూలుగా సాయంకాలం రావడమే అతనికి అలవాటు. సరే, అది అలా ఉండనీ; మీ ఆయన నీతో ఎటువంటి నాటకమాడారు? అది నువ్వెలా కనిపెట్టావ్? అవన్నీ నాకు చెప్పు. మనం కూడా దానికి మించిన నాటకం ఆడదాం! నేనూ ఆలోచిస్తానులే . . . ”

నేను చెప్పసాగాను:

పిన్నీ, గత సంవత్సరం ఏదో Interview కోసం మావారు మా ఊరుకి రావడమైంది; అప్పుడు నేను పుట్టిల్లులో ఉన్నాను. ‘ఈ నెలలోపల అల్లుడుగారు బెంగళూరునుంచి మద్రాసుకి వెళ్తారు’ అనే వార్త మాత్రం నాకు తెలిసింది. కాని, ‘ఏ తేదీ బయలుదేరుతారు, ఎప్పుడు Interview?’ అనే వివరాలు ‘అతను’ రాయలేదు.

'ఏది ఎలాగైనా అతను తప్పకుండా ఈ ఊరులో దిగి ఆ తరువాతనే ప్రయాణం సాగిస్తారు; మరి దానిగురించి ఎందుకు రాయలేదు?' అని నాకు అనుమానం కలిగింది. నెల ఆఖరిలోకూడా ఏ వివరాలూ రాకపోవడంతో నా అనుమానం దృఢమైంది; నేను ఆలోచనలో పడ్డాను.

'తటాలున, ఎవరికీ చెప్పకుండా, అతను రాబోతున్నారు! అవును, అదే కారణం! అందుకే ఈ తికమక!" అని నేను నా అనుమానం ఖాయం చేసుకున్నాను.

'ఇలాంటి కుప్పిగంతులు చేసే మనిషి ఇతను! మరి నేనుకూడా అతన్ని ముందుకొని ఎందుకు ఒక నాటకం ఆడకూడదు?' అనే ఆలోచన నాకు తోచింది.

పిన్నీ, అదేం మాయమోగాని, నాకూ వింతగానే ఉంది! ఒక ఆదివారం నేను అమ్మ దగ్గరకి వెళ్ళి, "అమ్మా, విను. ఈ మంగళవారం రాత్రి అల్లుడుగారు మనింటికి తప్పకుండా వస్తున్నారు . . . మనకి చీటీ ఏదీ రాదు . . . గభీమని రావాలనే అతను ఇలా అమరికగా ఉన్నారు!" అని చెప్పాను.

అది విని అమ్మ "ఊరుకోవే, ఇదంతా నీ కల్పన, పిచ్చి ఆలోచన! అల్లుడుగారు అలాగేం చెయ్యరు! రాత్రివేళ వచ్చారనుకో, ఏమరిపాటుగా భోజనం దొరకదని అతనికి తెలియదా? మరీ అంత చనువుగా రావడానికి అతనేం పది సంవత్సరాలుగా మనకి అల్లుడుగారా ఏమిటి?" అని అంటూ నా అనుమానం తిరస్కరించింది. కాని నేను మళ్ళీ మంగళవారం సాయంకాలం చెప్పాను: "అతను ఇప్పుడు మెయిలులో వస్తున్నారు, అవును, తప్పకుండా! నువ్వు నమ్మకపోతే రాత్రి వంట చెయ్యవద్దు! కొంచెం అన్నం, పెరుగు తీసిపెట్టు, అది చాలు" అన్నాను.

అప్పుడే అమ్మ నిర్ఘాంతపోయింది. "ఇదేమిటే, నువ్వు ఇంత ఖరారుగా చెప్తున్నావ్! మీ ఆయన నీకు ఏమైనా రాసారా?" అని అడిగింది; అప్పుడే అమ్మకి నా మాటల్లో నమ్మకం వచ్చింది.

"బాగుంది! అతనుగాని రాసివుంటే నేనెందుకు దాచుతాను? అతనేమీ రాయలేదు, కాని నా మనసు నాకు చెప్తోంది! నాకతని స్వభావం తెలుసు. ఆరునెలలే మెలిగినా అతనికి తమాషాలు చెయ్యడంలో ఆసక్తి వుందని నాకు బాగా తెలుసు . . . అతను తప్పకుండా ఈ రాత్రి వస్తారు! అమ్మా, నాన్నగారిని స్టేషన్కి

వెళ్ళమని చెప్పు! మనింటికి రావడానికి అల్లుడుగారు ఇబ్బంది పడతారు; అంతేకాదు, మనం అతన్ని ఎదురుచూస్కున్నాం అని అతనికి బాగా తెలిసిపోతుంది . . . అమ్మా, నాన్నగారు స్టేషన్కి వెళ్తారా?"

నా నమ్మకం చూసి ఆశ్చర్యపడుతూనే అమ్మ నాన్నగారిని అడిగింది. "సరే!" అని నాన్నగారు ఆ రాత్రి స్టేషన్కి బయలుదేరారు. వాడుకగా "అసలు ఉత్తరం ఏమీ రాలేదే, మరెందుకు అమ్మాయి నన్ను ఇలాగ తొందరపెట్టుతోంది!" అని విసుగ్గొనేవారు; కాని ఆ రోజు "కమలు ఇంత రూఢిగా అంటోంది, సరే వెళ్ళి చూద్దాం!" అనే భావనతో ఆయనవెళ్ళారు. రెండురోజులుగా నేను ఇంత నమ్మకంతో చెప్పేది అతను ఉపేక్షించలేదు.

ఆఖరికి నేనన్నదే జరిగింది.

స్టేషన్ లో రైలు వచ్చి తన్ను దాటుకుంటూ ప్లేట్ ఫారంలో ఆగడానికి ముందే నాన్నగారు అల్లుడుగారు ఒక పెట్టెలో మీదనున్న వరుసనుంచి మూటాముల్లెలు కిందకి దింపడం చూసారట! పిన్నీ, అతను తన కళ్ళనే నమ్మలేకపోయారట! ఆల్లుడుగారు ఎవరినీ ఎదురుచూడలేదు కాబట్టి అతను తన పనిలో ఆలీనమైపోయారట! అతని మొహం చూడగానే నాన్నగారు 'అరేరే! నిజంగానే అల్లుడుగారు వచ్చేసారు! కమలు ఎలాగ అంత ఖాయంగా చెప్పింది!' అని విస్తుపోయారట! అతను పరుగెత్తుకొని వెళ్ళి, రైలు ఆగినవెంటనే, ఆ పెట్టెలో దూరి "అల్లుడుగారూ, రండి!" అని స్వాగతం చెప్పారు. "ఎవరది?" అని నివ్వెరపాటుతో అల్లుడుగారు తిరిగి చూసి "మీకెలాగ తెలుసు?" అని అడిగారట. అతనలా అడిగినప్పుడు అతని మొహం చూస్తే శోచనీయంగా కనిపించిందట . . .

'కమలు మాకు చెప్తూనే ఉంది - మీరు ఇవాళ తప్పకుండా వస్తారని. మీరు ఉత్తరం రాయకుండా రారు అని మేం నొక్కి చెప్పాం. ఆఖరికి దాని సాధింపు భరించలేక నేను స్టేషన్ కి వచ్చాను. ఇక్కడ మీ మొహం చూసేవరకూ దాని మాటలు విని నేను ఇక్కడకి రావడం పిచ్చిపని అని నాకు అనిపించింది. కాని ఇప్పుడే బోధపడింది. దానికి ఈ దీర్ఘదర్శనం ఎలా వచ్చిందో? . . . సరే, మీరు బయలుదేరండి! టైమైంది, ఇంటిలో భోజనం చల్లారిపోతుంది!' అని నాన్నగారు

అల్లుడిని - అతను భ్రమతో అలాగే నిలబడిపోయి నిలబడివున్నారు - తొందరపెట్టారట!

ఆ తరువాత మావారు ఇంటికి రావడం చూసి అమ్మకీ ఆశ్చర్యం! నన్ను చూసి 'నీకెలా తెలుసే?' అని అడుగుతూనేవుంది.

భోజనం సాగుతుంటే నేను మావారిని చూసి అడిగాను: "'మీరివాళ వస్తారని నాకు రాసారా?' అని చెప్పండి. అమ్మకి అనుమానం - మీరు నాకు మాత్రం రాసారేమో అని."

మావారు జోక్యం చేసుకొని అమ్మకి వివరించారు:

"నా జీవితంలో ఇదొక మంచి సమయమని అని నేను ఒక పెద్ద ప్లాను వేసాను. నెలరోజులకి పైగా ఆలోచించాను. 'ఎప్పుడు బయలుదేరుతాను? ఎప్పుడు వస్తాను?' అని కమలికి రాయలేదు. Interview 29, 30, తేదిల్లో అని మాత్రం సూచించాను; కాని 26 ఇక్కడ రాబోతున్నానని ఏ సూచనా ఇవ్వలేదు . . .

"'చెప్పకుండా, తటాలున ఇక్కడ రావాలి, మీరందరూ ఆశ్చర్యపడాలి; ఐతే నా హఠాత్తు రాకవల్ల మీకు శ్రమ ఇవ్వకూడదు; బండినుంచి దిగినవంటనే, Railway Refreshment Room లో భోంచేసి, సావధానంగా మీ ఇంటికి వచ్చి తలుపు తట్టాలి!' ఇలాగ చాలా రోజులుగా నాకెన్నో ఆలోచనలు! అవన్నీ ఒక నిమిషంలో బలూనులాగ పఠీలని ఐపోయాయి! ఇక ఇలాంటి తమాషాలు చెయ్యడానికి నాకు ఛాన్సు దొరకదు! నా ఆశలు పాడైపోయాయి . . . 'అల్లుడుగారూ, రండి!' అన్న మాటలు వినగానే నా తల గిరగిరమని తిరిగింది! ఇప్పుడుకూడా అతని కుశల ప్రశ్న తలుచుకుంటే నా దేహం వొణుకుతోంది!" అని అతను ఆవేశంతో మాట్లాడారు.

"పిన్నీ, అతను అంత తీవ్రంగా బాధపడడంచూసిన తరువాత నాకు అతనిమీద జాలి కలిగింది. 'ఎందుకురా నేను నాన్నగారిని స్టేషన్ కి వెళ్ళమన్నాను? అతను ఎంత  ఆశతో వచ్చారు! 'ఇంకా కొంచెసేపట్లో మన ప్లాను నెరవేరబోతుంది!' అని అతను ఆహ్లాదించే నమయంలో నాన్నగారు కనిపించడం వలన అతనికి ఎంత నిరాశ! 'బలూను పేలిపోయింది!' అని అతను అనడంలో ఆశ్చర్యమేముంది? 'అతన్ని ముందుకోవాలని నేనందుకు ఆలోచించాను?' అని నేను నన్నే నిందించుకున్నాను.

పిన్నీ, ఆ ఘటన తరువాత నాకూ ఒక ఆశ! అతనులాగ నేనూ ఒక నాటకమాడాలి! అతను ఊహించి తెలుసుకుంటారా? ఇలా పోటీకి పోటీగా తమాషాలు చెయ్యడం మజాగా ఉంటుందికదా?" అని అన్నాను; నా మనసులో ఏముందో పిన్నికి మొహమాటం లేకుండా చెప్పేసాను.

"ఓ, తప్పకుండా! మనమూ ఒక నాటకం ఆడదాం!" అంది పిన్ని ఉత్సాహంగా.

పిన్ని మనసులో ఏముందని నేను ఒకలాగ ఊహించగలిగాను; సంతోషించాను. 'నా ప్లానుకి మించిన స్థాయిలోనే ఏదో ఆలోచన పిన్ని మనసులో చోటుచేసుకుంది; మంచిది, అలాగే కానీ! ఈ తమాషా ఏదో చూడవలసిందే!' అని సమ్మతించాను.

పిన్ని నా భావనలతో, ఆలోచనలతో ఏకీభవించడానికి చాలా కారణాలున్నాయి. ముఖ్యంగా నా అదృష్టం గురించి చెప్పాలి; ఆరంభంనుంచి ఎటువంటి చిక్కూ లేకుండా అమ్మా, నాన్నా, అత్తయ్యా ఆమోదంతో ఇంత దూరం వచ్చిన తరువాత మరేం ఆటంకం రాబోతుంది? అంతేకాదు, పిన్నికికూడా ఇలాంటి తమాషాలు చెయ్యడమంటే చాలా ఇష్టం! అది నాకంటే వయసులో ఐదారు సంవత్సరాలే పెద్ద. మావారి ఉదార గుణం దానికి బాగా తెలుసు: మేం తమాషా చేస్తే అతనూ మాతో కలుసుకొని నవ్వుతారనే ధైర్యమూ ఉంది. ఇప్పుడు ఇవన్నీకలిసి మా పథకంని ప్రేరేపించాయి.

నేను మద్రాసుకి వచ్చి ఒక వారమైంది, కాని మావారు చిన్నాన్న ఇంటికి రాలేదు. 'ఇవాళ వస్తారు', 'ఇవాళ తప్పకుండా వస్తారు' అని ఆ ఏడురోజులూ, సాయంకాలం నేను ఇల్లు కదలకుండా కాచుకొని ఉన్నాను. అతను రాలేదని కొంచెం నిరాశ పడినా, అతన్ని త్వరలో తప్పకుండా కలుసుకుంటాను అనే భావనతో నా మనసు కుదుటపడింది; మేమిద్దరం చాలా సమీపంలో ఉంటున్నాం అనే జ్ఞానం నాకు  ధైర్యమిచ్చింది. చీకటిలో నక్షత్రాల వెలుగులో కలవరపడకుండా నడిచే ప్రయాణికుడి మనసులాగయింది నా మనసూనూ. ఆ ఏడు రోజులూ సాయంకాలం పోయి రాత్రి రాగానే నా మనసు మఱుగుపడుతుంది; కాని నమ్మకం అనే దీపం వెలిగించుకున్న తరువాత ఆ అంధకారం మాయమవుతుంది.

ఆ సాయంకాలం ఇంటిబయట పువ్వులు కోంటున్నాను. కొంచెం దూరంలో బైసికులు వచ్చే సందడి విని తటాలున తలెత్తి చూసాను.

హూహూం . . . . మళ్ళీ నిరాశే! కాని నా అంతర్బుద్ధి ప్రోద్బలం వలన నా కళ్ళు ఆ వీధిని పూర్తిగా ఆరసించి చూసాయి.

అదిగో . . . అదెవరు, ఆ మలుపులో తిరుగుతున్నది? అవును, అతనే! మావారే! అతనే ఇలాగ చేతులూపుతూ నడుస్తారు! కోసిన జుత్తు! ఆ కళ్ళద్దాలు! . . . అవును, అతనే!

ఒక క్షణంలో చెయిలో ఒక సంచితో వస్తున్న అతన్ని నేను గుర్తుపట్టేసాను! . . . అతను నన్ను చూసి ఉండరు! పూలదండతో తటాలున నేను ఇంటిలో దూరాను.

"పిన్నీ, అతను వస్తున్నారు! అతను నన్ను చూడలేదు. మాలాకారుడికి నువ్వే డబ్బిచ్చేయ్ . . . అతను చిన్నాన్నతో మాటాడనీ! . . . చిన్నాన్న ఏమరుపాటున మన గుట్టు అతనికి చెప్పరుకదా?" అని అన్నాను. నా దేహం వణుకుతోంది. ఒళ్ళంతా చెమట పట్టేసింది. నా కాలు నేలమీద పాకుతున్నట్టు అనిపించలేదు! 'మొట్టమొదట నాటకంలో నటించే తార రంగస్థలం ఎక్కినప్పుడు ఇంత గాబరా పడుతుందా?' అనే అనుమానం నాకు కలిగింది.

"ఓ, అల్లుడుగారా? . . . రండి," అని పిన్ని అతనికి స్వాగతం చెప్పడం నా చెవులకి అందింది.

"ఇదిగో, వస్తున్నాను . . . మామా[2] ఇంట్లో ఉన్నారా?"

అవును! మాటాడుతున్నది మావారే!

"అతను మేడమీద ఉన్నారు. మీరు మద్రాసుకి వచ్చారని నిన్ననే మాకు కమల ఉత్తరంద్వారా తెలిసింది. 'మిమ్మల్ని చూసి చాలా రోజులయ్యాయి,' అని మేం మాటాడుకున్నాం. మంచి వేళ! మేం ఆలశ్యం చెయ్యకుండా మీరే వచ్చేసారు! అతను మేడమీద ఉన్నారు; మీరూ వెళ్ళండి, అక్కడ హాయిగా మాటాడుకోవచ్చు . . . "

పిన్ని అతన్ని మేడకి పంపించేసి నా పక్కన వచ్చి నిలబడింది. పెళ్ళికూతురుకి ధైర్యం చెప్తున్న చెలికత్తె లాగ, నవ్వుతూ, "చూడు, ఇక అంతా బ్రహ్మాండంగా సాగుతుందిలే!" అని అంది. నేను వంటగదినుంచి బయటకి వచ్చాను. మేడమీద వారి సంభాషణ చురుగ్గా వినసాగాను. పిన్ని ఆలోచనకి తగినట్టుగా అన్నీ

---

[2] పెద్దవారిని - మగవారిని - మర్యాదగా పిలిచే ధోరణి

సాగాలంటే దానికి ఒకే ఒక అడ్డు ఉంది; ఒక పెద్ద జలప్రవాహం ఉందనుకోండి; దాని వేగం తగ్గించాలంటే ఆ నీటి సమతలంలో ఉండే మీటకే అది సాధ్యం. అలాగే, ఇప్పుడు మా ప్లాను సఫలమవడానికి ఒక ఆటంకం ఉంది . . .

"అల్లుడుగారూ, వినండి! ఈ రాత్రి మీరు మా ఇంట్లో భోంచెయ్యాలి, నిద్రపోవాలి! మా అబ్బాయి రఘుకి రేపు పొద్దున్నే ఆయుషు హోమం. మీరు అది చూసి, భోంచేసి ఆఫీసుకి వెళ్ళవచ్చు. అవునా? మీరేం ఆక్షేపణ చెప్పకూడదు! ఇంతకుముందు మీరు మా ఇంటికి నాలుగైదుసార్లు వచ్చినా ఒక వేళ కూడా భోంచెయ్యలేదు. దానికి బదులు ఈ సారి మీరు తప్పకుండా మా అతిధిగా, ఈ రాత్రి బస చేసి, రేపు విందు భోజనం తరువాత వెళ్ళాలి, సరేనా?" అని అతన్ని కలుసుకున్న కొంత సమయంలోనే చిన్నాన్న జరుగబోయే నాటకంలో తన పాత్ర ప్రదర్శనకి పూనుకున్నారు.

"సరేనండి!" అని 'అతను' అనేసారు. పంజెరంనుంచి విడిచిపెట్టిన పక్షిలాగ నేను పిన్నిదగ్గరకి చేరాను.

"అతను 'సరే' అని అనేసారు, పిన్నీ!" అని నా చెయిని గుండెమీద తాకుతూ పిన్నికి చెప్పాను. పిన్ని కళ్ళలో ఉల్లాసం, నాలో మెల్ల మెల్లగా లజ్జ చోటుచేసుకున్నాయి. నన్ను వశంలో ఉంచుకొని, కొంచెం సమయంలో మళ్ళీ పిన్ని దగ్గరకి వచ్చాను.

"పిన్నీ, అతనికి మైసూరు చారు, టొమాటోతో ఉల్లిపాయల పచ్చడి అంటే చాలా ఇష్టం! నేను చెయ్యనా?" అని అడుగుతూ పిన్ని బదులుకి కాచుకోకుండా నేను వంట ఆరంభించాను. పిన్ని అడ్డు చెప్పదని నాకు తెలియదా?

ఆ రెండూ నేను చేసే పద్ధతి అతనికి చాలా ఇష్టం. 'అతనికి నా జ్ఞాపకం రావడానికి ఇదే మంచి ఉపాయం, అతని మనసులో నాగురించి అన్ని భావనలూ రానీ!' అని ఆలోచించించే అలాగ చేసాను.

రాత్రి పిన్ని అందరికీ వడ్డించినప్పుడు నేను వండగదిలోనుంచి అతని మాటలు శ్రద్ధతో వింటున్నాను; ఏవేవో మాటల తరువాత అతనన్న ఆ తియ్యని పొగడ్త నా చెవులకి అందింది:

"ఈ చారూ, టమోటా పచ్చడి కమలి చేసినట్టు ఇంతవరకూ ఎవరూ చెయ్యలేదు! మామీ అలాగే చేసారు!"

అతను అలా అనగానే పిన్ని మొహం చిరునవ్వుతో నా పక్క మళ్ళింది; తరువాత అతిథిని, ఆ తరువాత, తన భర్తని సార్థక భావనతో చూసింది.

అతని మాటలు విని నేనిక భరించలేకపోయాను. ఆ క్షణమే అతన్ని ఎదుర్కోవాలని నాకు ఆరాటం కలిగింది. ఆ రోజుల్లో లంకా చెరసాలలో సీతాదేవి రాములవారిని చూడడానికి ఎలా తొందరపడిందో? మంచి వేళ, ఆ సీతాదేవికున్న ఓర్పులో రవంత  నాలోనూ చోటుచేసుకుంది.

"ఎందుకే నీకీ దిక్కుమాలిన బుద్ధి! పిన్ని నీ మాట విని, నీ కోసం ఈ నాటకమాడాలని అన్ని ఏర్పాట్లు చేసింది; అవన్నీ ఇప్పుడు తొందరపడి పాడు చెయ్యడమా? 'అమ్మాయీ, నీకింత తొందరా?'అని చిన్నాన్న ఎగతాళి చేస్తే నీకెలా ఉంటుంది?" అని నా ఆతురతని అణచుకున్నాను; మంచి వేళ, మరేం ప్రశ్న లేకుండా, భోజనం చేసి అతను, చిన్నాన్న మేడమీదకి వెళ్ళిపోయారు.

నేనూ, పిన్నీ మా ఇంటిపనులు పూర్తిచేసుకున్నాం.

"హూం, నువ్వు రెడీ అవు! మేకప్ ఆరంభించు!" అని పిన్ని నన్ను రెచ్చగొట్టింది. అవును మరి, అల్లరి చెయ్యడమంటే పిన్నికి సరదా కదా?

"ఊరుకో పిన్నీ, నువ్విలా ఎగతాళి చేస్తే ఎలాగ?" అని నేను గొణుక్కున్నాను.

కొంత సమయం తరువాత మేడమీదనుంచి మాటలు వినిపించాయి.

"సరే, మనం నిద్రపోదామా?" అని చిన్నాన్న అడుగుతున్నారు.

"గదిలో ఉక్కగా ఉంటుందేమో? డాబామీద మంచి గాలిలో మనం నిద్రపోతే? . . . " ఇది 'అతను' అడుగుతున్న ప్రశ్న!

"వద్దండి, అల్లుడుగారు! ఇక్కడే నిద్రపోదాం, హాయిగా ఉంటుంది! నేనూ ఇక్కడే పడుకుంటాను. అందుకే ఇక్కడ రెండు పడకలు వెయ్యమన్నాను. నేనెప్పుడూ నిద్రపోయేది ఇక్కడే!"

ఇంతలో, కింద హాలులో నిలబడివున్న రాజు, ఈ నాటకంలో తన చిన్న పాత్ర నటించడానికి మేడమీదకి వచ్చాడు.

"నాన్నగారూ, మీతో మాటాడాలట; ఎవరో వచ్చారు," అని అన్నాడు.

"ఓ, అలాగా? మరెవరు, వాడే, ఆ వదరుబోతు అయ్యరు! ఇవాళ వస్తానని నాకు చెప్పాడు. పట్టుకుంటే వదలడు! . . . అల్లుడుగారూ, మీరు నిద్రపోండి, చాలాసేపైంది! నాకోసం కాచుకోవద్దు! ఒకరోజైనా మీరు నెమ్మదిగా నిద్రపోండి!" అని చిన్నాన్న మేడ మెట్లు దిగి కిందకి వచ్చారు. అతన్ని చూడడానికే నాకు లజ్జగా ఉంది; హాలులో ఒక మూల నేను జారుకున్నాను.

చిన్నాన్న పిన్నిని చూసి "మంగళం, కమల ఎక్కడ? రమ్మను, దాని మొహం చూడాలి!" అని పరిహాసమాడారు.

కాని, నాకు చిన్నాన్న మొహం చూడడానికి ధైర్యం లేదు; నాకు పిన్నంటే చనువుంది; అదీ నాలాగ ఆడది.

పిన్ని అన్నీ ఆలోచించే చేస్తుంది. భర్తని "మీరు వసారాకి వెళ్ళండి," అని ఆజ్ఞ ఇచ్చి నా దగ్గరకి వచ్చింది. "ఇదిగో కమలం! ఇక మేమందరం జాగరం ఉంటే నువ్వు మరి మేడమీదకి వెళ్ళనే వెళ్ళవు! . . . . నాకూ అలసటగా ఉంది . . నిద్రపోవాలని ఉంది . . . నువ్వు సమయం చూసి మేడమీదకి వెళ్ళు . . . చిన్నాన్న వసారాలో నిద్రపోతారు . . . అబ్బా, ఎంత సిగ్గమ్మా నీకు! అదేం వద్దు! ఇంతసేపు ఉన్నట్టే ధైర్యంగా ఉండు! సరేనా? ఇక నేను వెళ్ళాను!" అని నాకు మరేం ఇబ్బంది పెట్టక పిన్ని మెల్లగా జారుకుంది.

ఇక ఈ నాటకం సాగించడం, ముగించడం నా బాధ్యత. కొన్ని నిమిషాల తరువాత మెల్లమెల్లగా నేను మెట్లెక్కడం ఆరంభించాను. మావారు బాగా నిద్రపోతున్నారని నా నమ్మకం. మామూలుగా అతను పడుకున్న కొంత సమయంలోనే బాగా నిద్రపోతారు; మెలకువతో పడకమీద దొర్లడం అతనెప్పుడూ చెయ్యరు అని నాకు తెలియదా?

సమయం పదిన్నరని గోడమీదవున్న పెద్ద గడియారం గంట గొట్టింది; అప్పుడే నేను మెట్లెక్కుతున్నాను.

సమయం పదకొండు అవగానే మళ్ళీ గడియారం గంట కొట్టింది.

అతని పడక పక్కనే ఉన్న మరొక పడకలో పదహేను నిమిషాలు పడుకొని, గూఢంగా నిద్రపోతున్న అతని మొహం చూస్తూ ఆనందిస్తూ నేను నన్నే మరిచిపోయాను; ఝుంకారం విని నాకు మెలకువ వచ్చింది.

'పదకొండు ఐపోయిందా? అతను ఇంకా లేవలేదే?'

అతని నిద్ర చెదరగొట్టడానికి నాకు మనసు రాలేదు. వెంటనే ఒక ఆడదానికే కలిగే సమయోచితబుద్ధి నా మనసులో చోటుచేసుకుంది కాబోలు; గుడ్డిగా నా చెయిలోవున్న గాజులు కదలించాను.

అతను నిద్రలేచారు.

నేనింకా, కళ్ళు మూసుకొని అలాగే పడుకొనివున్నాను. నా కనురెప్పలు సగం తెఱచియుండడం వలన అతనేం చేస్తున్నారని నేను చూడగలిగాను. గది చీకటిమయంగా ఉందనే ధైర్యం నాకు; ఆ చీకటే ఒక Periscope లాగ నాకు తోడ్పడింది.

అతను పరుపుమీద దొర్లుతూనే నా పక్క తిరిగారు,

పక్కన నిద్రపోతున్నది చిన్నాన్న కాదని అతనికి తెలిసివుండాలి; తెల్లని దుప్పటిమీద ఎర్రని చీరతో కనిపించే యువతికీ, తెల్ల పంచెతో నిద్రపోయే మగవాడికీ భేదం తెలియదా?

అతనికి ఏం తోచిందో? గభీమని లేచారు; రెప్పవేయకుండా నన్ను చూసారు.

అబ్బబ్బా, ఆ క్షణాల్లో నేను పడిన బాధ! నా దేహం కదలుతుందేమో అని దిగిలు! 'ఇక ఎదైనా సరే - అతను మాటాడనీ, ఇక ఈ నాటకం పొడిగించడంలో అర్థం లేదు!' అని నేను గ్రహించినా, అతన్ని ఇంకా కొంచెం పరీక్ష చెయ్యాలనే ఉద్దేశంతో నేను అలాగే పడుకొనివున్నాను.

ఆ క్షణాల్లో అతని మనసు నా మనసు పడిన ఆరాటం కంటే ఎక్కువగా బాధపడివుండాలి! లేచిన మనిషి దిగ్భ్రమతో శిలలాగ స్థిరపడిపోయి నన్ను గమనించారు. అతన్నిలాగే నన్నూ అన్నిరకాల భావనలు - సంతోషం, ఆశ్చర్యం, అనుమానం, నమ్మకం - ఆకట్టుకున్నాయి.

లేచి కూర్చున్న అతను ఇప్పుడు నిలబడ్డారు.

'అవును, అది కమలియే!' అని అతను ఎలా నమ్ముతారు? అవును . . . అది అంత సులభంగా రాదు . . .

అతని నిజాయితీ, నిర్మల హృదయం నాకు బాగా తెలుసు. కాని ఇప్పుడు అతని కళ్ళు చూడగానే నాకు అతనిమీద చెప్పలేని ఆశ, జాలి కలిగాయి.

నేను నా చెయి అతనికి అందించాను. "నేనే, రండి, కూర్చోండి!" అని అనగానే అతను వెంటనే వచ్చి పక్కన కూర్చున్నారు.

"కమలి? నువ్వేనా? . . . ఇదేంటి, నువ్వెలాగ వచ్చావ్?" అని అడిగారు.

"మిమ్మల్ని చూడాలనే ఆశ నన్ను ఇక్కడికి తీసుకొచ్చింది . . . "

"సరేలే, మంచి పని చేసావ్ . . . కాని ఎలా వచ్చావ్? నాకన్నీ చెప్పు . . . "

నేనంతా వివరించి చెప్పాను. నా ఆశ, కోరిక, పిన్నీ, చిన్నాన్నల సహకారం గురించి చెప్పాను. ఆ తరువాత

"నేను మీ కమలి అని మీకు ఇప్పుడు నమ్మకం కలిగిందా?" అని అడిగాను.

"ఇదేం ప్రశ్న? . . . బాగుంది ఈ తమాషా . . . మగవాడు నేననుకున్నది జరగలేదు, కాని నువ్వు ఆడది సాధించేసావ్! Great! Congratulations!"

నేను చెప్పదలచుకున్నది అతనే చెప్పేసారు. కాని అతని మాటలతో తృప్తి పడక, అతనితో వాదించాలని ఇంకోక ప్రశ్నతో అతన్ని రెచ్చగొట్టాను:

"మీరు ఆరోజు ఏమన్నారో జ్ఞాపకం ఉందా? 'మనిద్దరి హృదయాలు ఒద్దికలో ఉండడంవలసే నీకు నా రాక గురించి ముందుగానే తెలిసింది,' అని. కాని మీరు నన్ను ఇక్కడ చూస్తారనే నమ్మకం, భావన మీలో రవంతైనా చోటుచేసుకుందా? మీగురించే నిత్యమూ తపించిపోయే నాకు మీ హృదయ ఆహ్వానం వినిపించింది. కాని నాగురించి మీకు ఏ చింతా, ఆలోచనా లేదు! నా హృదయ పిలుపు మీరు వినలేదు! నాగురించి మీకేం గుర్తులేదని తెలిసిపోయింది . . . ఉత్తరాలగురించి గొప్పగా చెప్పుకోవాలా ఏమిటి?"

"చూసావా, చూసావా, నీకు కోపం వచ్చేసింది! నువ్వుకూడా ఉత్తరాల్లో 'ఇక నేను మీతో దెబ్బలాడను!' అని రాయడం మరిచిపోయావా?" అని నవ్వుతూ అడిగారు.

"అయ్యో, అలాగేంకాదు! మీకు నేనంటే ఏమాత్రం తాపం లేదని మిమ్మల్ని చూసినవెంటనే నేను తెలుసుకున్నాను." ఇప్పుడు ఈ కొత్త ఉద్యోగం చేసే ఉత్సాహం కాబోలు, ఇతని ఆరోగ్యంలో అభివృద్ధి కనిపించింది!

మా పోట్లాట ముగిసింది.

ఆ మరుసటి దినం ఉదయం వరకు మావారిని 'ఏడ్పించాలని' నా చిన్నాన్న పిల్లలు ఏమేమో మాటలాడారు. పిన్ని, చిన్నాన్న కూడా "అల్లుడుగారూ, ఆఖరివరకూ మీకు  మా కుయుక్తి తెలియలేదే?" అని ఆశ్చర్యపడ్డారు. మావారు మరేం అనక నవ్వేసారు. "చూసారా, అతన్నెందుకు అలా హింసపెడుతున్నారు? 'అవును, మీ నాటకం నాకు తెలియనేలేదు!' అని అతను ఒప్పుకున్నారుకదా?" అని పిల్లలు మళ్ళీ అన్నారు.

అందరి మాటలకి, వెక్కిరింతలకి మావారి బదులు ఒక చిరునవ్వే. నేనుకూడా, మూడు నాల్గుసార్లు, "అవును, అతనికెలా బోధపడుతుంది?అతనికి నాగురించి ఏ జ్ఞాపకమూ లేదే!" అని ఆరోపించాను. అప్పుడుకూడా మావారు ఏమీ అనలేదు. ఆరోజు అ ఇంటిలో విందు భోజనం, కాని ఆయుషుహోమంకోసం కాదు! అల్లుడిగారికి, నాకు!

విందులో ఏదో మాటవరుసలో నేను "పిన్నీ, అతనికి నన్ను ఇక్కడ చూసే ఉద్దేశమే లేదే? మరి ఎలాగ . . . " అని వాదించాను.

అప్పుడే మావారు, ఎవరూ ఎదురుచూడని ఒక 'బాంబు' విసిరారు.

"ఓ, నువ్విక్కడ ఉన్నావని నాకు తెలియదా? బాగా తెలుసు . . . "అన్నారు.

"అవునులెండి! 'తెలీదు!' అని మీరే అనలేదూ? ఇప్పుడు అందరుముందూ ఒప్పుకోవాలంటే సిగ్గా?" అని నేను వాదించాను.

"నీకోసం అలా అన్నాను. 'నాకు తెలుసు!' అని చెప్తే - నేను ఇంతకుముందు అనుభవించినట్టు - నీకూ, మీ అందరికీ నిరాశ ఏర్పడుతుందని అలాగ అన్నాను. నువ్వు మళ్ళీ మళ్ళీ సతాయించితే నేనెందుకు దాచాలి? . . . .కావాలంటే మేడమీద నా షర్టు పక్కన ఒక సంచి ఉంది . . . దాన్ని తీసుకురా, చెప్తాను" అన్నారు.

'ఇదేం గొడవరా!' అని అంటూ పరుగెత్తుకొని వెళ్ళి ఆ సంచి తెచ్చాను.

"అందులో ఏముందో చూడు - ఆ Hand bag నీకోసమే తెచ్చాను. పూనాలో కొన్నాను. నువ్విక్కడ ఉన్నావ్, నీకు స్వయంగా ఇవ్వాలనే నా ప్లాను!"

అవును! నిజంగానే అందులో ఒక Hand bag ఉంది! నాకు ఒకటే విభ్రాంతి!

“సరే, మీకెలాగ తెలుసు? చెప్పండి,” అని పిన్ని అడిగింది; నేనూ అదే అడగాలనుకున్నాను.

“మామా[3] కమలితో సెంట్రల్ స్టేషన్ నుంచి రావడం అకస్మాత్తుగా చూసాను. అది నన్ను చూడలేదు. ‘కమలి నాకు చెప్పకుండా ఇక్కడ వచ్చిందా?’ అని విస్తుపోయాను. ‘సరే, కారణం లేకుండా అది ఏ పనీ చెయ్యదు. ఇక ఏం జరుగుతుందో చూద్దాం!” అని నిశ్చయం చేసుకున్నాను. ‘కమలి ఇక్కడే ఉంది, మనం మామూలుగా - ఏమీ తెలియనట్టు - వెళ్దాం!’ అని అనుకున్నాను. ‘ఆ Hand Bag కూడా తీసుకొని వెళ్దాం!’ అని ఆలోచించాను.

ఇక్కడ మేడమీదకి వచ్చినతరువాతకూడా కమలి కనిపించక పోవడం నాకు వింతగా తోచింది. ‘సరే, ఏదో పనిమీద బయటికి వెళ్ళిందేమో?’ అనే ఆలోచనతోపాటు అనుమానమూ కలిగింది. నేను ఇంట్లోకి రాగానే మామీ ‘నిన్న కమలి ఉత్తరం వచ్చింది’ అని అన్నారు. దానితో నా అనుమానం దృఢమైంది. భోజనం చేస్తున్నప్పుడుకూడా మామా ఎక్కువగా మాటాడలేదు, కమలిని తీసుకురావడం గురించి అతను ఏమీ అనలేదు. ‘సరే, ఏం జరుగుతుందో చూద్దాం!’ అని నేను ఆఖరివరకూ పిల్లిలాగ ఊరుకున్నాను. ఆ తరువాత రాత్రి కమలికీ నాకు తెలిసినట్టు చెప్పుకోలేదు. పాపం, దానికి ఎందుకు నిరాశ కలిగించాలి? . . . కమలి, నీకిప్పుడు బోధపడిందా? మామా, మీరు చెప్పండి, మా ఇద్దరిలో ఎవరు గొప్ప?” అని అంటూ విజయం సాధించిన చూపుతో మావారు ముగించారు. మేమందరం నోరుమూసుకొని వింటున్నాం. ఆ నిశ్శబ్దం చిన్నాన్న కలిపారు.

“భలే, భలే, మీరిద్దరూ అజేయులే! బాగుంది ఈ తమాషా . . . ” అని బిగ్గరగా మమ్మల్ని పొగడారు. ఆ తరువాత పిన్నిని చూసి “ఏమే మంగళం, మనం ఎప్పుడైనా ఇలాంటి నాటకమాడామా? మన పెద్దలు ఊరికే ఉంటారా? మనమూ వీళ్ళకి సాయం చెయ్యడంవలనేకదా ఈ తమాషా జరిగింది? చూడు ఇప్పుడేమైందో! సంతోషంతో ఇద్దరూ మతిమఱచిపోయారు!”

“అయ్యో, అలాగేంకాదు! అని గభీమని నేను నా చూపుని మావారి మొహంనుంచి మళ్ళించుకున్నాను. వీళ్ళ పరిహాసంకి అడ్డు చెప్పేది ఎవరు?

---

[3] అతను చిన్నాన్నని సూచించి మాటాడుతున్నారు

నిజంగా నాకూ సంతోషమే! మావారు రహస్యంగా ఏమీ అనక, మాకు మా నాటకం ఆడడానికి అవకాశమిచ్చి, ఆ తరువాత ఆ రహస్యమేమిటో బయలుపఱిచిన ధోరణి చూస్తే ఎంత వినోదంగా ఉంది!

ఆ రోజు అతను ఆఫీసుకి వెళ్ళి, సాయంకాలం మాంబలంలోవున్న చిన్నాన్న ఇంటికే తిగివచ్చారు. ఆ రోజంతా ఇంటిలో నవ్వులాటలూ, వెక్కిరింతలూ చోటుచేసుకున్నాయి.

ఆ తరువాత, ఆ నెలలోనే ఎన్నో ఘటనలు - ఒకటికి తరువాత ఒకటి. ఆఖరికి మద్రాసు నగరంలోనే వేరే ఒక భాగంలో మేం కాపురం చెయ్యడం జరిగింది. అంతా దేవుని దయ అనాలి!

ఈ ఇంటికి వచ్చిన కొన్ని రోజుల్లో ఆ రోజు మావారు నాకిచ్చిన బహుమానం - Hand Bag- ని తీరికగా చూడాలని అనిపించింది. దాన్ని బాగా చూసిన తరువాతకూడా నాకు తృప్తి రాలేదు. అది వచ్చిన అట్ట పెట్టెని మళ్ళీ మళ్ళీ చూసాను. అప్పుడే నాకు ఎదురుచూడని ఒక సంగతి తెలిసింది.

ఆ పెట్టెలో దాని ధర, అది అమ్మిన షాపు పేరు కనిపించాయి. అది మద్రాసులో కొన్నది. 'అతను పూనాలో కొన్నట్టు చెప్పారే?' అని ఆలోచించాను.

ఆ సాయంకాలం రాగానే అతను "కమలి, ఇదిగో నా జీతం! లెక్కపెట్టి జాగ్రత్తగా నీ Hand Bag లో ఉంచు. మన కాపురం ఆరంభించిన తరువాత ఇదే మొదటి జీతం!" అన్నారు.

అతను "Hand Bag . . . " అని అనగానే నేనూ అడిగేసాను.

"సరే, అలాగే చేస్తాను . . . అదలాగ ఉండనీ . . . మీరేమో అది పూనాలో కొన్నట్టు చెప్పారు, కాని అందులో మద్రాసు షాపు పేరే ఉంది! పూనాలో కొన్న వస్తువంటే నాకు ఘనతగా కనిపిస్తుంది, మద్రాసులో అంటే అలాగ్గాదు; అదేనా మీ ఉద్దేశం?"

"దానికేం? అది ఇక్కడే కొన్నాను. మీ పిన్నింటికి వచ్చే దారిలో కొన్నాను . . . కాని మీ పిన్నింటిలో నేను హుషారుగా చెప్పిన అబద్దాలలో మద్రాసు పూనాగా ఐపోయింది, మరేం లేదు!"

నేను ఉలికిపడ్డాను: "అబద్దాలా? మీరేమంటున్నారు?"

"అవును! ఆ రోజు విందులో నేను చెప్పినవన్నీ అబద్ధాలే! మిమ్మల్నందరినీ మరపించాలని నేను చెప్పినవన్నీ అబద్ధాలే! . . . "

"ఆ రోజు నేను పొద్దున లేచినప్పటినుంచి, భోంచేసినవరకూ, నాలుగైదుసార్లు నువ్వు నన్ను ఎగతాళి చేస్తూనేవున్నావు! మాటిమాటికీ నువ్వు నాకు మీ నాటకమేమిటో తెలియదని అంటుంటే నాకు రోషం రాదా? అందుకే మీరందరూ నిర్ఘాంతపోయినట్టు ఏదైనా చెయ్యాలి, మీ గర్వం అణచాలి అని బాగా ఆలోచించాను. స్నానం ముగించే వేళకి నేను చెప్పవలసిన అబద్ధాలు నాకు దొరికాయి . . .

మంచి వేళ, నేను చెప్పిన అబద్ధాలకి ఆధారంగా నేను ఆ ముందురోజు అకస్మాత్తుగా నేను కొన్న Hand Bag సాయం చేసింది. నా పథకం నెరవేరింది . . .

స్నానంగదినుంచి వస్తున్నప్పుడు నువ్వు నాలుగోసారి నన్ను ఎగతాళి చేసినప్పుడు నాకు పట్టరాని కోపం వచ్చింది. కాని 'వొద్దు, తొందరపడకూడదు!' అని ఊరుకున్నాను. కాని భోజనం సమయం నీ మాటలు మళ్ళీ వినగ్గానే ఇక తాళలేకపోయాను. వడి వడిగా అబద్ధాలు ప్రయోగించాను; నువ్వు నాకు చెప్పిన కొన్ని సంగతులు గుర్తుచేసుకొని మీ పిన్ని అడిగిన అన్ని ప్రశ్నలకీ దిద్దుసాటుగా జవాబు చెప్పాను. చిన్నాన్న నిన్ను స్టేషన్నుంచి తీసుకువచ్చారని నువ్వు చెప్పే నాకు తెలిసింది; నేను చూసానా, లేదే? ఇప్పుడు నీకు నిజమేమిటో తెలిసిపోయింది. కాని ఇప్పుడుకూడా నేను కల్పించి చెప్పిన అన్ని అబద్ధాలు నిజమని నీ పిన్నీ, చిన్నాన్న అనుకుంటున్నారు . . .

అందరి ముందూ నువ్వే కాదు, వాళ్ళందరూ నన్ను పరిహాసం చేసినా నేను నవ్వేసి ఊరుకున్నాను. కాని మీ సాధింపు, నవ్వులాటలు మితిమీఱగానే, నాకూ ఆవేశంలో ఏమైనా చెయ్యాలని అనిపించింది. ఏమైనా, నేను మగాడిని: స్త్రీలముందు ఓడిపోయానని ఒప్పుకోడానికి నాకు మనసు వస్తుందా, నువ్వే చెప్పు!"

ఇప్పుడే నేను జోక్యం చేసుకొని "మీరు ఒప్పుకోపోయినా మీరు ఓడిపోయారన్నది నిజం. అవునా? అసలు మీరు నిజంగా ఏదీ కనిపెట్టలేదే?" అని ఎదుట ప్రశ్న వేసాను.

“నేనేం ఓడిపోలేదు! ఆఖరికి అపజయం జరగపోతుందనే సమయంలో, సర్దుకొని, విజయం సాధించిన చూపు ఎవరిది - నీదా, నాదా?”

అతని మొహంలో చిరునవ్వు, గర్వం చోటుచేసుకున్నాయి.

“అదేం విజయం సాధించిన చూపు కాదు! మీరు ఉద్రేకంతో, ఆవేశపడి మాటాడి మమ్మల్ని చూసిన చూపు! నిజం తెలియక మీరు గెలిచారని మేం అనుకున్నాం, అంతే! కాని, అది విజయం కాదు!” అని నేనుకూడా ఆవేశంతో మాట్లాడాను.

మావారికి సహజంగా పెద్ద మనసు.

“చూడు కమలి. నిజంగానే నీకు నామీద కోపమా? విను, ఆ రోజుల్లో మనిద్దరికీ మనసులో ఉద్రేకం చోటుచేసుకుంది; మనలో ఎప్పుడూ పోటీయే! ఈ సారి పోటీలో ఇద్దరం గెలిచాం! చూడు, నీకు కోపం రాగానే నేను లొంగి పోయాను, అంటే నువ్వు గేలిచినట్టుకదా?” అని అంటూ దగ్గరకి వచ్చారు.

ఆ మాటలు విన్నతరువాత ఎంతసేపు నా కోపం నిలకడగా ఉంటుంది?

నా నోటినుంచి తమంటతతామే మాటలు వచ్చేసాయి: “అయ్యో, మీరేం ఓడిపోలేదు! ఇప్పుడూ నేనే ఓడిపోయాను! మీ ప్రేమానురాగాలతో మీరే ఎప్పుడూ గెలుస్తారు. ఇటువంటి పోటిలో ఓడిపోవడమంటే నాకు సంతోషమే!” అని అన్నాను.

అతని చూపులో - ఆ కళ్ళలో - ఒక దివ్యమైన కాంతి కనిపించింది.

“సరేలే, కమలి! ఉద్రేకం, గెలవడం - ఇవన్నీ ఎవరికి కావాలి, చెప్పు! నాకు నువ్వు కావాలి! నీకు . . . నేను!” అని ముగించారు.

నేను మరేం చెప్తాను?

ఇన్ని రోజుల తరువాత నా మనసులో అదే ప్రశ్న మ్రోగుతుంది: ఉద్రేకం, విజయం? ఎవరికి - అతనికe, నాకా?

వెంటనే జవాబు కూడా దొరుకుతుంది: ఆ రోజు అతనన్నట్టు - ఇద్దరికీ! అదే నిజం కదా?

నేను ఇలా అహ్లాదపడతుంటే “ఆహ్, ఇటువంటి ఝుటనలు వేరే దంపతుల జీవితంలో జరిగివుంటాయా?” అని నాకు అనిపిస్తోంది. ఎవరికి తెలుసు - అదీ ఒక అబద్ధమేమో?

అత్తగారింటికి వచ్చిన కొత్త పెళ్ళాం నాకు స్నేహితురాలైతే ఎటువంటి సరసమైన కధలు చెప్తుందో?

******

. .

# ప్రయాణంలో . . .

నా స్నేహితుడు మనవి విని నేను సరేనన్నాను; అతని ఇరవైయేళ్ళ కూతురు భామా, పన్నెండేళ్ళ అబ్బాయి రాజూ, ఐదేళ్ళ బాలుడు శేఖర్ - వాళ్ళకి దారితోడుగా రైలులో ప్రయాణంచేసి వాళ్ళని మదురైలో క్షేమంగా చేర్పించే బాధ్యత పూనుకున్నాను.

రైల్వే స్టేషన్ కి మేం చేరుకున్నప్పుడు రాజు "అయ్యో, మరిచిపోయానే! ప్రయాణంలో చదవాలని ఒక పుస్తకం ఎంచుకున్నాను - కాని దాన్ని సంచిలో పెట్టలేదు!" అని వాపోయాడు.

వాడితో రైల్వే పుస్తకాల స్టాల్ కి వెళ్ళి ఒక పుస్తకం కొనియిచ్చాను. నేను చెప్పదలచుకున్న భోధనలేవో రైలుబండిలో చెప్పాలని ఆలోచించి నా చుట్టుపక్కలని ఒకసారి ఆరసించి చూసాను: భామా కొడుకు శేఖర్ - మూటాముల్లెలనుంచి - ఒక అడ్రసు రాసివున్న చీటిని చింపేసి, దాన్ని గొట్టంలాగ చుట్టి, సిగరెట్టులాగ తన పెదిమలమధ్య పెట్టుకున్నాడు! ఆ వెధవ చేష్టని కొంచెం దూరంలో చూస్తున్న చటకార స్త్రీ - ఒక ముసలావిడ - 'చూసారా, ఆ అబ్బాయి ఎంత సొగసుగా పొగ కాలుస్తున్నాడో?' అని అడుగుతున్నట్టు పెదిమలని వక్రంగా వంచుకొని, కనురెప్పలు వాల్చకుండా వాడినే చూస్తోంది.

రైలు వచ్చింది; మేం మా జాగా చూసుకొని కూర్చున్నాం.

"మామా, ఏమైనా చెప్పండి, వింటాం!" అని రాజు నన్ను పురిగొల్పాడు.

"మనం ఇల్లు వదిలి, కొంతసేపైనా మన చుట్టుపక్కలు చూసామనుకో, ఎన్ని ముచ్చటలు మన కళ్ళకి కనిపిస్తాయో తెలుసా? నీకెప్పుడూ పుస్తకాలే చదవాలి! ఒకసారి నేను రైలు ప్రయాణం చేస్తున్నాను. సూటూ, బూటూ, హేటుతో, ఒకతను నోటిలో సిగరెట్టు పెట్టుకొని ఒక అగ్గిపుల్ల వెలిగించాడు. వెంటనే, అతని ఎదుట బెంచిలో కూర్చున్న మరొకతను - అతనికి పెద్ద పిలకజుట్టు ఉంది - తన చెయి చాటుతూ 'నాకూ . . . ' అని అడిగాడు. సిగరెట్ కాల్చేవాళ్ళు, కాఫీ తాగేవాళ్ళు, తాగుబోతులు - వీళ్ళందరికీ ఒక అలవాటుంది - ఇతరులు తమలాగే కనిపిస్తే వాళ్ళు సంతోషిస్తారు.

లేకపోతే, 'చూడండి! మీరూ మాలాగే అనుభవించండి!' అని వాళ్ళని ప్రేరేపిస్తారు. అలాగే ఈ సూటూ బూటూ మనిషి చాలా ఉత్సాహంతో కాలుతున్న తన అగ్గిపుల్లని ముందుకు నెట్టి చూపాడు. ఆ పిలక మనిషి అందులో ఏం కాల్చాడని చూసి, నివ్వెఱపోయాడు! వెంటనే 'I am sorry!' అని అంటూ తన సిగరెట్టుని తీసి బయట పారేసాడు! ఆ పిలక మనిషి ఏం కాల్చాడో మీకు తెలుసా?"

"అగరుబత్తి!" అని నేను అనగానే రాజు, భామా విస్తుపోయారు. కాని, మరు క్షణమే, ఇద్దరూ నవ్వేసారు.

"ఆ పిలకమనిషిని నాకు చూడాలనివుంది!" అని రాజు కనుసైగ చేసాడు.

"ఆ పిలకమనిషిని ఎగతాళి చెయ్యకు! అతని మెదడు ఎంత హుషారుగా పని చేసిందో చూసావా? మనిషికి ఎంత ధైర్యం!" అన్నాను నేను.

"అసలు పిలక పెట్టుకోవడానికే మనిషికి ధైర్యం కావాలి!" అన్నాడు రాజు.

"అవును! ఆ ధైర్యంలోనూ ఎంత నాజూకుతనం ఉందని చూసావా? అంతేకాదు, మనిషికి ఎంత నిదానం! అతన్ని చూసినతరువాతకూడా ఒక కట్ట అగరుబత్తి తీసుకొనివెళ్ళి ఆ సిగరెట్టు కాల్చుతున్నవాళ్ళ మనసు మార్చాలనే ధైర్యం నాకు వచ్చిందా? లేదే? కాని, ఒకే ఒకసారి కొంచెం ధైర్యంతోనే నేనూ ఒక పని చేసాను: నా పక్కన కూర్చున్న ఒకతను 'ఏమండీ, నేను పొగ కాల్చనా? మీకేం ఆక్షేపణ ఉందా?' అని నా అనుమతి కోరాడు. 'ఓ, తప్పకుండా! Go ahead, మీరు enjoy చెయ్యండి! ఐతే ఆ పొగని మీ ముక్కునించో, నోటినుంచో బయటికి వదలకుండా మీలోనే పీల్చుకుంటే నాకెందుకు ఆక్షేపణ?' అన్నాను. అంతే, అతను పొగ కాల్చలేదు! మన నోటిలోకి వెళ్ళినదేదో బయటికి వస్తే దానికి ఎంగిలి అని పేరు, అవునా? మరి అలాంటిదేకదా మన నోటినుంచి వచ్చే పొగ కూడా? మరెందుకు అతనికి నేను అనుమతి ఇవ్వాలి? ఆ పిలకమనిషిని గుర్తు చేసుకొని ధైర్యంగా 'వద్దు!' అనేసాను."

"భలే, మామా, మంచి పని చేసారు!" అని రాజు పొగడాడు.

"నలుగురు మనుషులని మనం చూసామనుకో, అది ఎంత మంచి అనుభవమో తెలుసా?" అని నేను మళ్ళీ మొదలుబెట్టాను.

“నేనొకసారి ఒక గంటకిపైగా ఒక ఉత్తరదేశపు మనిషితో - వాడికి పెద్ద తలపాగా ఉంది - ప్రయాణం చేసాను. వాడు కోటు కుడి పాకెట్ నుంచి ఒక కిళ్ళీ తీస్తాడు; నములుతాడు. అదవగానే, రెండు నిముషాలు ఆగి, ఎడం పాకెట్ నుంచి ఒక బీడీ తీసి వెలిగిస్తాడు; దాని తరువాత, మూడు నిమిషాలకి మళ్ళీ ఒక కిళ్ళీ, ఆ తరువాత మళ్ళీ ఒక బీడీ! ఇలాగే కిళ్ళీ, బీడీ, మార్చి మార్చి వాడుతాడు. అబ్బబ్బా, ఇంతకంటే అసహ్యం, అవమానం నేనెక్కడా చూడలేదు! అసలు దానిగురించి నేను ముందు లెక్క చెయ్యనేలేదు; కాని ఆ తరువాత నాకు అనుమానం రాగానే ‘నాయనా, ఇది ఎన్నిరోజుల అలవాటో?’ అని విస్తుపోయాను. వాడి చెయి, నోరూ, గడియారంలాగ, ఎటువంటి పొరబాటు లేకుండా తమ పని సాగించడం ఆ గంటన్నరలో చూస్తూ నేనలా కూర్చుండిపోయాను!

మనం ఎన్నిరకాల మనుషులని చూస్తామో, అన్నివిధాల అలవాట్లూ మనకి ముచ్చటగా కనిపిస్తాయి. ఒకసారి రైలులో నాతో ఒక ముసలాయన ప్రయాణం చేసారు. ఒక్కొక్క స్టేషన్ లో ఏదో కొనడం, తినడం, అతనికి అలవాటనిపించింది. తాటిముంజెలు, బటానీలు అని ఆరంభించి, రైల్వే రెస్టారెంటులో రొట్టి, వెన్న, పళ్ళు అన్నీ అతను ఆర్డరు చెయ్యడం చూసాను. మామిడిపండుని అతను ఒక పీల్చుతో ఖాళీ చేసేసారు! అంటే అంత ఆతురతతో, తొందరగా తిన్నారన్నమాట! మనిషిని చూస్తే దేహంనిండా చర్మం ముడుచుకొనివుంది; కరాలు వణుకుతున్నాయి. కాని అతనికి ఘోరమైన తిండి పిచ్చి! ‘ఇంట్లో భార్య అతని భోజనంలో ఏమైనా నియమాలు, కట్టుబాట్లు బలవంతం చెయ్యడంవలన అతను బయట ఇలా రైలులో అమితంగా తింటున్నారేమో?’ అనే అనుమానం నాకు కలిగింది. ఉదయం ఎనిమిది గంటలనుంచి రాత్రి పదిగంటలవరకూ అతనేదో కొంటూనేవున్నారు, తింటూనేవున్నారు.”

రాజు నన్ను మధ్యలో ఆపాడు: “అతను మీకేం ఇవ్వలేదా?” అని అడిగాడు.

“అతనిచ్చినా నేను తీసుకుంటానా? అతను తన ఎంగిలి చెయి కడుక్కోనేలేదు!”

నాకింకొక ఘటన జ్ఞాపకం వచ్చింది, చెప్పడం ఆరంభించాను.

ఒకసారి కలకత్తా వెళ్ళాలని నేను మద్రాసు సెంట్రల్ స్టేషన్ లో కాచుకొనివున్నాను. అప్పుడు ఒకతను - మనిషి చూడడానికి సొగసుగా, సూక్ష్మంగా కనిపించారు - నా

దగ్గరకి వచ్చి కొంతసమయం పలకరించి వెళ్ళారు. రైలు వచ్చిన తరవాత నేనొక మూడవగది కంపార్టుమెంటులో ఒక జాగా వెదికి కూర్చున్నాను. అప్పుడు ఆ కొత్త స్నేహితుడు నేనున్న చోటకి వచ్చారు. 'మీకు నేను మంచి జాగా కనిపెట్టాను; మీరు నాతో రండి!' అని పిలిచారు. 'వద్దండీ, ఇదే బాగుంది,' అని నేను ఎన్నిసార్లు చెప్పినా అతను వినలేదు. 'సార్, నేనంటున్నది మిలిటరీవాళ్ళకి ప్రత్యేకంగా కేటాయించిన కంపార్టుమెంటు. నా బంధువుమూలంగా నాకది దొరికింది. నాతో ఇంకొకరున్నారని చెప్పి నేనది మీకోసం ఏర్పాటు చేసాను. రండి, వెళ్దాం!' అని అతను అన్నారు. నేను వెళ్ళాను; అతను అన్నట్టే అక్కడ మిలిటరీవాళ్ళని తప్పించి మరెవరైనా ప్రయాణం చెయ్యాలంటే అందుకు అక్కడున్నవారు సమ్మతించాలి. చాలామంది ఆ కంపార్టుమెంటులో ప్రవేశించాలని వచ్చారు. మిలిటరీ దుస్తులతో ఉన్నవారితోబాటు నా స్నేహితుడుకూడా వాళ్ళందరినీ తరిమారు. అతను నన్నుమాత్రం పిలిచి సత్కరించారని నా మనసులో ఆశ్చర్యం, సంతోషం చోటుచేసుకున్నాయి; ఆ రాత్రి మేమందరం బాగా నిద్రపోయాం.

మరుసటిదినం మేం విజయవాడా చేరుకున్నాం. అతను నన్ను కాఫీ తాగడానికి పిలిచారు. నాకలవాటు లేదని రానన్నాను. అతను వెళ్ళడానికి సిద్ధమైయ్యారు. 'జాగ్రత్త, ఎవరినీ లోపలకి రానివ్వకండి! జనులు గబగబమని జొరపడతారు!' అని అక్కడున్న ఇద్దరు మిలిటరీ ఉద్యోగులకి చెప్పి అతను అతిజంబంగా వెళ్ళారు. బండిలోని పదిమంది కాఫీ తాగడానికి వెళ్ళారనుకుంటాను; నేనూ, ఆ ఇద్దరూ మాత్రం ఉండిపోయాం. అప్పుడు ఆ ఇద్దరిలో ఒకతను - నా స్నేహితుడు తల మాయమైనవెంటనే - 'చూసావా, ఇక్కడ మనకి కాపలావుండమని ఆర్డరిచ్చి అతనెలా తప్పుకున్నాడో?' అని తమిళంలో సణుగ్గున్నాడు.

నేను ఆలోచించాను: 'మిలిటరీకి, నా స్నేహితుడికీ ఏ పొత్తూ లేదు; ఐనాకూడా, మిలిటరీ దుస్తుల్లోవున్న మనుషులపై ఇతను అధికారం చెలాయిస్తున్నారు!' దానికి కారణం అతనిలో కనివించే ధోరణి, వేషబాషలేకదా? నాకు అతనంటే మర్యాద ఎక్కువైంది. కాని ఆ మధ్యహ్నం అతను అనాసిపండుతోలు ఒలుచుతూ ఆ పట్టాలని అలాగే తన కాలుకింద పడేయడంచూసి నాకు అతనిమీదున్న గౌరవంకి దెబ్బ

కలిగింది. కాని అతనికి మంచి మనసుంది, అందరికీ అనాసిపండు దొరికిందనే సంతోషంవలన నేను సహించాను."

"భలే, ఇవన్నీ వినడానికి బాగున్నాయి!" అన్నాడు రాజు.

ఇక భామా తన అనుభవాలు చెప్పడం మొదలుబెట్టింది:

"గడచిన సంవత్సరం నేనూ, మా ఆయన మద్రాసుకి వెళ్ళాం. మద్రాసుకి వెళ్ళాలని నిశ్చయం చేసుకున్నవెంటనే నా మనసులో ఒకటే ఆరాటం! 'మద్రాసు వీధుల్లో, ఎండలో నడుస్తున్నప్పుడు ఎటువంటి చీరలూ, రవికలూ, చెప్పులూ, తొడుక్కోవాలి?' అని ఆలోచిస్తూ నేను రోజులు గడిపాను. నాకు మద్రాసు నగరంలో ఊరక తిరగడమంటే చాలా సరదా! అదేగాక, రెండు వారాలు మన ఇష్టం వచ్చినట్టు పాటకచేరీలూ, డాన్సులూ అన్నీ చూస్తాం అన్నప్పుడు మన మనసులో ఎటువంటి కల్పనలు మొలుస్తాయో ఎవరికి తెలుసు? మద్రాసులో వయసు మళ్ళినవాళ్ళుకూడా handbag లేకుండా బయటికి వెళ్ళరు. కాని నాకు handbag తో నడవడం చేతకాదు. అవును! నేనంటున్నది ఇదే! 'నాగరీకమైన యువతిగా నేనందరికీ కనిపించాలి!' అని నా ఆశ, కాని నాలో ఎప్పుడూ పిరికితనం చోటుచేసుకుంటుంది . . .

నేను మద్రాసులో ఉన్నప్పుడు నా స్నేహితురాలు ఒక తామ్ర బిందె కొనితెమ్మని నాకు ఉత్తరం రాసింది. ఆమె సహాయంతో నేను మా ఇంటికి చాలా సరకులు కొనివున్నాను. మరి ఇప్పుడు ఎలాగ నేను ఆమె కోరిక నిరాకరిస్తాను? బిందె కొనేసాను; మంచి వేళ, అంగడివాడు బిందెకి తళతళమని మెరుగుబెట్టి ఇచ్చాడు, చూడడానికి చాలా ఇంపుగావుంది. దాన్ని చెయిలో పట్టుకొని నడిచాను. నడుములో పెట్టుకొని నడవాలంటే సిగ్గు! మార్చి, మార్చి, కుడి, ఎడం చేతుల్లో దాన్ని పట్టుకొని నడిచాను. మామూలుగా నేను తమిళుల చీరకట్టుతో ఉండివుంటే బిందెతో నా వాలకం చూసేవాళ్ళకి - ఇంపుగా ఉంటుందేమో? కాని నేనప్పుడు కట్టుకున్న నైలాన్ చీర, కాలర్ రవిక, high heel చెప్పులకి అది ఎంత విరుద్ధం! సాయంకాలం ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా జనులు! బస్సులో జాగా దొరక్క, గంటలకొలదీ కాచుకొనివున్నాం. అందరి చూపూ నామీదే! నాకు ఏడవాలనిపించింది, కాని నవ్వేసి ఊరుకున్నాను. చక్కగా handbag తో మద్రాసు నగరంలో నడవకుండా నాకు ఇదేం

గతి?' అని మావారితో నొచ్చుకున్నాను. 'నేను హీరోయిన్, మీరు విల్లన్! అని అందరూ అనుకుంటారేమో?' అని అన్నాను. 'నన్ను విల్లన్ అంటున్నావా?' అని అతను చీదరపడ్డారు. 'అసలు నేను ధైర్యంగా ఈ బిందెతో తిరుగుతున్నాను, అందుకే నన్నందరూ మెచ్చుకోవాలి!' అని నాకు నేను చెప్పుకున్నా మనసులో నేను బాధపడుతూనేవున్నాను. ఎలాగో ఆఖరికి బస్సులో జాగా దొరికింది, మేం ఎక్కి కూర్చున్నాం; ఎవరో ఒకతను మాకు జాగా ఇచ్చారు. "ఈ రోజుల్లో ఆడవాళ్ళకి ఎవరూ జాగా ఇచ్చే అలవాటు లేదు; బిందె చూడగానే నీకు జాగా దొరికింది! Handbag ఉంటే నీకా జాగా దొరికివుండదు!" అన్నారు ఇతను. ఆ ఘటన తలచుకుంటే ఇప్పుడుకూడా కటువుగావుంది; మద్రాసు రేడియో స్టేషన్ లో కచేరీ చేసే ఛాన్సు దొరికి నేను మజాగా వీణతో నడిచివెళ్ళడం జరిగితే ఎంత బాగున్ను! ఆ అదృష్టం నాకు లేదు కాబోలు! ఆ తామ్ర బిందెతో నేను తహతహలాడిన నాలుగవరోజు ఒక పాత ఫిడేలు ఒక స్నేహితుడి ఇంటిలో చేర్చాలని మేం వెళ్ళాం; ట్రామ్ లో ప్రయాణం చెయ్యాలి. 'సరే, ఈ సారి ఇది మీ బాధ్యత!' అని మావారికి అప్పగించాలనుకున్నాను. ట్రామ్ లో కిక్కిరిసిన జనం; నాకు ముందు భాగంలో, డ్రైవరుకి సమీపంలో జాగా దొరికింది. అతనెక్కడో వేలాడుతున్నారు! ఫిడేలుపెట్టె నాదగ్గరేవుంది. దానితో ఏదో ఊరేగింపులో నిలబడుతున్నట్టు నేనందరికీ కనిపించాను. బండిలో ప్రయాణం చేస్తుంటే వీధిలో అందరి దృష్టి నా ఎర్రచీర మీదనే! 'నాయనా, ఎవరైనా కొంచెం జరిగితే నేను ట్రామ్ లోతట్టుకి వెళ్ళవచ్చుకదా?' అని అత్యాశతో అలాగే నిలబడిపోయాను.

అలాంటి రైలు అనుభవమూ నాకుంది. రైల్వే పాస్ ఉన్న ఒక కుటుంబంతో నేనొకసారి ప్రయాణం చేసాను. నాకు టికెట్టు అక్కరలేదని అనేసారు. ఆ కుటుంబంలో నేనూ, వాళ్ళ అమ్మాయి ఒక పాస్ లోనూ, ఇతరులు వేరే ఒక పాస్ లోనూ ప్రయాణం చేస్తున్నట్టు ఏర్పాటు. మేమున్న రెండవ తరగతి కంపార్టుమెంటులో మమ్మల్ని తప్పిస్తే ఇద్దరే ఇద్దరు ప్రయాణీకులు. వాళ్ళు మాగురించి అడిగినప్పుడు ఆ కుటుంబంలోని ఇల్లాలు తన పెద్ద అమ్మాయీ, నేనూ వేరే ఒక సంసారంకి చెందినవాళ్ళం అని అనడం విన్నతరువాతే నాకా ఏర్పాటు బోధపడింది. కొంతసేపు తరువాత ఆవిడ కడాపాటి అబ్బాయి నిద్రనుంచి లేచాడు. 'అక్కా', 'అక్కా' అంటూ దూకాడు. ఆ తల్లి తన

కూతురుతో 'వాడిని కొంచెం ఎత్తుకోవే, నీదగ్గరకి రావాలంటున్నాడు!' అని అంటూ పసివాడిని ఆమెకు అందించారు. అక్కయ్యే తమ్ముడికి ఎప్పుడూ పాలు ఇవ్వడం అలవాటని నాకు తెలిసింది! అదీ ఒక ప్రశ్నగా మారుతుందని నాకనిపించింది. ఆవిడ నాతో చూడమ్మా, పాపకి నువ్వంటే చనువుంది. మరి మీ ఇంట్లోనేగా వాడెప్పుడూ ఉంటున్నాడు అని అన్నారు. ఆవిడ మాటలు గౌరవించాలని నేను పాపని చూసి 'రా, నాయనా' అని చెయి చూపాను. అంతే, పాప బిగ్గరగా ఏడవడం ఆరంభించింది! అక్కయ్యకీ, తమ్ముడికీ మొహంలో అంత బిగువైన పరిచయమన్నమాట! పసివాడు ఆమెదగ్గరకే వెళ్తానంటున్నాడు. ఈ గొడవంతా నేను వాళ్ళతో ప్రయాణం చెయ్యడంవలనేకదా? పాపం, ఆ తల్లికి చాలా బాధగావుంది. ఏంచెయ్యాలో తెలియక ఆవిడ తకమకలు పడుతున్నారు! నాకూ బాధగావుంది. మరేం ఆలోచించకుండా నాకు తలనొప్పిగా ఉంది అని అంటూ ఆ రాత్రి నిద్రపోయాను. అన్యులెవరైనా నన్ను అడిగితే నేనుగాని వదరుపిచ్చిగా ఏమైనా చెప్తే నాకు సహాయం చేస్తున్న ఈ కుటుంబం గతి ఏమౌతుంది? ఇలాగే నేను నా ప్రయాణమంతా విసుగ్గుంటూ గడిపాను.

ఒకసారి నేను బస్సులో ముగ్గురు స్త్రీలు కూర్చుండే సీటులో ఇద్దరు స్త్రీలమధ్య కూర్చునివున్నాను. మావారు సీటు దొరక్క కొంచెం సమయం నిలబడ్డారు; ఆ తరువాత మెల్లమెల్లగా జరుగుతూ ఒక ముందు సీటులో జాగా చేసి కూర్చున్నారు. ఆ తరువాత నా కుడిపక్కన ఉన్న స్త్రీ దిగి వెళ్ళిపోయింది. నా ఎడం పక్క ఖాళీ; కుడిపక్కన, బస్సులోకి ప్రవేశించే మార్గంలో జాగా ఉన్నా అందులో ఎవరూ కూర్చోరని నేను బాధపడ్డాను. ఇంతలో ఒకతను - ముప్పైయేళ్ళు ఉండవచ్చు - రెండు చేతుల్లోనూ సంచులతో బస్సెక్కి రావడం చూసాను. బండి గమనంలో ఉంది. అతను జేబునుంచి చిల్లర తీయడానికి ప్రయత్నిస్తున్నారు. మా ఆయన బస్సు చివర, నేనొక మూల. నా పక్కన నిలబడియున్న ఇతన్ని 'కూర్చోండి!' అని అనడానికి నేను జంకాను. అక్కడున్న తక్కిన స్త్రీలతో కలుసుకొని, నాచీర మొన లాగ్గొని, ఓరగా, ఒక మూల కూర్చున్నాను. నాకు ఆక్షేపణ లేదని ఊహించి అతను 'నేను కూర్చోనా?' అని అడగ్గానే నేను సరేనని తలూపాను. పాపం, నేను తలూపడానికి ముందే అతను తటాలున కూర్చున్నారు! ఆ సమయంలో నాకు మరేం చెయ్యాలో తెలియలేదు.

‘ఇదొక అత్యవసర పరిస్థితి, నేనేం తప్పు చెయ్యలేదు!’ అని నాలో నేనే చెప్పుకున్నాను. బస్సునుంచి మేం దిగినతరువాత మా ఆయన ‘నువ్వు సరైన పని చేసావ్!’ అని అనగానే నాకు గర్వంగానే అనిపించింది. ఐతే ఇప్పుడు ‘ఆరోజు నాకెలా ధైర్యం వచ్చింది?’ అని ఆలోచిస్తే భయమూ, ఆశ్చర్యమూ కలిసివస్తున్నాయి . . .

“నేను మద్రాసులో ఉన్నది కొన్ని రోజులే! అప్పుడే నాకిన్ని అనుభవాలు! మద్రాసులోనే బస ఐవుంటే మూటలు మూటలుగా కథలూ, నవలలూ, రాసి పారేసుంటాను!” అని భామా అంది.

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, అక్టోబర్ 20, 1951)**

# చెదరని మనసులో సువాసన

"నేను అమ్మకి ఒక మంచి రవిక గుడ్డ కొన్నాను" అన్నాడు రఘు.

"బాగుంది! ఆఖరికి ఒక రవిక గుడ్డకే ఇంత హడావిడి అన్నమాట! ఏం, ఒక మంచి చీర కొనలేకపోయావా?" అని జానా అన్నయ్యని వెటకారంగా అడిగి వదిన మీద ఒక చూపు విసిరింది.

ఆడపడుచు మాటలు తనకి నిందాపూరితంగా కనిపించలేదనే భావనలో రాజీ ఒక చిరునవ్వు నవ్వింది; రఘుపతికూడా పకపకమని నవ్వేసాడు.

"ఇదిగో, రఘు!" అని అతని తల్లి కావేరీ అమ్మాళ్ ఒక కంచు గ్లాసులో అతనికి కాఫీ అందించారు. 'ఈ అబ్బాయి మనసులో తల్లి జ్ఞాపకం స్థిరంగా ఉంది!' అని నోరు తెరచి ఆవిడ అనకపోయినా ఆమె మొహంలో ఆ అభిమానం కనిపించడం చూసి పక్కనే నిలబడివున్న రాజీకి ఊఅట కలిగింది.

కాఫీ తాగినవెంటనే జానా ఒక పుస్తకం, కలంతో హాలులో ఒకమూల పనిలో లీనమైపోయింది; రఘుపతి చెయిలో ఒక పత్రిక అందుకొని వసారాకి వెళ్ళిన తరువాత అక్కడ తన్ను కలుసుకోవాలని వచ్చిన స్నేహితులతో ముచ్చటలాడసాగాడు. రాజీ అత్తగారికి సాయం చెయ్యాలని వంటగదికి దారితీసింది; ఆమె చేతులు పనిచేసాయి, కాని దేహంలోని బడలిక పోలేదు. మరి మనసో? అది ఆమె తీసుకువచ్చిన పెట్టెమీదనే ఉంది . . .

ఆ పెట్టెలో ఒక పట్టుచీర ఉంది; సరికొత్త, తొమ్మిదిగజాల చీర; అది రఘు తన డబ్బుతో కొన్నాడు. అది కట్టుకోవడానికి రాజీకి అర్హతవుంది; భర్తకూడా అనుమతి ఇచ్చేసాడు. కాని . . .

ఆరోజు పొద్దునే జరిగిన సంభాషణ తరువాత ఆ చీర తనకి స్వంతం అని వరించడానికి రాజీ మనసు ఆమోదించలేదు. కాఫీ సువాసన వ్యాపించే తరుణంలో ఆ సంభాషణ ఆరంభమైంది, దానికీ ఆ కాఫీ సువాసన పచ్చేసింది! అందరూ ముచ్చటగా ఏమేమో చెప్పుకున్నారు, నవ్వుకున్నారు; అందరి మనసులోనూ సహానుభూతి చోటు చేసుకుంది. కాని కోడలు రాజీ మనసు పెద్ద చిక్కులో పడిపోయింది!

అవును, కాఫీ ప్రభావం అంటే అదే! రఘు చులకనగా చెల్లెలు మాట తోసిపారేసాడు, కాని రాజీకి అది సాధ్యం కాదే!

'అత్తయ్యకి రవికగుడ్డతో ఈ చీరకూడా ఇవ్వాలి' అని స్పష్టంగా భర్తకి చెప్పేయాలని రాజీ నాలిక తహతహలాడింది; తప్పకుండా చెప్పివుంటుంది; కాని తగిన సమయం దొరకలేదు. అత్తగారింట్లో భర్తతో ఒక ఐదు నిమిషాలుకూడా  ఏకాంతంగా మాట్లాటడం అలవాటు చేసుకోలేని రాజీకి ఇటువంటి అవకాశం కల్పించుకోడం బొత్తిగా తెలియదే!

ఆమె ఆలోచనలో ఆవేశం తగ్గింది, కాని ఆ అవగాహన మనసుని మెల్లమెల్లగా ఆవరించేసింది. క్రమంగా నాకలి సంచలించడం తగ్గినా మనసులోని తపన పెరుగుతూనేవుంది.

'చీరని అత్తయ్యకి ఇచ్చేయాలి, అప్పుడే నాకు మనశ్శాంతి దొరుకుతుంది,' అని రాజీ నమ్మింది. ఆ చీరని తన పెట్టెలో ఉంచుకొని అత్తయ్యకి రవికగుడ్డ, ఆడపడుచుకి నూలు చీర ఇస్తే అసభ్యంగా ఉంటుందని ఆమె ఉద్దేశం. ఐనప్పటికీ ఆ భావనలు అలాగే మనసులో స్థిరపరచడానికి తనకి బలం లేదని రాజీ బాధపడింది. అవును! ఎంత చెట్టుకి అంతే గాలన్నట్టు తనకీ ఒక సాధారణ ఆశ ఉంది: ఆమె భర్త తన మొట్టమొదటి జీతంతో ఆ చీర భార్యకి కొనితెచ్చాడు. దాన్ని త్యాగం చెయ్యడమంటే ఎలాగ? ఒక ఆడదానికి అదేం అంత సులభమైన పనా?

రాజీ అనుకున్నట్టే అగత్యంలేని ఒక తడబాటు లేచింది; తనిప్పుడు మంచి అవస్థలో చిక్కుకుంది!

రాజీ, రఘుపతి మూడు వారాల సెలవుల్లో నిన్న రాత్రి ఇక్కడకి వచ్చారు. ఆ పట్టుచీర కొని రెండువారాలయ్యాయి; ఒక శుక్రవారం అది తొడుక్కుందామని రాజీ నిశ్చయించింది. ఒక శుక్రవారం, ఆ తరువాత ఇంకొకటి, గడిచిపోయాయి. 'మూడో శుక్రవారం రాబోతుంది, చీరకట్టుకి సమయం వచ్చేసింది!' అని రాజీ ఆలోచిస్తుండగా బుధవారం ఉదయం సెలవులగురించి దంపతులు వార్త విన్నారు; వెంటనే గురువారం బయలుదేరారు. ఇవాళ, మళ్ళీ శుక్రవారం వచ్చేసింది!

రెండురోజులు కాచుకొన్న తరువాత సెలవులు ఆరంభమైవుంటే రాజీ - ఈ శుక్రవారం - అక్కడే ఈ చీర కట్టుకొని ఉంటుంది; అప్పుడు ఎటువంటి చిక్కూ ఉండదు.

చీరని అవిష్కరించి ఒక సారి తొడిగినా, లేక పదిసార్లు తొడిగినా అదొక వాడిన వస్త్రం కిందే లెక్క! ఇప్పుడేమో అది మడతలు చెదరకుండా పెట్టెలో అలాగే ఉండడంవలనే ఈ బాధ! అందుకే రాజీ మనసు ఇలా తత్తరపాటు పడుతోంది!

నిజం చెప్పాలంటే రాజీ మనసులోని ఆరాటంకి కారణం అది మడతలు లేని చీరగా ఉండడం వలన మాత్రం కాదు. ఒక విధమైన కలవరపాటు ఈ చీర కొన్నప్పుడే ఆమెకు కలిగింది; దానిగురించి ఆలోచనా, ప్రభావమూ ఇప్పుడు ఈ ఆరాటంకి దారి తీసాయి.

రఘుపతి స్నేహితుడు సుబ్బు తన భార్యకని కొన్న నాలుగు పట్టుచీరలు రఘుకి చూపించాడు. "ఇందులో ఒకటి నీ మిస్సస్ కి ఎంచుకోవయ్యా, నాకు మూడు చాలు!" అని అన్నాడు. ఆ సమయం సుబ్బు ఇంటిలో అతని భార్య శ్యామళ, రాజీ, దగ్గరలో కొంత దూరంలో కూర్చొనివున్నారు. శ్యామళ తనకి వజ్రపు దిద్దులు, గాజులు కొనాలని ఆలోచించి ఒక చీర తిరిగి ఇచ్చేయమని భర్తకి చెప్పింది; ఇప్పుడు తన భర్త మాటలు విని ఆమె సంతోషించింది.

సుబ్బు సలహా వినగానే రఘు భార్య మొహం చూసాడు. చీర కావాలనే ఆశ ఆమె మొహంలో కనిపించింది. కాని ఆమె నోటిలోనుంచి వచ్చిన మాటలు వేరే. "వద్దు! ఇప్పుడెందుకు నాకు చీర? పండుగ, పబ్బం ఏదీ లేదే?" అని అంది.

"ఏమే రాజీ, నీకు పండుగకి మాత్రం చీర కొనే అలవాటు ఉందా ఏమిటి? నువ్వు దీపావళికి కొన్న ఆ నూలు చీర నేను చూసానుగా - అది ఎంత అధ్వాన్నం అని నాకు తెలుసు! ఇప్పుడు ఒక మంచి చీర ఎంచుకో!" అని శ్యామళ రాజీని ప్రోత్సాహించింది.

"వద్దు శ్యామళా! ఇప్పుడు నాకే చీర తప్పనిసరిగా కావాలని లేదు," అని తడబడుతూ రాజీ జవాబు చెప్పింది.

"అలాగా? మీ అయన మనసులో ఏముందో నీకు తెలుసా? అంతా నీ కల్పన! అతనికి 'కొవాలి' అని అనిపిస్తే కొననీ, సరేనా?" అని అంది శ్యామళ.

ఆ దినం ఏదీ నిశ్చయమవలేదు. సుబ్బు ఇల్లునుంచి వచ్చినప్పుడు రాజీ, రఘు ఎమేమో మాటాడుకున్నారు; చీరగురించి ఏ చర్చా లేదు.

మరుసటిరోజు పొద్దున్నే రఘు సుబ్బు ఇంటికి త్వరగా నడిచివెళ్ళాడు. అతను ఇంటినుంచి బయలుదేరినప్పుడు ఎక్కడ వెళ్తున్నాడని రాజీకి తెలియదు; అతనూ

చెప్పలేదు. ఇంటికి తిరిగివచ్చినప్పుడు ఒక చీరతో వచ్చాడు. అది చూసి రాజీకి ఆశ్చర్యమూ, సంతోషమూ కలిగినా జంకుతూ "బాగుంది! ఇదెందుకు దీన్ని ఇప్పుడు కొనితీసుకువచ్చారు?" అని అడిగింది.

"నువ్వు 'వద్దు!' అనేసావ్. ఈ చీర నేను కొనలేదనుకో, సుబ్బు కొంచెం ఇబ్బంది పడతాడు. 'సరేలే, అమ్మకి ఈ  చీర ఉండనీ!' అని కొనేసాను!" అని అంటూ రఘు చీరని ఒక పొట్లంనుంచి బయటకి తీసినప్పుడు రాజీకి గుండెలో ఆయాసం కలిగింది.

"చీర బాగానే ఉంది; పట్టు కూడా మంచి తరంలా కనిపిస్తోంది. శ్యామల అభిరుచి గురించి వేరే చెప్పాలా?" అని అంటూ రాజీ ఎలాగో సవరించుకుంది.

ఆమె గొంతులోని చాపల్యం రఘుకి బోధపడిందేమో? అతను తలయెత్తి భార్య మొహం చూడనేలేదు; అతని ధ్యానమంతా ఆ చీర మీదనే ఉంది.

రాజీకి ఆ చీరని చెయిలో తీసుకొని చూడడానికి ధైర్యం రాలేదు.

భర్త స్నానంకి వెళ్ళినప్పుడు రాజీ ఆతురతతో ఆ చీరని చూస్తూ నిల్చుంది. కాని గభీమని  కొంత సేపట్లోనే అతను తిరిగివచ్చేసాడు; సబ్బు పెట్టెలో ఉన్నదేదో ఖాళీ ఐపోయిందని కొత్త సబ్బు కావాలని అతను వస్తాడని ఆమెకెలాగ తెలుసు?

"నువ్వేం చీర పరిశోధన చేస్తున్నావా?" అని రఘు అడిగాడు.

అతను రాగానే నెత్తుటి చేతులతో  చిక్కుకున్నదోషిలాగ రాజీ ఉలికిపడింది. కాని భర్త ప్రశ్నలో కొంటెతనం, సరసం గమనించిన తరువాత సిగ్గుకోబాటు ధైర్యమూ ఆమెకు కలిగింది. కాని అతన్ని నేరుగా చూడడానికి బిడియం!

"ఏం, నేను చూడకూడదా? నాకూ ఈ చీర కావాలేమో అని ఆలోచిస్తున్నాను."

"బాగా చెప్పావ్!"  అని అంటూ రఘుపతి స్నానం గదికి దారితీసాడు; ఇక ఆ చీర తనకే స్వంతం అని రాజీ గుర్తుచేసుకుంది.

తన ఆశ రూఢీచేసుకోవాలని అవాళ మధ్యాహ్నం మళ్ళీ ఆ చీర గురించి రాజీ మాటాడింది.

"'రేడియో కొనాలని డబ్బు కూడపెట్టున్నాను!' అని మీరనడం నాకు తెలుసు. అందుకే చీరకోసం నేను ఆశించడం న్యాయం కాదని ఊరుకున్నాను. కాని చీర తప్పకుండా కొనాలని నిశ్చయమైన తరువాత నాకూ ఆ చీర కావాలని అనిపిస్తోంది!

మీరన్నట్టు అత్తయ్యకే ఆ చీర ఇవ్వండి; ఆవిడకని మీరది కొన్నారు. నేను ముందు వద్దన్నాను. ఇప్పుడు కావాలని అంటే మీకెలా ఉంటుంది?" అని రాజీ అడిగింది.

"ఎందుకీ పనికిరాని మాటలు? నేనుగాని అమ్మకని ఈ చీర కొనివుంటే ఆ ఉద్దేశం మార్చుకోను, తెలిసిందా? నువ్వూ, అమ్మా - మీ ఇద్దరిలో ఎవరికైనా సరే - అని ఈ చీర కొన్నాను. నీకు కావాలంటే, సరే, తీసుకో, నాకు ఆక్షేపణ లేదు!" అన్నాడు రఘు.

"అలాగైతే, సరే, నేను తీసుకుంటాను! . . . ఇవాళ . . . గురువారం . . . రేపు శుక్రవారం ఆ చీర కట్టుకుంటాను!" అని రాజీ సంతోషించింది. కాని ఆ శుక్రవారమూ, ఆ తరువాతి శుక్రవారమూ ఆ చీరకట్టు జరగలేదు. ఈ మూడవ శుక్రవారంకూడా వచ్చేసింది!

'తల్లి తర్వాత భార్య' అనే నియమం పాటించే రఘు అలాగే ప్రవర్తించడం రాజీకి తెలుసు; తన భర్త తన మొట్టమొదటి జీతం - రెండువందలయాభై రూపాయలు - తల్లికి సమర్పించడం ఆమెకి తెలుసు; తమ్ముడు, చెల్లెళ్ళకి తినుబండారాలు కొని ఇచ్చాడు; ఆ తరువాతే తనకీ చీర లభించింది! అందువలనే ఆ రోజు ఈ చీర స్వీకరించడంలో తను ఎటువంటి తప్పు చెయ్యలేదని రాజీకి నమ్మకం కలిగింది. ఇక్కడికి వచ్చిచేరినతరువాతకూడా భావనే నెగ్గింది. కాని ఇవాళ, ఆ చిన్న సంభాషణ తరువాత ఆ నమ్మకం పోయింది!

'ఇదేదో పరీక్షలాగుందే! దేవుడి దృష్టిలో ఆ చీరకి అర్హత అత్తయ్యకే కాబోలు! లేకపోతే తను ఎందుకు ఆ చీరకట్టు ఇన్ని రోజులు త్రోసిపెట్టాలి? గభీమని సెలవులెందుకు దొరకాలి? నా భర్త తన తల్లికి బహుమానంగా రొక్కమిచ్చారు, అది ఒక పెద్ద పొరబాటు; ఆవిడకి తప్పకుండా అతనొక ఒక చీర కొనివుండాలి! అతనలా చెయ్యలేదు కాబట్టి ఈ చీరకి నాకు అర్హత లేదు.' ఇటువంటి ఆలోచనలు రాజీ మనసులో మళ్ళీ మళ్ళీ లేచాయి. 'నాకని నా భర్త ఆ చీర కొనలేదు, నాకు దానిమీద ఎటువంటి హక్కూ లేదు! నేను నిన్ననే వచ్చిన భార్య! అతని తల్లి కంటే నాకేం ఎక్కువ అర్హత ఉందా ఏమిటి?' అని ఆమె మనసు ఎత్తిపొడిచింది.

కాని, ఆ పట్టు చీరని చూస్తుంటే రాజీకి ఆశ మరింత తీవ్రంగా పెరిగింది! తేలికైన బూడిద రంగులో చూడడానికి అది ఎంత ముచ్చటగా ఉంది! శ్యామళ సంప్రదాయం

పాలించే స్త్రీ; ఆమె ఏరుకోవటం సరిగ్గానేవుంటుంది. రాజీ అత్తయ్య వయసులో పెద్దవారు, ఒక వేళ ఈ చీర ఆవిడకి అనుచితంగా కనిపిస్తుందేమో? తను దీపావళికి పట్టుచీర కొనుక్కోలేదు, మరి ఇప్పుడు  ఈ పట్టుచీర కొనుక్కుంటే పొరబాటేమైనా ఉందా? “నేను రవిక గుడ్డ కొనితెచ్చాను,” అని రఘు అన్నప్పుడు చీరగురించి అతను ఏమీ అనలేదు. మరి ఇప్పుడు ఆ నాణ్యమైన చీరతో రవిక గుడ్డ బహుమానంగా ఇస్తే అత్తయ్యకి అనుమానం కలుగుతుందేమో? తను ఎటువంటి తప్పూ చెయ్యలేదని రాజీ నమ్ముతోంది, మరి తను సూటిగా మరేం బాధ పడకుండా ఆ చీర అవిష్కరించడంలో తప్పేముంది?

కాని మాటి మాటికీ ఒక నిజం గుర్తుకి వచ్చి ఆమెను పీడించింది: భర్త తనకని ఈ చీర కొనలేదు. ‘ఇది తొమ్మిదిగజాల చీర, అత్తయ్యకని కొన్నారు’ అని అర్థం చేసుకుంటే ఎటువంటి అనుమానమూ రాదు; ‘మీకని అతను ఈ చీర కొన్నారు!’ అని అత్తయ్యకి చెప్తే ఆవిడ ఎంత సంతోషిస్తారు!’ అని రాజీ ఆలోచించింది. ‘ఇది మీకోసం కొన్న చీర!’ అని ఆవిడకి చెప్పేయాలని నిశ్చయించుకుంది.

కాని ఆ పథకం కూడా మోసంలాగ రాజీకి తోచింది. ‘నిజం చెప్పడానికి నేనెందుకు భయపడాలి?’ అని అంతరాత్మలో ఒక ప్రశ్న లేచింది.

‘ఈ చీరగురించి నిజం దాచితే ఇక్కడున్న మూడు వారాలూ నాకు మనశ్శాంతి ఉండదు. ఇక్కడ ఏమీ చేయక, దొంగలాక ఊరుకొని ఊరుకి తిరిగివెళ్ళిన తరువాత ఆ చీరని వాడడం నాకు చేతకాని పని. అప్పుడుమాత్రం మనశ్శాంతి వచ్చేస్తుందా ఏమిటి? ఏదీ దాచడం మంచిదికాదు!’ అని రాజీ మనసుని దృఢపరచుకుంది: ‘ఈ చీర కొన్న నేపథ్యం ఏమిటో అత్తయ్యకి వివరించి చెప్పేయ్యాలి; దాన్ని వచ్చే శుక్రవారం తొడుగుతాను, ఇవాళ వద్దు!’

అంతరాత్మలో ఇప్పుడు సంతాపం లేదు.

ఆ తరువాతి రెండు మూడు రోజులూ రాజీ చీరగురించి ఆలోచించనేలేదు; రఘుపతికూడా ఏమీ అనలేదు.

'అతను ఆ రోజు చెల్లెలు జానా అన్న మాటలూ, నా పెట్టెలో మడతలు లేని ఒక చీర ఉందన్న సంగతీ బాగా మరిచిపోయారు కాబోలు!' అని రాజీ అనుకుంది. 'నాది ఆడ జన్మకదా, నేనే అన్నిటిగురించీ బాధ పడాలి!' అని విసుగ్గుంది.

నాలుగవరోజు పూజ సమయంలో అత్తా కోడలూ దారం మలుపుతూ దీపాలకి వత్తులు చేస్తున్నారు. అప్పుడే నిజమేమిటో - ఎటువంటి త్రిప్పులు లేకుండా - అత్తయ్యకి తెలియజేయాలని దాజీ పూనుకుంది; తలచుకుంటే అది ఆమెకే వింతగా ఉంది!

"అమ్మా, మీకొక సంగతి చెప్పాలని నేను రెండురోజులుగా ఆలోచిస్తున్నాను . . . " అని రాజీ ఆరంభించింది.

మనవడో, మనవరాలో పుట్టబోతన్నారని కావేరీ అమ్మాళ్ కల్పన!

"అదేం సంగతో చెప్పు, వింటాను . . .  నేనూ నీ మొహం తెల్లబాటివుండడం చూసి ఊహించాను . . . "

"అలాగేం కాదమ్మా," అని రాజీ నవ్వేసింది. నవ్వుతోబాటు ధైర్యమూ వచ్చేసింది: "అతను నాకొక పట్టుచీర కొన్నారు. నాకు సిగ్గుగా ఉంది . . . అది . . . " అని సణగ్గుంది.

"అలాగా?రఘు చీర కొన్నాడా? మంచిది. నీకెందుకు సిగ్గు? బాగా చెప్పావ్ . . . నాకూ వినడానికి చాలా సంతోషంగా ఉంది . . . వాడొక సంవత్సరంగా నెలకి మూడువందలు ఆర్జించుతున్నాడు . . . నీకొక చీర కొంటే తప్పా? ఇదొక శుభవార్త అని మనం సంతోషించాలి . . . " అని ఆవిడ అన్నారు.

"అమ్మా, మీకు తెలియజేసిన తరువాతే నాకు మనశ్శాంతి  . . . అది వాడడానికి నాకు సిగ్గేసింది . . . ఇప్పుడు మీ మాటలు విని నా బిడియం పోయింది!" అని రాజీ నవ్వింది. ఒక గెంతు గెంతి దేవుడి పఠంముందు ఒక దీపం వెలిగించింది. "నా అత్తగారు దేవతలాగ!' అని మనసార శ్లాఘించింది.

రెండురోజులు గడిచాయి; శుక్రవారం ఆ చీర అవిష్కరించి రాజీ అందరనీ నమస్కరించి దీవనలు అందుకుంది.

ఆ రోజు సాయంకాలం ఎదురింటి ముత్తైదువ వచ్చారు. ఆవిడ తిరిగివెళ్ళినప్పుడు వీడ్కోలు చెప్పడానికి కావేరీ అమ్మాళ్ ఆమెతో గడపవరకూ నడిచివెళ్ళారు. అప్పుడు ఆవిడ " కావేరీ, అబ్బాయి నీకేం కొనితెచ్చాడు?" అని అడిగారు.

"నాకొక మంచి రవిక గుడ్డ, జానాకి మంచి నూలు చీర తెచ్చాడు. చూడండి, రాజీ చీర కూడా కొత్తదే! అది తొమ్మిదిగజాల చీర, నాకోసం కొన్నాడేమో, నాకు తెలీదు. కాని చాలా నాజూకుగా ఉంది, రాజీకనే కొన్నాడు కాబోలు! వాడొక సంవత్సరంగా ఉద్యోగం చేస్తున్నాడు, మంచి సంపాద్యం ఉంది! ఇన్నిరోజుల కాపురం తరువాత రాజీకి మరేం కొని ఇచ్చినట్టు నాకు తెలియదు! సమగ్రంగా ఇదొకటే దానికి కొన్నాడనుకుంటాను! నా అబ్బాయీ, కోడలూ, ఏది చేసినా సరిగ్గానే చేస్తారు. తప్పు చేసినా అది అల్పంగానే ఉంటుంది!" అని ఆవిడ అన్నారు.

ఊపిరిపట్టుకొని అత్తగారి మాటలు వింటున్న రాజీ నెమ్మదిగా ఒక నిట్టూర్పు విడిచింది.

"'అత్తగారు దేవతలాగున్నారు!' అని అన్నాను. అది పొరబాటు! నా అత్తగారు ఒక దేవత!" అని రాజీ ఉప్పొంగింది; కళ్ళని తేలికగా మూసుకుంది.

ఎటువంటి కళంకమూ లేకపోవడం దైవత్యం; కళంకం ఉన్నా దాన్ని తీసిపారేసి హితం విస్తరిల్లే శక్తికి దేవత అని పేరు.

'మీ అత్తగారికి తగిన కోడలు నువ్వే!' అని అని అంటూ ఆమె కళ్ళు తుడుస్తున్నట్టు రాజీ చెయిలోని బయలుదేరిన వాసన ఆమె మొహంని తాకింది. ఒక చిన్న ఆలోచనా, లోకజ్ఞానం ఉంటే చాలు, ఒక కుటుంబంలో సువాసన చోటుచేసుకుంటుందని ఆ అగరుబత్తి తనకి తచెప్తున్నట్టు రాజీ ఊహించింది. కళ్ళు తెరవగానే చెదరని ఆమె మనసులో ఆ సువాసన ఇంకా తేలుతునే ఉంది.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, ఫిబ్రవరి 15, 1948)**

# అనువాదకుల పరిచయం

## కే.వి.శషారావు:

జననం 1931, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేష్ లో. చదువు, (B.A), ఏ. వి.ఎన్, విశాఖపట్టంలో. 1956 నుంచి 1989 వరకూ Indian Railways లో ఉద్యోగం. యాభై సంవత్సరాలకు పైగా తెలుగు సాహిత్యంకి, ఔత్సాహిక నాటక రంగానికి కృషి చేసారు. బరంపురంలో ఆంధ్ర సంస్కృత సమితి, విజయనగరంలో కవిరాజ స్మారక ఆంధ్ర సమితి స్థాపించి నిర్వహించారు. లలిత కళా ప్రదర్శనలు ఏర్పాటు చెయ్యడంతోబాటు కన్యాసుల్కం వంటి ప్రసిద్ధమైన నాటకాల్లోకూడా నటించారు. రాజాజీ ఆంగ్లంలో రచించిన శ్రీ రామాయణం, మహాభారతం, ఉపనిషత్తులు, సంక్షిప్త భగవద్గీత, మహాత్మా గాంధీ ఆత్మకధ, తెలుగులో అనువాదం చేసారు.

ఇప్పుడు విజయనగరంలో స్థిరపడ్డారు. వీరి తండ్రిగారు కేశవమఠం లేటు తాండవ కృష్ణయ్యగారి స్మృతి చిహ్నంగా విజయనగరం 'ప్రేమ' సమాజం ముఖద్వారం నిర్మింపజేసారు.

## ఏండి సుందరేశన్:

జననం 1939 బరంపురం, ఒడిషాలోని గంజాం జిల్లాలో. ఇంజనీయరుగా తమిళనాడులో 14 సంవత్సరాలు ఉద్యోగం చేసి, ఆ తరువాత అమెరికాలో M.B.A. చదవడానికి వచ్చి, 1977లో అమెరికాలోనే స్థిరపడిపోయారు. ఉద్యోగ విరమణ తరువాత, ఇరవైఐదు సంవత్సరాలుగా తమిళ కధలు, నవలలు ఆంగ్ల, తెలుగులో బాషల్లోకి అనువాదం చేస్తున్నారు. 2013 లో ఇతను అనువదించిన నీల పద్మనాభన్ తమిళ నవలని Autumn Reveries అనే పేరుతో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. దానికి 2016 లో **నల్లి చెన్నై దిశై ఎట్టుమ్** సంస్థ బిరుదు లభించింది.

********

# వింధియా

*(1927-1999)*

